# దారి దీపం

మాసపత్రిక

DAARI DEEPAM - RNI Title Code : APTEL 16175

సంపుటి 2 - సంచిక 10 జూలై 2024 వెల : రూ.15

సంపద పునఃపంపిణీయే శరణ్యం

కొత్త నేర చట్టాలతో ప్రజలకు న్యాయం చేరువవుతుందా ?

నూతన నేర చట్టాలు నిలిపివేయాలి

ప్రస్తుత పాలనలో పిల్లల నాటకమూ నేరమే !

రాబోయే ఐదేళ్లూ.. ఆ పదేళ్ల పాలనే!

ముకుళిత భారత్, వికసిత ఇండియా

ఆర్ఎస్ఎస్ ఓ ఫాసిస్టు సంస్థ

బలహీనపడుతున్న మీడియా స్వేచ్ఛ

విద్య వ్యాపారీకరణ విష ఫలితమే 'నీట్ ' కుంభకోణం!

ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టవలసిన విద్యా సంస్కరణలు

రాజ్యాంగ పీఠికపై ప్రచారానికి విశాల వేదిక

శ్రమజీవుల ఉద్యమాలకు కొత్తచూపు

సంపద పన్ను, వారసత్వ పన్నులతో సంక్షేమ రాజ్యం

సంపద పన్నుతో సామాజిక సంక్షేమం

ఆగస్టు 9న 'కార్పొరేట్స్ క్విట్ ఇండియా డే'

వకుళాభరణం రామకృష్ణ ఇంటర్వ్యూ

చలం-మతం-దేవుడు-మనం

ఫ్రాన్స్, బ్రిటన్ ఎన్నికల్లో ఫాసిస్టు, మితవాద శక్తులకు చావు దెబ్బ !

జూలై - 2024 పేజీలు : 44

# దారి దీపం మాసపత్రిక

సంపుటి : 2 - సంచిక : 9

డీవీవీఎస్ వర్మ
- సంపాదకులు

సంపాదక వర్గం
కొప్పర్తి వెంకటరమణమూర్తి
మందలపర్తి కిషోర్
డి.సోమసుందర్
డా॥ బి.రమేష్ చంద్రబాబు

వెల : 15 రూపాయలు

## ఈ సంచికలో..

1) సంపద పునఃపంపిణీయే శరణ్యం
సంపాదకీయం 3
2) కొత్త నేర చట్టాలతో ప్రజలకు న్యాయం
చేరువవుతుందా ? - ఎ.కృష్ణారావు 4
3) నూతన నేర చట్టాలు నిలిపివేయాలి
- 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం 6
4) ప్రస్తుత పాలనలో పిల్లల నాటకమూ
నేరమే ! - అశోక్ కుంబము 8
5) రాబోయే ఐదేళ్లూ ఆ పదేళ్ల పాలనే!
- పి.చిదంబరం 10
6) ముకుళిత భారత్, వికసిత ఇండియా
- కొప్పర్తి వెంకటరమణమూర్తి 12
7) ఆర్ఎస్ఎస్ ఓ ఫాసిస్టు సంస్థ
- మధు లిమాయే 14
8) బలహీనపడుతున్న మీడియా స్వేచ్ఛ
- నంటూ బెనర్జీ 18
9) విద్య వ్యాపారీకరణ విష ఫలితమే 'నీట్ ' కుంభకోణం! -ఎస్.గోవిందరాజులు 19
10) ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టవలసిన విద్యా సంస్కరణలు - హరివెంకటరమణ 21
11) రాజ్యాంగ పీఠికపై ప్రచారానికి విశాల వేదిక 23
12) శ్రమజీవుల ఉద్యమాలకు కొత్తచూపు - డి.సోమసుందర్ 25
13) సంపద పన్ను, వారసత్వ పన్నులతో సంక్షేమ రాజ్యం - ప్రభాత్ పట్నాయక్ 28
14) సంపద పన్నుతో సామాజిక సంక్షేమం - రాహుల్ కుమార్ 30
15) ఆగస్టు 9న 'కార్పొరేట్స్ క్విట్ ఇండియా' డే 32
16) సాధారణ చరిత్ర, సాహిత్య చరిత్ర కలిసి నడవాలి
- వకుళాభరణం రామకృష్ణతో కె.శ్రీనివాస్ ఇంటర్వ్యూ 33
17) చలం-మతం-దేవుడు-మనం - కాత్యాయనీ విద్మహే 36
18) ఫ్రాన్స్, బ్రిటన్ ఎన్నికల్లో ఫాసిస్టు, మితవాద శక్తులకు చావు దెబ్బ !
- ఎం.కోటేశ్వరరావు 40
19) కార్టూన్స్ 43
20) కొత్త పుస్తకాల స్వీకారం 44




కార్టూన్ : సతీష్ ఆచార్య ఫేస్‌బుక్ సౌజన్యంతో..

దారి దీపం
మాసపత్రిక
మీ విరాళాలను ఈ క్రింది
అకౌంట్‌కు పంపండి

**Daari Deepam**
Union Bank of India
Branch : TANUKU
**A/C No : 0554 1101 0000 054**
**IFSC code : UBIN0805548**

మీ పేరు విరాళం వివరాలను..
డాక్టర్ బి.రమేష్ చంద్రబాబు
నంబరుకు విధిగా
వాట్సాప్ మెస్సేజ్ పెట్టండి.
ఫోన్ నెంబరు 93971 14495

వివరాలకు సంప్రదించండి : డా॥ బి.రమేష్ చంద్రబాబు, 34-15-1, దొడ్డిపట్ల వారి తోట వీధి, తణుకు - 534211, ప.గో.జిల్లా, ఏపీ ఫోన్ : 93971 14495

దారి దీపం గత సంచికల కోసం : DVVSVARMA.COM

సంపాదకీయం



# సంపద పున:పంపిణీయే శరణ్యం

ఇది బడ్జెట్ల కాలం. కేంద్ర, రాష్ట్ర బడ్జెట్లు ఆశల మోత మోగిస్తాయి. అరచేతిలో వైకుంఠాన్ని చూపిస్తాయి. అంకెలతో మురిపిస్తాయి. బడ్జెట్ ప్రసంగాలు అభివృద్ధిని, సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తాయి. ఆర్థిక మంత్రులు అంకెల గారడీ విద్యలో ఆరితేరిన వారుగా వుంటారు. ప్రస్తుతం కేంద్రానికి రూ.171 లక్షల కోట్ల అప్పు. మోదీ 2014లో అధికారంలోకి వచ్చే నాటికి అప్పు రూ.50 లక్షల కోట్లు. ఈ పదేళ్లలో అభివృద్ధి దూసుకుపోయిందని చెప్పే మోదీ ప్రభుత్వం అప్పులలో మూడున్నర రెట్లు కూరుకుపోయింది. దీనికితోడు ప్రభుత్వ రంగ సంస్థలని, వాటిల్లోని వాటాలను అమ్మేసి లక్షల కోట్లు మూట గట్టుకున్నారు. కేవలం అప్పుల మీద వడ్డీలకే ఏటా 11 లక్షల కోట్లు కడుతున్నారు. మరోపక్క రాష్ట్ర ప్రభుత్వాలు అప్పుల ఊబిలో కూరుకుని వున్నాయి. కేంద్రం ఆదుకునే స్థితిలో లేదు. రాష్ట్రాలు ముందుకుసాగే స్థితి లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ వాగ్దానాలు అమలు చేయడానికి వున్న అవకాశాలన్నీ మూసుకుపోయాయి. జీఎస్టీ బాదుడుతో నిత్యావసర ధరలు సామాన్యుల జీవితాలను దుర్భరం చేస్తున్నాయి. ఉపాధి రహిత అభివృద్ధి చదువుకున్న నిరుద్యోగుల పాలిట ఆశనిపాతమైంది. నోట్ల రద్దు తర్వాత ఉపాధి కోల్పోవడమే గాని, పెరిగే స్థితి కనిపించడం లేదు. ఈ ఎన్నికలలో ప్రజలు ఈ అంశాలపైనే స్పందించి మోదీ సర్కారుకు గుణపాఠం చెప్పారు. ఇంక పేదలపై భారం మోపినా, సంక్షేమ పథకాలకు ఎగనామం పెట్టినా పాలక పక్షాలు అధికారం కోల్పోవడం ఖాయం.

మరోపక్క ఈ పదేళ్ల మోదీ పాలనలో కార్పొరేట్ శక్తులు సంపదను పోగేసుకున్నాయి. దేశంలో 160 మంది బిలియనీర్లు అంటే 8000 కోట్లకుపైగా సంపద కలిగిన వారు పుట్టుకొచ్చారు. ప్రతి బడ్జెట్‌లోనూ కార్పొరేట్ రంగం లక్షల కోట్లు రాయితీలు, రుణమాఫీలు పొందారు. దేశ ప్రజల సంపదలో 40 శాతం ఒక శాతం వారి వద్దకు చేరింది. పది శాతం మంది కుబేరులు దేశ సంపదలో 70 శాతంపైగా కైవశం చేసుకున్నారు. దేశంలో 80 కోట్ల మందికి ఉచిత రేషన్ ఇచ్చే స్థితిలో పేదరికం పెరిగింది. రకరకాల పన్నుల రూపంలో పేదల నుంచి, సామాన్యుల నుంచి పిండుకోవడానికి ఏమీ లేదు. కార్పొరేట్ శక్తుల దగ్గర, బిలియనీర్ల దగ్గర పోగుపడ్డ సంపద పున:పంపిణీకి సంపద పన్ను, ఆదాయ పన్ను వారసత్వ పన్నులు వారి మీద విధించడం తప్ప మార్గం లేదు. అయితే కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంపద మీద అరకొర చర్యలు తీసుకుని పబ్బం గడుపుకునే ప్రయత్నం చేసే వీలుంది. పౌర సమాజం దీనిని ఆమోదించకూడదు. మనదేశంలో ఒక శాతం మంది దగ్గర రూ.400 లక్షల కోట్ల సంపద వుంది. దానిమీద నాలుగు శాతం పన్ను విధిస్తే రూ.16 లక్షల కోట్లు వస్తుంది. ఇందులో అత్యధిక సంపన్నుల మీద మరికొంత అదనంగా పన్ను విధిస్తే దాదాపు రూ.20 లక్షల కోట్లు వస్తుంది. అలాగే వారసత్వ పన్ను మీద కూడా అంచనాలు వస్తున్నాయి. అత్యధిక సంపన్నులుగా వున్న ఒక శాతం మీద వారసత్వ పన్ను విధిస్తే మరో రూ.7.80 లక్షల కోట్లు వస్తుంది. శ్రమజీవుల సంక్షేమానికి మౌలిక ఆదాయ కల్పన, వారి పిల్లలకు హక్కుగా చదువు, వైద్యం, నివాసం కల్పించడానికి వీలవుతుంది. ఈ దిశగా ప్రజా సంఘాలు ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచాలి. ❑

**- డీవీవీఎస్ వర్మ, సంపాదకులు, 85006 78977**

# కొత్త నేర చట్టాలతో ప్రజలకు న్యాయం చేరువవుతుందా ?



- ఎ.కృష్ణారావు

**బ్రిటిష్ వారు నిష్క్రమించి కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మన ఊరు హెడ్ కానిస్టేబుల్ మారతాడా అన్న అనుమానం కన్యాశుల్కం నాటకంలో ఒక జట్కా బండి వాడు వ్యక్తం చేశాడు. దేశంలో ఎవరు అధికారంలోకి వచ్చినా వ్యవస్థల స్వభావం మారదనే చారిత్రక సత్యం ఈ వాక్యాల్లో ప్రస్ఫుటమయింది. న్యాయవ్యవస్థ పలుకుబడి గల వారికి అనుకూలంగా మారడం, సాక్ష్యాలను తారుమారు చేయడం గురించి వందేళ్ల క్రితమే గురజాడ తన కన్యాశుల్కం నాటకంలో చెప్పారు. సమాజంలో శక్తిమంతులే చివరకు గెలుపు సాధిస్తారని ఆయన స్పష్టం చేశారు.**

కన్యాశుల్కం రాయడానికి ముందే 1825లో మెకాలే తొలి భారతీయ శిక్షా స్మృతిని రూపొందించారు. 1872లో జేమ్స్ స్టీఫెన్ భారతీయ సాక్ష్యాధార చట్టాన్ని లిఖించారు. రాజ్యాంగాన్ని లిఖించుకున్న ఏడు దశాబ్దాల తర్వాత స్వతంత్ర భారతంలో తొలిసారి మనం రూపొందించుకున్న కొత్త నేర చట్టాలు ఎంత వరకు ఆధునిక నాగరిక సమాజానికి, ప్రజాస్వామ్య ఆకాంక్షలకు అనుగుణంగా ఉన్నాయన్న విషయంపై ఇప్పుడు సర్వత్రా చర్చలు జరుగుతున్నాయి. జూలై 1 నుంచి అమలులోకి వచ్చిన ఈ నేర చట్టాల ప్రధాన లక్ష్యం పారదర్శకత, జవాబుదారీ విధానం, సమర్థత, ఆధునికీకరణను ప్రవేశపెట్టడం ద్వారా ప్రజలకు న్యాయాన్ని చేరువగా చేర్చడమే అని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించారు. ప్రజలను శిక్షించడానికి తాము ప్రాధాన్యతనీయడం లేదని, వారికి న్యాయం అందించడమే తమ ప్రాధాన్యత అని ఆయన అన్నారు. అయితే ఈ చట్టాల ఉద్దేశాలు మాత్రం వలసవాద మనోభావాలనే ప్రతిఫలిస్తున్నాయని, చాల చోట్ల భాషను మార్చారు కాని సారాన్ని మార్చలేదని అనేక మంది న్యాయ, రాజ్యాంగ నిపుణుల నుంచి వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి.

స్వాతంత్ర్య పూర్వం మహాత్మాగాంధీ, లోకమాన్య తిలక్ వంటి స్వాతంత్ర్య సమరయోధుల్ని ఐపీసీలోని సెక్షన్ 124 ఏ ప్రకారం రాజద్రోహ నేరం క్రింద అరెస్టు చేసి నిర్బంధించారు. 'నేటి కాలానికి అనుగుణంగా లేని అలాంటి వలసవాద చట్టాలు మనకు అవసరమా?' అని రెండేళ్ల క్రితం అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ ప్రశ్నించడమే కాదు, సెక్షన్ 124ఏ అమలును నిలిపివేస్తూ చరిత్రాత్మక తీర్పును వెలువరించారు. అప్పటి నుంచీ దేశ వ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో ఈ సెక్షన్‌ను అమలు చేయడం ఆగిపోయింది. జూలై 1 నుంచి అమలులోకి వచ్చిన భారతీయ న్యాయసంహితలో సెక్షన్ 124ఏను అయితే తొలగించారు కాని దాని స్థానంలో సెక్షన్ 152ను ప్రవేశపెట్టారని, ఈ సెక్షన్‌లో గతంలోని రాజద్రోహ క్లాజు కంటే ఎక్కువ కఠినమైన, ప్రమాదకరమైన నిబంధనలు న్నాయని, పైగా శిక్షను మూడేళ్ల నుంచి ఏడేళ్లకు పెంచారని పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్ (పియుసిఎల్) తెలిపింది.

కొత్త నేరచట్టాల్లో వలసవాదం కాలం నాటికంటే ఎక్కువ క్రూరమైన, ప్రజా వ్యతిరేకమైన నిబంధనలను చేర్చారని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆందోళన వ్యక్తం చేసింది. ఇవాళ రాజద్రోహం అన్న పదానికి అర్థం లేకపోయినా దేశ ద్రోహాన్ని మాత్రం తీవ్రంగా పట్టించుకోవాలని, దేశ సమగ్రత, సమైక్యత, సార్వభౌమికతకు ఎవరు నష్టం కలిగించినా చర్యలు తీసుకోవాల్సిందేనని కేంద్రం వాదించవచ్చు కాని సెక్షన్ 124ఏను దుర్వినియోగపరిచినట్లే, సెక్షన్ 152ను దుర్వినియోగపరచరన్న హామీ ఎవరు ఇవ్వగలరు? గతంలో ముఖ్యమంత్రి ఇంటి ముందు హనుమాన్ చాలీసాను పఠించడాన్ని రాజద్రోహం క్రింద పరిగణించినట్లు ప్రజలు వ్యక్తం చేసే ఏ నిరసనను అయినా దేశద్రోహం క్రింద పరిగణించరన్న గ్యారంటీ ఉన్నదా? 'దేశ భద్రతా ప్రయోజనాలు, సమగ్రత గురించి మాత్రమే కాదు, ప్రజల పౌరహక్కుల గురించి న్యాయస్థానానికి అవగాహన ఉన్నది. ఈ రెండింటి మధ్యా సమతుల్యం పాటించడం అవసరం. అది చాలా క్లిష్టమైన పని' అని జస్టిస్ రమణ తన తీర్పులో కొన్ని ముఖ్యమైన వ్యాఖ్యలు చేశారు. ఈ సమతుల్యం పాటించగలిగిన పరిపక్వత మన వ్యవస్థలకు ఉన్నదా అన్నదే చర్చనీయాంశం.

కొత్త నేర చట్టాల్లో రాజద్రోహం తన పేరును, సెక్షన్‌ను మార్చుకుని ప్రవేశించడం, ఊపా, మోకా వంటి ఉగ్రవాద చట్టాలు వేరుగా కాకుండా తొలిసారి ఐపీసీలో భాగం కావడం, ఎన్‌కౌంటర్ మరణాలను, కస్టడీ మరణాలను నిర్వచించక పోవడం, పోలీసులకు జవాబుదారీ విధానం, బాధ్యతను నిర్ణయించకుండా, వారు అధికార దుర్వినియోగానికి

విచ్చలవిడిగా పాల్గొనేందుకు మరింత వీలు కల్పించడం, సెక్షన్ 187 క్రింద పోలీసు కస్టడీ రిమాండ్ కాలాన్ని 15 రోజుల నుంచి 90 రోజుల వరకు పెంచే అవకాశం ఉండడం విమర్శలకు తావిస్తున్నాయి. సెక్షన్ 113 క్రింద టెర్రరిస్టు చట్టం పోలీసులకు ఊపాకంటే విచ్చలవిడి అధికారాలను కల్పిస్తోందని న్యాయ నిపుణులు అంటున్నారు. జస్టిస్ మాలిమత్ నుంచి మాజీ హోం సెక్రటరీ పద్మనాభయ్య వరకు ఎందరో సూచించిన పోలీసు సంస్కరణలను కొత్త నేర చట్టాల విషయంలో పరిగణనలోకి తీసుకున్నట్లు దాఖలాలు లేవు. ఊపా క్రింద అనేక మంది మేధావులు, విద్యార్థులు, ఆదివాసీలు, ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారందర్నీ ఏళ్ల తరబడి విచారణ లేకుండా జైలులో బంధించడం, చివరకు 3 శాతం మందికి శిక్ష పడకపోవడం గురించి మానవ హక్కుల సంఘాలు అనేక సందర్భాల్లో ప్రస్తావించాయి. కొత్త నేరాల చట్టాల్లో నిర్విచక్షణగా అరెస్టులు చేయకుండా పోలీసు అధికారులపై ఆంక్షలు విధించే నిబంధనలు ఏమీ లేవు. ఒక ఖైదీ జైలు శిక్షను తగ్గించాలంటే కేంద్ర ప్రభుత్వ ఆమోదం ఉండాల్సిందేనన్న సెక్షన్ చేర్చడం సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా కనిపిస్తోంది. విద్వేష నేరాలు, మూక ఊచకోత అన్న పదాలకు ఈ చట్టాల్లో తావివ్వకపోవడం కూడా విమర్శలకు తావిస్తోంది. 'బెయిల్ అనేది నిబంధన కావాలి, జెయిల్ అనేది మినహాయింపు కావాలి, నేరం రుజువుకానంతవరకూ ఎవరైనా అమాయకుడే' అన్న కనీస మౌలిక సూత్రాలకు కొత్త నేర చట్టాలు తిలోదకలిచ్చాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అయినప్పటికీ కొత్త నేర చట్టాల్లో చెప్పుకోదగ్గ మార్పులు లేకపోలేదు. మహిళలు, పిల్లల సంరక్షణకు సంబంధించి ఎన్నో చర్యల్ని చేపట్టారు. చిన్న చిన్న నేరాలు చేసిన వారితో జైళ్లను నింపకుండా కమ్యూనిటీ సేవను ఒక శిక్షగా చేర్చారు. శాస్త్ర సాంకేతిక రంగాలకు నేర విచారణలో కీలక పాత్రను పోషించారు. డిజిటల్, ఎలెక్ట్రానిక్ సాక్ష్యాలకు ప్రాధాన్యత కల్పించారు. ఫోరెన్సిక్ సైన్స్‌కు ప్రాధాన్యత నిచ్చారు. ఖైదీల పరివర్తన, పునరావాసానికి వీలు కల్పించారు. సాక్షులకు భద్రత కల్పించాలని పేర్కొన్నారు. కాని వీటన్నింటినీ ఎలా చేయాలో మాత్రం వివరించలేదు. పోలీసు కస్టడీలో హింసించకుండా టెక్నాలజీ ద్వారా నేర విచారణ జరిపించాలంటే పోలీసులకు శిక్షణ అవసరం. వారికే కాదు, న్యాయవాదులకూ, ప్రాసిక్యూటర్లకూ ఆధునిక టెక్నాలజీ వినియోగంలో శిక్షణనీయాల్సిన అవసరం ఉన్నది. భారత రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులను ఒక పోలీసు కానిస్టేబుల్‌ను దృష్టిలో ఉంచుకుని రూపొందించారని, హక్కులను ఇచ్చినట్లే ఇచ్చి ప్రతి అధికరణలోనూ దాన్ని వెనక్కి తీసుకునే అవకాశం కల్పించారని రాజ్యాంగ అసెంబ్లీ సభ్యుడు సోమనాథ లాహిరి వ్యక్తం చేసిన అభిప్రాయం కొత్త నేర చట్టాల విషయంలో ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు కనిపించడం లేదు.

మానవ హక్కుల విషయంలో భారతదేశం చాలా వెనుకబడి ఉన్నదన్న విషయంలో సందేహం లేదు. 1948లో ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల ప్రకటనను రూపొందించింది. 1966లో పౌర, రాజకీయ హక్కులపై ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక పద్దులపై ఐక్యరాజ్యసమితి రెండు ఒడంబడికలను రూపొందించింది. అయినప్పటికీ 1993లో పీవీ నరసింహారావు హయాంలో కాని మన దేశంలో జాతీయ మానవ హక్కుల కమిషన్‌ను ఏర్పాటు చేయలేదు. మనుషులను హింసించడం, క్రూరంగా, అమానుషంగా వ్యవహరించడానికి వ్యతిరేకంగా 1997లో ఐక్యరాజ్యసమితి ఏర్పర్చిన సదస్సులో భారతదేశం పాల్గొని సంతకాలు చేసింది. కాని ఇంత వరకూ దాన్ని మనం భారతదేశంలో అమలు చేయలేకపోతున్నాం. ఐక్యరాజ్యసమితి వరకు ఎందుకు? మన రాజ్యాంగంలో పేర్కొన్న కీలకమైన హక్కులనే మన ప్రభుత్వాలు కాలానుగుణంగా విస్మరిస్తూ చట్టాలు చేయడం మొదలుపెట్టాయి 1950లో ప్రవేశపెట్టిన పీడీ చట్టం నుంచి ఊపా వరకు ఎన్నో ఉదాహరణలు మనం పేర్కొనవచ్చు. ఇలాంటి చట్టాల విషయంలో కాంగ్రెస్ పార్టీకి, బీజేపీకి పెద్ద తేడా లేదు.

జాతీయ మానవ హక్కుల కమిషన్ స్థాయిని క్రమక్రమంగా తగ్గించడమే కాని పెంచేందుకు పూనుకున్న దాఖలాలు లేవు. సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తిని చైర్మన్‌గా నియమించడానికి బదులుగా ప్రభుత్వానికి అనుగుణంగా ఉండే మాజీ న్యాయమూర్తినైనా నియమించుకునే సంప్రదాయాన్ని ప్రవేశపెట్టి ఈ సంస్థను పేపర్ టైగర్‌గా మార్చి వేశారు. దళితులు, ఆదివాసీలు, స్త్రీలకోసం ఏర్పర్చిన ప్రత్యేక కమిషన్లు అస్మదీయ సంస్థలుగా మారాయి. కొత్త నేర చట్టాలను పార్లమెంట్ ఆమోదించినప్పుడు పార్లమెంట్‌లో ప్రతిపక్షాలను బహిష్కరించినందు వల్ల పెద్దగా చర్చలు జరగలేదు. ఇప్పుడైనా మరోసారి వీటిపై క్షుణ్ణంగా చర్చ జరపాల్సి ఉన్నది. రాజ్యాంగం న్యాయవ్యవస్థకు కీలక రాజ్యాంగ అంశాలపై విశ్లేషించి, వ్యాఖ్యానించే (జ్యుడిషియల్ ఇంటర్‌ప్రిటేషన్) అధికారం ఇచ్చింది. కేశవానంద భారతి కేసు నుంచి ఇటీవల ఎన్నికల బాండ్ల కేసు వరకూ సుప్రీంకోర్టు ఇలాంటి ఎన్నో కీలకమైన వ్యాఖ్యానాలు చేసింది.

**చట్టసభలు, న్యాయవ్యవస్థ రెండూ తమ కర్తవ్యాలను నెరవేర్చి నేర చట్టాలను, మానవ హక్కులను అంతర్జాతీయ నాగరిక సమాజానికి అనుగుణంగా తీర్చిదిద్దే ప్రయత్నం చేసినప్పుడే మనం నిజమైన విశ్వగురువు స్థానాన్ని పొందగలుగుతాము. ❑**

# నూతన నేర చట్టాలు నిలిపివేయాలి

– 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం

**గత లోక్‌సభ చిట్టచివరి సమావేశాలలో అత్యంత నిర్లక్ష్యంగా అప్రజాస్వామిక పద్ధతిలో ఆమోదించిన మూడు నూతన చట్టాలు జూలై 1 నుంచి దేశమంతటా అమలులోకి వచ్చేలా బీజేపీ గట్టి చర్యలు తీసుకున్నది. ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ), క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (సీఆర్‌పీసీ), ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ అనే మూడు గత చట్టాల స్థానాన్ని భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్షా సంహిత, భారతీయ సాక్ష్య అధినయం అనే ఈ మూడు చట్టాలు ఆక్రమించాయి. ఎలాంటి సన్నాహాలు, చర్చ, వాదనలు లేకుండానే మొత్తం న్యాయ వ్యవస్థ ప్రధాన మార్పులకు లోనుకావడం చూస్తే బుర్ర తిరిగే వ్యవహారం తప్ప మరొకటి కాదు.**




బీజేపీ పని తీరుపైన విధానాలపైన ఓటర్లు తీర్పు ఇచ్చిన తర్వాత, పార్లమెంటులో మెజార్టీ రాకుండా పోయిన తర్వాత ఆ పార్టీలో ఏ మార్పు లేదని దీన్నిబట్టి స్పష్టమవుతుంది. హిందీలో మాత్రమే నామకరణం చేయబడిన ఈ మూడు చట్టాలపై లోక్‌సభలో లోతైన చర్చ జరిగిందే లేదు. ఏదో మొక్కుబడి కోసం వాటిని సెలెక్ట్ కమిటీకి పంపి సభ ముందు పెట్టి క్షణాల మీద ఆమోదించేశారు. అసలు ఆ సమయంలో సభలో ప్రతిపక్ష సభ్యులు వుండే అవకాశమే లేకుండా చేయబడింది. ఎందుకంటే వారిలో 148 మందిని సస్పెండ్ చేసినందున సభలో పాల్గొనే అవకాశం లేదు. న్యాయవ్యవస్థ అన్ని స్థాయిల్లోనూ వుండే న్యాయవాద బృందాలు, సభ్యులు, ఆఖరుకు పోలీసులు ఈ కొత్త చట్టాల గురించి పెద్దగా తెలియలేదు. అందువల్ల వాటి అమలు సహజంగానే వాటికి ఏ విధమైన వ్యాఖ్యానమివ్వాలి, అమలు చేయాలి అనే తీవ్రమైన సమస్యలు తెచ్చిపెడుతుంది. ఈ చట్టాలను అమలులోకి తేవడంతోపాటు దానికి సమాంతరంగా మరో నేర న్యాయవ్యవస్థ ఉనికిలోకి వస్తుంది.

ఏమంటే జూలై ఒకటవ తేదీకి ముందు ఏదైనా నేరం చేసిన ఒక వ్యక్తికి అప్పుడున్న విస్తారమైన నేర చట్టాల ప్రకారమే విచారించవలసి వుంటుంది. అదే నేరం గనక జూలై 1 తర్వాత జరిగినట్టయితే ఈ సరికొత్త విస్తారమైన చట్టాల మేరకు విచారించవలసి వస్తుంది. అంటే దీని అర్థం ఏమంటే ఒక సమాంతర న్యాయవ్యవస్థ ఏర్పరచడం, ఒకే సమయంలో రెండు రకాల చట్టాలు అమలులోకి రావడం జరుగుతుందన్నమాట. దాంతో ఏ చట్టాన్ని వర్తింపచేయాలనే వివాదం రావడం సహజంగా జరుగుతుంది. ఉదాహరణకు జూలై ఒకటవ తేదీ ముందు ఎఫ్ఐఆర్‌లో నేరారోపణకు గురైన వారు తమను పాత చట్టాల ప్రకారం విచారించాలని కోరవచ్చు. కానీ ప్రాసిక్యూషన్ వారిని కొత్త చట్టాల ప్రకారం విచారణకు పెట్టడానికి ప్రయత్నించవచ్చు. వాజ్యాలు చాలా సంక్లిష్టంగా మారిపోతాయి.

### మరో యాభై ఏళ్లు అస్పష్టత

చట్టాలకు సుప్రీంకోర్టు భాష్యం చెబుతూ వచ్చింది. సీఆర్‌పీసీకి 1973లో చేసిన సవరణలు ఇప్పుడే కొంత నిశ్చిత రూపం సంతరించుకున్నాయి. ఈ కొత్త చట్టాలకు ఆ విధమైన స్థిరత్వం రావాలంటే మరో యాభై ఏళ్లు పడుతుంది. దేశంలోని వేలాది మంది మేజిస్ట్రేట్లు ఈ కొత్త చట్టాలకు వేర్వేరు పద్ధతుల్లో తమవైన వ్యాఖ్యానాలు చేసినప్పుడు ఏది నిలబడుతుందో ఊహించుకోవచ్చు. ఈ రకరకాల వ్యాఖ్యానాలు, ఆలస్యాల వల్ల నిందితులు విపరీతమైన సమస్యలకు గురవడం తథ్యం. ఆ

నిందితులు గనక కస్టడీలో వుండేట్టయితే అతడు లేక ఆమె సమస్యలు మరింత జటిలంగా పరిణమిస్తాయి. చట్టం నిర్దేశించే పద్ధతి వల్ల తప్ప మరే విధంగానూ ఒక పౌరుడి ప్రాణాలకు, స్వేచ్ఛకు ఆటంకం రాకూడదని 21వ అధికరణం హామీనిస్తుంది. కాని ఇక్కడ అసలు చట్టం ఏమిటి అన్నదే వివాదమైనప్పుడు దాన్ని అమలు చేయడం కూడా కష్టతరమవుతుంది. ఈ కొత్త చట్టాలు ఏం చెబుతున్నాయనే దానిపైనే అనిశ్చితిని, అస్పష్టతను తెచ్చిపెడతాయి. ఈ నూతన చట్టాలు వచ్చిన తర్వాత నేర కేసులు 30 శాతం ఎక్కువగా జాప్యం జరుగుతుందని సీనియర్ లాయర్లు చెబుతున్నారు. వేల మందికి, ప్రత్యేకంగా వనరులు లేని వారికి న్యాయం నిరాకరించబడటానికి ఇది దారి తీస్తుంది. అసలు కేసుల పెండింగ్‌పై దీని ప్రభావం ఏమిటనేది లెక్క కట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నించిన దాఖలాలే కనిపించవు. ఎందుకంటే దాన్ని సర్కారు ఖాతరు చేయదల్చుకోలేదు. అనువాదం చేయడానికి, అమలు చేయడానికి సంబంధించిన సమస్యలు ఎలాగూ తప్పవు గనక అనివార్య చిక్కులుగా వదిలేయవచ్చు. కాని ఈ నూతన చట్టాలలో కొన్ని సెక్షన్లు అత్యంత నిరంకుశమైనవి, మరికొన్ని సెక్షన్లు న్యాయం అందించడంలో అవరోధాలు సృష్టించేవిగా వున్నాయి.

## పోలీసులకు నిరంకుశాధికారాలు

న్యాయాన్ని చేరుకోవడంలో మొదటి అడుగు ఎఫ్ఐఆర్. ఈ కొత్త చట్టాల కింద మూడు నుంచి ఏడేళ్ల వరకూ జైలు శిక్ష పడే అవకాశమున్న ఏదైనా నేరానికి సంబంధించిన ఎఫ్ఐఆర్ 14 రోజుల వరకూ జాగు చేయొచ్చు. ఈ విషయానికి సంబంధించిన వివిధ కోణాలను అధ్యయనం చేయడంలో స్టేషన్ హౌస్ అధికారి ఆలోచనలు కొనసాగించవచ్చు. బాధితులైన అతడు/ఆమె తమ ఫిర్యాదును ఉపసంహరించాలంటూ ఈ కాలంలో ఒత్తిడి తీసుకురావచ్చు. ఇది పోలీసులలోనూ అవినీతికి దారితీయొచ్చు. తమను తాము కాపాడుకోవడానికి రకరకాలైన పద్ధతులకు పాల్పడే అవకాశం అతడు / ఆమెకు లభించవచ్చు. ఈ కొత్త చట్టాలు తీసుకొచ్చిన మార్పుల వల్ల పేదలు, బలహీనులు న్యాయం పొందే హక్కుకు అత్యంత తీవ్రమైన హాని కలుగుతుంది. వారిప్పటికే అనేక విధాల న్యాయం పొందే హక్కును ఉపయోగించుకోలేకపోతున్నారు. అలాగే ఈ కొత్త చట్టాల ప్రకారం పోలీసులు గత చట్టంలో పేర్కొన్న 15 రోజుల కాల పరిమితిని మించి అధికకాలంపాటు రిమాండ్‌లో ఉంచాలని కోరవచ్చు. తరచూ నేరాలు చేసేవాళ్లకు (ఇదో కొత్త తరహా విభజన) ఈ కొత్త చట్టం ప్రకారం సంకెళ్లు కూడా వేయొచ్చు. పేదలు, బలహీనులకూ, అణచివేయబడిన వారికి, ప్రభుత్వ ప్రయోజనాలకు హాని కలిగించే వారుగా పోలీసులు భావించే వాళ్లకు న్యాయాన్ని నిరాకరించే అధికారం మరింత పెరుగుతుంది.

## 124ఎ మరింత తీవ్రరూపంలో..

ఈ నూతన చట్టాలలో అత్యంత ప్రమాదకరమైన మరో అంశమేమంటే 124 ఎ మరో రూపంలో ప్రత్యక్షం కావడం. రాజద్రోహాన్ని నిర్వచించే ఐపీసీ 124 ఎ సెక్షన్‌ను సుప్రీం కోర్టు ఇప్పటికే కొట్టివేసింది. కానీ భారతీయ న్యాయసంహితలో 152వ సెక్షన్ మళ్లీ ప్రత్యక్షమవుతోంది. ఇంతకు ముందటి మూల చట్టం 124ఎ లో లేని విధంగా ఇందులో భారత సార్వభౌమత్వం, సమగ్రత అనే ప్రస్తావనలు అదనంగా చేర్చబడ్డాయి. సీనియర్ లాయర్లు చెప్పే ప్రకారం చట్టంలో ఇది వరకు లేని 'జాతి వ్యతిరేక చర్య' అనే అంశం కొత్తగా జొప్పించబడింది. సహజంగానే ఇది వాక్ స్వాతంత్ర్యాన్ని భావ వ్యక్తీకరణను అసమ్మతి హక్కును తీవ్రస్థాయిలో దెబ్బ తీస్తుంది. వాటికి వ్యతిరేకంగా పనిచేస్తుంది. ఈ కొత్త చట్టాలు తీసుకురాక ముందే ఈ ప్రభుత్వం అసమ్మతిదారుల పట్ల వ్యవహరించిన తీరు చాలా దూకుడుగా అన్యాయంగా వుండింది. ఇక ఈ కొత్త చట్టాలతో పరిస్థితి ఇంకా దిగజారుతుంది. అంతేగాక ప్రస్తుతం ఉపా చట్టం కింద వున్న అనేక నేరాలను ఈ కొత్త నేరచట్టంలో పొందు పరిచారు. అంటే నిందితుడు వాస్తవంలో కొత్తనేర చట్టంలో ఉపా కింద ఎన్ఐఏ, కొత్త నేర చట్టం కింద పోలీసులు పెట్టే రెండు రకాల చార్జిషీట్లు ఎదుర్కొనవలసి వుంటుంది. చివరకు ఒకే శిక్ష విధించినా ఈ ఈ మొత్తం ప్రక్రియే తీవ్ర శిక్షలా నడుస్తుంది. పైగా ఉపా కింద దర్యాప్తు చేసేది స్థానిక పోలీసు కన్నా పైస్థాయి అధికారి కాగా కొత్త చట్టంలో మామూలు పోలీసు స్టేషన్‌కే టెర్రరిజంపై దర్యాప్తు చేసే హక్కు వుంటుంది. ఉపా కింద విచారణ జరిపేందుకు ప్రభుత్వ అనుమతి అవసరం. కాగా కొత్త చట్టంలో ఒక సాధారణ పోలీసు అధికారి ఎవరినైనా టెర్రరిజం పేరిట దర్యాప్తు జరిపే అధికారం పొందడం ఇంకా ఆందోళన కలిగించే విషయం.

## నిలిపే వరకూ పోరాటం

ఈ నూతన చట్టాలపై గట్టిగా పోరాడాల్సి వుంది. దేశ వ్యాపితంగా న్యాయవాద సంఘాలు నిరసనలు, కోర్టుల బహిష్కరణకు సన్నాహాలు చేస్తున్నాయి. సుప్రీంకోర్టును ఉద్దేశించి పిటిషన్లపై వేలాది మంది సంతకాలు చేసి పంపారు. ఈ చట్టాల గురించిన సమాచారం మరింత విస్తృతంగా తెలిసే కొద్దీ నిరసనలూ వ్యతిరేకత పెరుగుతూనే వుంటాయి. ప్రజాభిప్రాయం నిర్మించడం ద్వారా ఎన్‌డీఏ సర్కారుపై ఒత్తిడి తెచ్చి ఈ కొత్త చట్టాల అమలును నిలుపు చేయవలసిన పరిస్థితి తీసుకురావాలి. వాటిని తాజాగా మరోసారి సమీక్షించాలి. ఎందుకంటే ఈ చట్టాలు దేశంలోని పౌరులందరి జీవితాలకూ స్వేచ్ఛకు ప్రమాదకరంగా పరిణమించనున్నాయి. వాటిని ఇప్పుడున్న రూపంలో ఆమోదించే ప్రసక్తే వుండకూడదు. ❑

# ప్రస్తుత పాలనలో పిల్లల నాటకమూ నేరమే!



**- అశోక్ కుంబము**

**అమెరికాలో నేను పనిచేస్తున్న అకడెమిక్ సంస్థలో అమెరికన్ మూలవాసుల సంఘీభావ గ్రూప్ ఒకటుంది. అందులో ఎక్కువగా "డకోట" అనే మూలవాసీ తెగకు సంబంధించిన వాళ్లు సభ్యులుగా ఉంటారు. వాళ్ల నుండి నేర్చుకోవడానికి, వాళ్లకు మద్దతు పలకడానికి నాతో పాటు మరికొందరు అందులో సభ్యులుగా చేరారు. మేము నెలకు ఒకసారి కలుస్తాం. మా మీటింగ్‌లో ఎక్కువగా మూలవాసీ తెగకు చెందిన పెద్దలు వాళ్ల సామాజిక, వ్యక్తిగత చరిత్రను, వాళ్లు అనుభవించిన హింస, అవమానాలను నలుగురితో పంచుకుంటారు. అవి కొన్నిసార్లు వ్యక్తిగత అనుభవంగా చెబుతారు. మరి కొన్నిసార్లు కథలుగా చెబుతారు.**

కథలు చెప్పడం (story telling method) వాళ్ల ఓరల్ హిస్టరీలో ప్రధానమైంది. ఆ కథలు చెప్పేటప్పుడు అక్కడున్న ఎవ్వరిని కదిలించినా బోరున ఏడుస్తారు. ఎందుకంటే వాళ్ల చరిత్ర నిండా, జీవితాల నిండా హింసే. నాకు అర్థమైనంత వరకు మొత్తం మానవ చరిత్రలోనే అంతటి హింస అనుభవించిన జాతి మరొకటి ఉండదనుకుంట. అందుకే వాళ్ళు అనుభవిస్తున్న దుఃఖం తరతరాలుగా (inter-generational trauma) కొనసాగుతూనే ఉంది. ఆ బాధని కొంత తేలిక పరచుకోవడం కోసం వాళ్లే నలుగురూ పోగై తమ అనుభవాలను, గాయాలను పంచుకుంటారు.

ఒకరోజు నేను వాళ్ల సభకి వెళ్లేసరికి అక్కడ దాదాపు 40 ఏళ్ల వయసున్న ఒక డకోట మహిళ మాట్లాడుతోంది. ఆ మీటింగ్ హాల్ వాతావరణం ఎంతో గంభీరంగా ఉంది. సాధారణంగా వాళ్లు చాలా సుతిమెత్తగా, నిదానంగా మాట్లాడుతుంటారు. వాళ్ల మాటలు దు:ఖంతో నిండిన గొంతు దాటి బయటకు వస్తుంటాయి. ఆ మహిళ తన జీవితాన్ని తానే విశ్లేషించుకుంటోంది. దాన్ని నలుగురితో పంచుకుంటోంది. చిన్నతనంలో తనని తన కుటుంబం నుండి వేరు చేసి ఒక రెసిడెన్షియల్ స్కూల్‌లో ఉంచారు. అప్పటి పరిస్థితి గురించి, దాని ప్రభావం గురించి మాట్లాడుతోంది. మూలవాసీ పిల్లల్ని రెసిడెన్షియల్ స్కూల్స్‌లో చేర్చడం అంటే వాళ్లని ఒక "నాగరికత" బెల్ట్ మీదకు ఎక్కించడం. నాగరికత మిషన్‌తో నడిచే ఈ రెసిడెన్షియల్ స్కూల్‌లోకి పోగానే మూలవాసీ పిల్లలకు మొదటగా వాళ్ల జుట్టు కత్తిరిస్తారు. (మూలవాసులు ఆడ, మగా అందరూ జుట్టు పెంచుకుంటారు). బట్టలు మార్చేస్తారు. వాళ్ల ఆహారపు అలవాట్లని ఎగతాళి చేస్తూ కొత్త (తెల్లజాతి ఆహారపు) అలవాట్లని నేర్పుతారు. వాళ్ల భాష మాట్లాడితే శిక్ష విధిస్తారు. ఇంగ్లిష్ భాషని బలవంతంగా నేర్పిస్తారు. బైబిల్ చేతికిస్తారు. అదే అన్ని సమస్యలకు పరిష్కారం అనే నమ్మకంలోకి నెట్టేస్తారు.

ఒక్క మాటలో చెప్పాలంటే, వాళ్లలోని మూలవాసీ ఆనవాళ్లని బలవంతంగా తుడిపేసి తెల్లజాతి సంస్కృతిని వాళ్ల మీద రుద్దుతారు. మొత్తంగా, మూలవాసీ పిల్లలు పరాయీకరణకు గురవుతారు. తమ నుండి తాము వేరు చేయబడతారు. తమ కుటుంబాలు, తమ జాతి మనుషులు వాళ్లకు కొత్తగా కనబడతారు. వాళ్లు మూలవాసీ సంస్కృతిలో, చరిత్రలో భాగం కాలేని మనుషులుగా మిగిలిపోతారు. అయితే ఆ రోజు మీటింగ్‌లో మాట్లాడుతున్న మహిళ చిన్నతనంలోనే రెసిడెన్షియల్ స్కూల్‌కి వెళ్లి, అక్కడ నుండి ఒక తెల్లజాతి కుటుంబం దత్తత తీసుకుంటే, వాళ్ల దగ్గరే పెరిగి తన మూలాలు ఏంటో తెలియకుండానే బతికింది. తనకి 40 ఏళ్లు వచ్చిన తర్వాత గాని తాను మూలవాసీ సంతతికి చెందిన మనిషినని పూర్తిగా అర్థమయ్యాక తన జీవితంలో ఏం కోల్పోయిందో వెనక్కి తిరిగి చూసుకున్నది. వెనక్కి తిరిగి చూసుకోవడమంటే అదేదో కేవలం జ్ఞాపకాల కుప్పను పోసుకోవడం కాదు. ఆమె అనుభవించిన పరాయీకరణని, దాని ద్వారా తన జీవితంలో ఏం కోల్పోయిందో, ఎంతటి బాధ అనుభవించిందో చెబుతోంది. అలా చెబుతూ తన మూలాలకు సంబంధించిన విషయాల్ని ఇప్పుడు తన పిల్లలకు చెప్తున్నాను అని చెప్పింది.

ఆ మాట వినగానే ఆ రూమ్‌లో ఉన్న ఒక తెల్లజాతి పెద్దమనిషి వెంటనే "పిల్లలకు మీ మీద జరిగిన హింస గురించి, మీరు అనుభవించిన బాధల గురించి చెప్పకండి. ఎందుకంటే అది వాళ్ల మానసిక స్థితి మీద దెబ్బ కొడుతుంది. వాళ్ల వ్యక్తిత్వ వికాసం మీద ప్రభావాన్ని చూపుతుంది" అని ఒక ఉచిత సలహా ఇచ్చాడు. అప్పటి వరకు మెల్లగా మాట్లాడుతున్న ఆమె గొంతులో ఒక్కసారిగా కోపం, బాధ కలగలిసి బయటకొచ్చాయి.

**"నా జీవితంలో 40 ఏళ్లు నేను ఎవరినో తెలియకుండానే బతికాను. నా బాధ ఎవరితో చెప్పుకోవాలో తెలియకుండానే**

**జీవించాను. నేను సమూహంలో పెరిగిన ఒంటరి దాన్ని. నాగరికత పేరిట జరిగిన విధ్వంసానికి సాక్ష్యంగా మిగిలిన దాన్ని. ఇప్పటి వరకు నలుగురు నా జాతి చరిత్ర చెప్తే విన్నాను తప్ప, నేనెప్పుడు నా గురించి చెప్పుకునే అవకాశం రాలేదు. ఇప్పుడు మాట్లాడుదామంటే, నా కడుపున పుట్టిన పిల్లలకు చెబుదామంటే నువ్వు వచ్చి అది తప్పు అంటున్నావు. కానీ నాకు మాత్రం నా పిల్లలకి చెప్పడం ద్వారా వాళ్లను మరింత మానవీయంగా ఎదిగే అవకాశం ఇస్తున్నాను అనిపిస్తుంది"** అని సమాధానం చెప్పింది. ఆమె మాటలకు అంగీకారంగా అక్కడున్న వాళ్లందరూ చప్పట్లు కొట్టారు.

ఈ సంఘటన జరిగి దాదాపు నాలుగేండ్లు అవుతోంది. కానీ నాగరికత అంటే ఏమిటి ? అభివృద్ధి అంటే ఏమిటి ? మానసిక వికాసం అంటే ఏమిటి ? ఏ ప్రమాణాలతో వీటిని చర్చించాలి అనే అంశం వచ్చిన ప్రతిసారి ఈ సంఘటన గుర్తుకొస్తుంది. మళ్లీ ఇప్పుడు విరసం సభల్లో ఆదివాసీ సమాజం మీద తిరుగుతున్న హింస ఆధారంగా వేసిన 'ఈ అడవి మాదే' అనే నాటకంలో పాల్గొన్న పిల్లల్ని ఎత్తుకెళ్లి, కౌన్సెలింగ్ పేరిట పోలీసులు మరో నాటకం ఆడారని తెలిసినప్పుడు ఆ సంఘటన మరోసారి గుర్తుకొచ్చింది.

ఈ నెల 4న విప్లవ రచయితల సంఘం (విరసం) తన 54వ ఆవిర్భావ దినోత్సవ సభను హైదరాబాద్‌లో జరుపుకుంది. ఆ సభ భారత ప్రభుత్వం కార్పొరేట్ ప్రయోజనాల కోసం, హిందూత్వ ఫాసిస్టు పునాదిని బలోపేతం చేసుకోవడం కోసం మధ్య భారతంలో ఆదివాసీల మీద చేస్తున్న యుద్ధానికి వ్యతిరేకంగా జరిగిన సభ. "కగార్" పేరిట ఆదివాసులని ఖతం చేసే కార్యక్రమాన్ని భారత పాలకులు రాజ్యాంగ విరుద్ధంగా ఏ విధంగా అమలు చేస్తున్నారో వివరించే లక్ష్యంగా జరిగిన సభ. ఆ సభలో అనేక మంది కవులు, రచయితలు, కళాకారులు, ప్రజా మేధావులు మధ్యభారతంలో జరుగుతున్న మారణ హెూమాన్ని వివరిస్తూ, మైదానం అడవిని ఎలా కాపాడుకోవాలో, ఏం చేస్తే కొనసాగుతున్న హత్యాకాండ ఆగుతుందో చర్చించారు. వివరించారు. అదే సభలో అడవి బిడ్డల మీద భారత ప్రభుత్వ అర్ధ సైన్యాలు, బార్డర్ సెక్యూరిటీ ఫోర్సెస్, ఇతర అనేక రకాల బలగాలు హింసను ఏ విధంగా, ఎందుకు కొనసాగిస్తున్నాయో వివరించే ప్రయత్నంగా ఒక నాటకం ప్రదర్శించారు.

ఆదివాసులు జల్, జంగల్, జమీన్, ఇజ్జత్ అనే నినాదంతో (అంటే మా నీళ్ల మీద, మా భూమి మీద, మా అడవి మీద హక్కు కలిగి ఉంటూ గౌరవంగా బతకడం) తమ అస్తిత్వాన్నే రూపు మాపాలనుకుంటున్న శక్తులను ప్రతిఘటిస్తున్నారు. మధ్య భారతంలో లక్షల కోట్ల విలువ చేసే వనరులున్నాయి. ఆ వనరులను కాపాడుతూ ఆదివాసీలు ఉన్నారు. ఆదివాసీలతో కలిసి విప్లవకారులు పనిచేస్తున్నారు.

గత 75 ఏళ్లుగా ఆదివాసీలని పట్టించుకోని ప్రభుత్వం ఇప్పుడు వాళ్ళ అభివృద్ధి కోసమే అంటూ అడవిలోకి కొత్త దారులు వేస్తోంది. కనీసం సైకిల్ కూడా లేని ఆదివాసీల అడవి గుండా భారీ రహదారుల నిర్మాణం చేస్తోంది. భూమార్గంలో రోడ్లే కాదు, ఆకాశయానానికి సులువుగా ఎయిర్‌పోర్ట్‌లు కూడా కడుతుంది. ఇవన్ని ఆదివాసీలకు అవసరం లేనివి. వాళ్ల భాగస్వామ్యం లేనివి. ఈ విషయం అర్థం కావడానికి పెద్ద మేధావులై ఉండాల్సిన పనిలేదు. ఎందుకంటే భారత పాలక వర్గాలు తమ ప్రయోజనాల కోసమే పనిచేస్తాయి తప్ప సమాజంలో అట్టడుగున ఉన్న మనుషుల గురించి కాదు అనేది మనకు చరిత్ర చెబుతోంది. ఆదివాసుల బాగోగులు చూడకపోగా తమ ప్రయోజనాలకు అడ్డుగా ఉన్నారని వాళ్లను తమ శత్రువులుగా ప్రకటిస్తున్నారు. ఆదివాసీలను అంతం చేయడమే తన కర్తవ్యంగా "అంతిమ యుద్ధం" అంటూ అడవి నిండా సైనిక బలగాల్ని నింపుతున్నారు. ఆ పని కోసం భారత ప్రభుత్వం బస్తర్ ప్రాంతంలో ప్రతి రెండు కిలోమీటర్లకి ఒక మిలిటరీ క్యాంపుని నిర్మాణం చేస్తోంది. ఆ క్యాంపుల నుండే ఆదివాసీ గ్రామాల మీదకి డ్రోన్ల ద్వారా బాంబులు వేస్తున్నారు. ఎదురుకాల్పుల పేరిట కనబడితే కాల్చి వేస్తున్నారు.

గత 6 నెలల్లో దాదాపు 150 మంది ఆదివాసీ బిడ్డలని, వారికి అండగా ఉన్న విప్లవకారులని భారత సేనలు చంపివేశాయి. ఇటువంటి క్రూరమైన హింసాకాండను తమ విజయంగా స్వయంగా హెూం మంత్రి ప్రకటిస్తున్నాడు. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్యం అని గొప్పలు చెప్పుకునే దేశంలో ఆ దేశ మూలవాసుల మీద ఇంతటి హింస ఏంటి ? అని ప్రపంచం విస్తుపోతోంది. కానీ దేశంలో ఉన్న పౌరసమాజానికి కనీసం చీమ కుట్టినట్టు లేదు. ఈ సందర్భంలో మనుషులుగా తోటి మనుషుల మీద హత్యాకాండ జరుగుతుంటే మనం ఎటువైపు నిలబడదాం అనే ప్రశ్నను సమాజం ముందు ఉంచడానికే విరసం సభలో ఆదివాసీ సమాజానికి సంఘీభావంగా ఆ నాటకం వేశారు. ఆ నాటకంలో కార్పొరేట్ ప్రయోజనాల కోసం ఆదివాసీల మీద భారత సైన్యం చేస్తున్న యుద్ధాన్ని కళ్లకు కట్టినట్లు చూపిం చారు. చివరిగా పోలీస్ బలగాల చేతిలో చంపివేయబడిన తమ తల్లుల, తండ్రుల చేతుల్లో "ఆదివాసులపై దాడులను ఆపివేయాలి," "జల్ జంగల్ జమీన్ హమారాహై," "ఆపరేషన్ కగార్ ఆపివేయాలి," "ఈ కంపెనీలు మాకొద్దు" నినాదాలతో ఉన్న ప్లకార్డులను పిల్లలు పట్టుకొని తమ పోరాట వారసత్వాన్ని కొనసాగిస్తామన్నట్లు కదిలారు. అంతటితో ఆ నాటకం అయిపోతుంది.

బహుశా పిల్లల్ని ఆ నాటకంలో భాగం చేయడానికి ఒక కారణం : ఆదివాసీ పోరాట సంస్కృతిని ఎత్తిపట్టడం, "నువ్వు అంతిమ యుద్ధం అంటూ **(మిగతా 17వ పేజీలో)**

# రాబోయే ఐదేళ్లూ ఆ పదేళ్ల పాలనే!



- పి.చిదంబరం

**కొత్త లోక్‌సభ తొలి సమావేశాలు నా అనుమానాలను ధ్రువీకరించాయి. నరేంద్ర మోదీ ప్రభుత్వానికి సంబంధించినంత వరకు ఏమీ మారలేదు సుమా! బహుశా ఏదీ మారబోదు కూడా. ఇది సందేహాతీతం. ఇందుకు స్పష్టమైన సూచనలు ఇప్పటికే కనిపించాయి (జూన్ 29న ఇదే కాలమ్‌లో వచ్చిన 'మార్పు మిథ్య, మోదీయే సత్యం!' మరొక మారు చదవండి). ఎన్నికలకు పూర్వం ప్రభుత్వ సాఫల్యాలపై వక్కాణింపులు, బడాయి మాటలు, విధానాలు, కార్యక్రమాలు, పాలనా శైలి, ప్రభుత్వ నడవడి, ప్రతీకార ధోరణులు మొదలైన వాటిని సమర్థించాలని, పునరుద్ఘాటించాలని, కొనసాగించాలని నరేంద్ర మోదీ దృఢంగా ఆదేశించారు మరి. విషాదమేమిటంటే పార్లమెంటు ఉభయ సభలలో కూడా మోదీ ఆదేశం ప్రభావం కనిపిస్తోంది.**

ఉత్తమ పార్లమెంటరీ సంప్రదాయం ప్రకారం ఉభయ సభలను అధిక సంఖ్యాకుల అభీష్టం ప్రకారం కాకుండా ఏకాభిప్రాయంతో నడపవలసి ఉంది. 'సభా కార్యకలాపాలను లంచ్ విరామం లేకుండా కొనసాగిద్దామా?' అన్న చిన్నపాటి విషయంపై సభా పతి లేదా అధికార పక్షం వైఖరి ఎలా ఉన్నా ఏకాభిప్రాయంతో నిర్ణయం తీసుకోవడం అనేది ఒక సదాచారంగా ఉన్నది. అయినప్పటికీ, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన వృత్తి విద్యా కోర్సుల ఎంట్రెన్స్ టెస్ట్‌లపై నెలకొన్న వివాదాలను చర్చించాలని వందలాది ఎంపీలు మద్దతునిచ్చిన వాయిదా తీర్మానాలను చర్చకు చేపట్టడానికి ఉభయ సభల సభాపతులూ తిరస్కరించారు. గత ఐదేళ్లలో పార్లమెంటులో ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరించిన వైనాన్ని సభాపతుల నిర్ణయం గుర్తుకు తెచ్చింది. ఎంత శోచనీయం !

పార్లమెంటు ఉభయ సభలలో తొలి చర్చ, పార్లమెంటు వెలుపల తీసుకున్న నిర్ణయాలు ప్రభుత్వ ఉద్దేశాలను, పరిపాలనా దిశను స్పష్టం చేశాయి : ఒకే వ్యక్తి ఆదేశాలు, నిర్దేశాల ప్రకారమే దేశ పాలన కొనసాగనున్నది. మోదీ 3.0కు కీలక మద్దతునిస్తున్న మిత్రపక్షాల (టీడీపీ, జేడీయూ)తోపాటు ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు వేటికి కూడా ప్రభుత్వ నిర్ణయాలను సమర్థించడం మినహా మరెటువంటి పాత్ర ఉండదు. నరేంద్ర మోదీ తన సొంత మంత్రులకు, పార్లమెంటు ఉభయ సభలలోని ప్రతిపక్ష నేతలకు దేశ పాలనా వ్యవహారాలలో పాలు పంచుకునేందుకు ఎటువంటి అవకాశమివ్వబోరు. ఉద్దేశ పూర్వకంగా గానీ, అనుద్దేశపూర్వకంగా గానీ తాము చేసిన తప్పులు, పొరపాట్లను మోదీ సర్కార్ ఎటువంటి పరిస్థితులలోను అంగీకరించబోదు. ప్రస్తుత ప్రభుత్వ పాలనలోని సకల లోపాలు, లొసుగులకు బాధ్యత జవహర్‌లాల్ నెహ్రూతో మొదలుకొని పాలించిన గత ప్రభుత్వాలదేనని మోదీ ప్రభృతులు నిక్కచ్చిగా చెప్పడం తప్పక కొనసాగుతుంది. బీజేపీ అధికార ప్రతినిధులు యథావిధిగా కలహశీల, ఆక్షేపణీయ రీతుల్లో వ్యవహరిస్తారు. జీతభత్యాలపై అధికార పక్షానికి అనుకూలంగా సామాజిక మాధ్యమాలలో చెలరేగిపోయేవారు మరింత క్రియాశీలంగా కొనసాగుతారు. దర్యాప్తు సంస్థలపై ఎటువంటి అదుపులు ఉండబోవు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా అవి వ్యవహరిస్తాయి. 543 లోక్‌సభ నియోజకవర్గాలలో 240ని మాత్రమే బీజేపీ సొంతంగా గెలుచుకున్నది. దాని నేతృత్వంలోని ఎన్డీఏ గెలుచుకున్న స్థానాలు 292 మాత్రమే. అయినప్పటికీ మరోసారి పాలించడానికి ప్రజలు తమకే అధికారమిచ్చారని మోదీ విశ్వసిస్తున్నారు. ప్రజా తీర్పు తమకే అనుకూలంగా ఉందని ఉద్ఘాటిస్తున్నారు. 'ప్రజాస్వామ్యంలో ప్రజలు దృఢ శైలాలే కానీ, లక్క పిడతలు కారు' అన్న సత్యాన్ని ఆయన విస్మరిస్తున్నారు. సరే, ఎంపీల విషయమేమిటి? ఇంత స్వల్ప వ్యవధిలో వారి తీరుపై ఒక కచ్చితమైన అభిప్రాయానికి రావడం కష్టం కానీ కొన్ని ప్రాథమిక సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

మహారాష్ట్ర, హర్యానా, జార్ఖండ్‌కు చెందిన ఎన్డీఏ/ బీజేపీ ఎంపీలు భయాందోళనలకు గురవుతున్నారు. ఆ మూడు రాష్ట్రాలలో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనుండడమే వారి కలవరపాటుకు ప్రధాన కారణం. ఆ రాష్ట్రాలలో తాము మళ్లీ అధికారానికి రాగలుగుతామా అనే శంక వారిని పీడిస్తోంది. మహారాష్ట్రలో మహాయుతి ప్రభుత్వం బలహీనపడుతోంది. హర్యానాలోని పది లోక్‌సభ సీట్లను బీజేపీ, కాంగ్రెస్ సరిసమానంగా గెలుచుకున్నాయి. హేమంత్ సోరేన్‌కు బెయిల్ మంజూరు చేస్తూ జార్ఖండ్ హైకోర్టు వెలువరించిన తీర్పు ఆ మూడు రాష్ట్రాలలోని ఇండియా కూటమిలో కొత్త ఆత్మ విశ్వాసాన్ని నింపింది. అసెంబ్లీ సమరానికి ఆ కూటమి

మహోత్సాహంతో సమాయత్తమవుతోంది. పంజాబ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, మేఘాలయ, మణిపూర్, నాగాలాండ్, కర్ణాటకలో ఎన్డీఏ/ బీజేపీ తీవ్రంగా నష్టపోయాయి. కేరళ, తమిళనాడులో ఆ రెండూ దాదాపుగా అంతర్ధానమయ్యాయి. ఢిల్లీ, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, బిహార్, మధ్య ప్రదేశ్, చత్తీస్‌గఢ్, అస్సాం, ఒడిషా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, గుజరాత్ నుంచి ఎన్నికైన ఎన్డీఏ/బీజేపీ ఎంపీలు ఉల్లాసంగా ఉన్నారు. అయితే తమది 'సంకీర్ణ' ప్రభుత్వం అన్న వాస్తవం వారిని వేదనకు గురిచేస్తోంది. ఈ సంకీర్ణ సర్కార్ ఎంత కాలం మనగలదన్న విషయం కూడా వారిని కలవరపరుస్తోంది.

భారతీయ జనతా పార్టీ ఒక అజేయ శక్తా ? ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అజేయుడా ? అవును అని ఘంటా పథంగా చెప్పుకోవడానికి తాము ఇంకా ఎంతో ఎత్తుకు ఎదగాలన్న విషయం బీజేపీకి బాగా తెలుసు. అదే విధంగా కాంగ్రెస్ సైతం నెహ్రూ, ఇందిర నాటి తన పాత వైభవాన్ని సంపూర్ణంగా పునరుద్ధరించుకోవాలంటే బీజేపీకంటే మరెంతో జనాదరణ పొందవలసి ఉన్నది. ఇటీవలి సార్వత్రిక ఎన్నికలలో తొమ్మిది రాష్ట్రాలలో కాంగ్రెస్ తన 99 సీట్లను సాధించుకున్నది. 170 లోక్‌సభ స్థానాలు వున్న మరో తొమ్మిది రాష్ట్రాలలో కేవలం నాలుగు సీట్లను మాత్రమే కైవసం చేసుకున్నది. మరింత ముఖ్యమైన విషయమేమిటంటే 215 నియోజకవర్గాలలో కాంగ్రెస్ అసలు పోటీ చేయలేదు (ఆ నియోజకవర్గాలలో ఇండియా కూటమిలోని కాంగ్రెస్ మిత్రపక్షాలు పోటీ చేశాయి) కాంగ్రెస్, ఇండియా కూటమి కలిసి ఒక బలవత్తరమైన ప్రతిపక్షంగా ఉన్నప్పటికీ ప్రభుత్వాన్ని అధికారం నుంచి దించివేయగల శక్తి వాటికి లేదు. అటువంటి శక్తి లోక్‌సభలో 16 మంది ఎంపీలు ఉన్న తెలుగుదేశం పార్టీకి, 12 మంది సభ్యులు ఉన్న జనతాదళ్ (యునైటెడ్) పార్టీకి ఉన్నాయి. ఆ రెండు పార్టీలు తమకు సరైన సమయం వచ్చే వరకు వేచి వుంటాయి. కేంద్ర బడ్జెట్ కోసం ఎదురు చూస్తున్నాయి. తమ రాష్ట్రాలకు ప్రత్యేక హోదా ఇవ్వాలని ఆ రెండు పార్టీలు తప్పక డిమాండ్ చేస్తాయి. అయితే అందుకు మోదీ ససేమిరా అంటారని మరి చెప్పనవసరం లేదు. మరి కొద్ది నెలల్లో జరగనున్న మహారాష్ట్ర, హర్యానా, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడే దాకా వేచి వుంటాయి.

సరే, ఈ అనిశ్చిత రాజకీయ పరిస్థితులు ఆర్థిక విధానాలను ఎలా ప్రభావితం చేయనున్నాయి? కొన్ని ఊహలు చేసేందుకు, అభిప్రాయాలు వ్యక్తం చేసేందుకు సాహసిస్తున్నాను.

- 1) తన వైఫల్యాలను నిరాకరించే ధోరణి ప్రభుత్వం తప్పక కొనసాగిస్తుంది: నిరుద్యోగిత పెచ్చరిల్లిపోవడాన్ని, ద్రవ్యోల్బణం, ముఖ్యంగా ఆహార పదార్థాల విషయంలో బాగా పెరిగిపోతుం దన్న వాస్తవాన్ని ప్రభుత్వం అంగీకరించదు. కార్మికుల వేతనాలు, ఆదాయాలు స్తంభించిపోవడాన్ని ఒప్పుకోదు. దేశ జనాభాలో కింది స్థాయిలో ఉన్న 20 శాతం మంది పేదరికంలో కునారిల్లుతున్నారన్న కఠోర వాస్తవాన్ని గుర్తించదు. అసమానతలు పెరిగిపోవడాన్ని పట్టించుకోదు. మరి ఇటువంటి వైఖరితో ఉన్న మోదీ సర్కార్ ఆర్థిక విధానాలలో మౌలిక మార్పులకు పూనుకుంటుందా? అలా ఆశించడమే అసంబద్ధం.
- 2) మౌలిక సదుపాయాలు, బుల్లెట్ రైలు ఇత్యాది ఆడంబరపూర్వక ప్రాజెక్టులలో భారీ మదుపులను మోదీ సర్కార్ కొనసాగిస్తుంది. మౌలిక సదుపాయాల రంగంలో ప్రభుత్వ వ్యయాల పెరుగుదల వల్ల ఆర్థిక లబ్ధి సమకూరుతుంది, సందేహం లేదు. అయితే ప్రైవేట్ పెట్టుబడులు కొరవడుతాయి. వృద్ధిరేటు స్వల్పస్థాయిలో ఉంటుంది. అయితేనేం, ప్రభుత్వం అవిశ్వసనీయ గణాంకాలతో వృద్ధిరేటును ఘనంగా పెంచుతుంది.
- 3) దక్షిణ కొరియా అభివృద్ధి నమూనాను అనుసరించడాన్ని మోదీ సర్కార్ కొనసాగిస్తుంది. కీలక రంగాలలో గుత్తాధిత్యం పెరిగిపోతుంది. తత్ఫలితంగా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఖాయిలాపడతాయి. కొత్త ఉద్యోగాల సృష్టి మందగిస్తుంది. ఏటా లక్షల సంఖ్యలో ఉద్యోగాల మార్కెట్‌లోకి ప్రవేశించే విద్యావంతులు, అనిపుణ యువజనులు తీవ్రంగా నష్టపోతారు.
- 4) వృద్ధాప్యం మీదబడుతున్న నాయకుని సారథ్యంలో వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం విద్య, ఆరోగ్య భద్రత, పర్యావరణ రక్షణ, వాతావరణ మార్పు నియంత్రణ, వ్యవసాయం, అడవుల అభివృద్ధి, శాస్త్ర, సాంకేతిక పరిశోధనలు–అభివృద్ధి రంగాలలో మౌలిక మార్పులు సాధించగల ప్రతిభావంతులను ఆకట్టుకుని, వారికి నిర్ణయాత్మక బాధ్యతలు అప్పగించే అవకాశాలు తక్కువ. మరి ఈ విషయంలో సమర్థంగా వ్యవహరించకపోతే నష్టపోయేది దేశమే కాదూ?

**గత పదేళ్లుగా తాము అనుసరించిన పాలనా విధానాలు సమర్థనీయమైనవని, భారత్‌ను ప్రపంచ అగ్రగామిగా తీర్చిదిద్దేవని ప్రధానమంత్రి దృఢంగా విశ్వసిస్తారు. అవే విధానాలు యథాతథంగా కొనసాగుతాయని పార్లమెంటులో ఆయన ప్రసంగాలు స్పష్టం చేస్తున్నాయి. కనుక కేవలం అదే ప్రభుత్వానికే కాకుండా, అదే పాలనకు సైతం దేశ ప్రజలు సిద్ధంగా ఉండాలి.** ❑

# ముకుళిత భారత్, వికసిత ఇండియా



- కొప్పర్తి వెంకటరమణమూర్తి

**భారతీయ జనతా పార్టీ పేరులోనే భారత్ ఉంది. దాని అనుబంధ సంస్థలు అఖిల భారతీయ విద్యార్థి పరిషత్, భారతీయ కిసాన్ సంఘ్, భారతీయ మజ్దూర్ సంఘ్‌లలో కూడా భారత్ ఉంది. ఆ మాటకొస్తే పార్టీ పూర్వ రూపం భారతీయ జనసంఘ్‌లోనూ ఉంది. వారి నినాదమే భారత్ మాతాకి జై. వారి ఆశయం అఖండ భారత్. 2047 నాటికి చేరుకోవలసిన గమ్యం వికసిత భారత్. ప్రవేశపెట్టబడిన కొత్త రైళ్ళు వందే భారత్. సాధారణంగా ఆ పార్టీ ముఖ్య నాయకులు దేశాన్ని భారత్ అనే సంబోధిస్తారు. ఇది కొత్తగా మొదలైంది కాదు. కాకపోతే దేశంలో ప్రతిపక్షాలు ఇండియా కూటమిగా ఏర్పడ్డాక భారత్‌ను ఎలుగెత్తడం, ఇండియాను తొలగించడం తక్షణ అవసరం అయింది. ఇండియా శ్లేషాత్మకం అయింది.**

చూడగా, 2024 ఎన్నికలు ఇండియా, భారత్‌ల మధ్య జరిగినట్లయింది. దేశంలో ప్రజాస్వామ్యాన్ని, లౌకికత్వాన్ని మొత్తంగా రాజ్యాంగాన్ని కాపాడుకోవలసిన అవసరాన్ని ముందుకు తెస్తూ ఇండియా కూటమి ఎన్నికలకు వెళ్లింది. వికసిత భారత్, సబ్ కా సాత్ సబ్ కా వికాస్ లక్ష్యాలున్నా వాటిని ప్రక్కకు నెట్టివేస్తూ మైనారిటీలను బూచిగా చూపించి మెజారిటీలను ఆకర్షించే ప్రయత్నం చేసింది భారత్. భారత్ ఆశించిన ఫలితాలనే కాదు అవసరమైన ఫలితాలనైనా సాధించ లేకపోయింది. ఇండియా కూడా అవసరమైన ఫలితాలను సాధిం చలేకపోయినా నిలువరించగలిగే ఫలితాలను సాధించగలిగింది.

భారత్, ఇండియాల వెనుక రెండు ప్రతీకాత్మక భావజాలాలు ఈ ఎన్నికల్లో పనిచేశాయి. గెలుపు ఓటములు ఆ భావజాలాలవే. పాలక పక్షానికి భారత్ అనే మాట మీద అంత మమకారం ఎందుకు ? అది ఎప్పుడు బయటపడింది ? ఎందుకు ఆమోదం పొందలేకపోతోంది ? మరోమారు సమాధానం వెతుక్కోవలసిన ప్రశ్నలివి. ఇండియా కూటమి జూలై 2023లో ఏర్పడితే అదే సంవత్సరం సెప్టెంబర్‌లో ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్ ఇండియా అనడం మానేసి భారత్ అని పిలవాలని మొదట పిలుపిచ్చారు. ఇది జరిగిన రెండు రోజులకు జి 20 సమ్మిట్ సందర్భంగా వేసిన ఆహ్వానపత్రంలో 'ప్రెసిడెంట్ ఆఫ్ భారత్' అని ముద్రించడమే కాదు, ఇండియాకు బదులు భారత్ అని రాసి ఉన్న నామఫలకాన్ని ముందుంచుకుని ప్రధాని ప్రసంగించి ఆశ్చర్యపరచారు. ఎందుకు అనే ప్రశ్నకు విదేశీయులు పెట్టిన ఇండియాకన్నా దేశీయమైన భారత్ సముచితం అన్నారు. విదేశీ యులు అంటే బ్రిటిష్ వారనే అర్థం తెస్తూ మనం వలస భావ నలు వదులుకోవలసిన (decolonize) అవసరం ఉందన్నారు.

ఇండియా అనే మాటను ఆంగ్లేయులు విరివిగా వాడిన మాట నిజమే కానీ మొదట వాడింది పారశీకులు, గ్రీకులూ. సింధును పారశీకులు హిందు అని ఉచ్ఛరిస్తే, గ్రీకులు ఇండస్ అన్నారు. గ్రీకులు ఇండస్‌కు తూర్పున ఉన్న దాన్ని ఇండియా అని క్రీపూ నుంచీ అంటుంటే (క్రీపూ 4 వ శతాబ్ది నాటికే గ్రీకు రాయబారి మెగస్తనీస్ భారతదేశం గురించి 'ఇండికా' అనే గ్రంథం రాశాడు) సింధుకు తూర్పున ఉన్నది హిందూస్థాన్ అని మధ్య యుగాల నుంచి వాడుకలోకి వచ్చింది. హిందు అనేమాటకు మతపరమైన అర్థ వ్యుత్పత్తి మన ప్రాచీన గ్రంథాలలో ఎక్కడా లేదు. ఆర్యులకంటే ముందు నుంచీ హిందు పదం ఉందనీ, సంస్కృతీకరణలో అది సింధు అయిందనే వితండవాదం చేశాడు సావర్కర్. దీనికి ఏ ఆధారాలూ లేవు.

భారత్ అనేమాట భరతుడు అనే రాజు పేరిట వచ్చిందం టారని అందరికీ తెలుసు. ఎవరీ భరతుడు ? శకుంతల దుష్యంతుల కుమారుడితోపాటు అనేక మంది భరతులున్నారు. ఒకానొక రిషభుడి కుమారుడు భరతుడనీ, అతని పేరిటే భరతవర్షం వచ్చిందంటుంది విష్ణు పురాణం. వీళ్లెవరూ చారి త్రక వ్యక్తులు కాదు. ఇవి చిన్న పిల్లలకు చెప్పటానికి సరిపోయే కథలు. కాగా, అసలు సంగతి అది కాదు. తొలినాటి ఆర్యగ ణాల్లో పంచగణాలుగా ప్రసిద్ధి చెందిన వాటిలో పురులు ఒకటి. దీని శాఖల్లో ఒకటి భరతులు. భరత తెగకు చెందింది కురు వంశం. ఈ వంశానికి చెందిన దాయాదులు కౌరవ పాండవులు. వాళ్ల కథే భారతం.

ఇది అట్లా ఉంచితే, భరత వర్షం మీద పరిశోధన చేసిన జెఎన్ యూ ప్రొఫెసర్ బిడి చటోపాధ్యాయ ఇండియా, భరతవర్షం వంటి మాటలకు చరిత్ర పొడవునా ఒకే భౌగోళిక స్వరూపం లేదంటారు. భరతవర్షం 'జన' అనే చిన్న పరిపాలనా భాగంగా మొదలై కొంచెం పెద్దదైన జనపదంగా, ఆ తరువాత దిశ్‌గా విస్తరించిందంటారు. ఈ దశలో అది ఉత్తరాపథంలో కొంత


ప్రాంతానికి మాత్రమే పరిమితమైన భూభాగం అని అన్నారు. ఇందులో దక్షిణం ఎంత మాత్రమూ భాగం కాదు. క్రీశ 5, 6 శతాబ్దాల్లో క్రోడీకరింపబడిన విష్ణుపురాణం భరతవర్ష వర్ణన చేస్తూ వసుంధర (ప్రపంచం)లో ఉన్న ఏడుభాగాల్లో జంబూ ద్వీపం(భారత ఉపఖండం) ఒకటనీ, అందులో ఉన్న తొమ్మిది విభాగాల్లో భరతవర్షం ఒకటనీ అంటూ అది సముద్రానికి ఉత్తరాన, హిమాలయాలకు దక్షిణాన ఉన్నది అని చెప్పింది. అప్పటికే చంద్రగుప్తమౌర్యుడూ, సముద్రగుప్తుడూ దేశంలో అత్యధికభాగాన్ని జయించి పాలించారు కాబట్టి విష్ణు పురాణానికి ఈ అవగాహన రావడంలో ఆశ్చర్యం లేదు. అయితే భౌగోళిక అవగాహన వేరు భావనాత్మక అవగాహన వేరు. ఒక వ్యక్తి తనను కోసల రాజ్య పౌరుణ్ణనో, మగధ రాజ్య నివాసిననో చెప్పు కున్నాడు కానీ, ఏ దశలోనూ తను భరతఖండానికి చెందిన వాణ్ణని చెప్పుకున్న ఆధారాల్లేవంటారు ఆచార్య చటోపాధ్యాయ.

విదేశీయులనీ, ఇతరులనీ, దురాక్రమణదారులనీ పేర్లు పెట్టబడినవారు ప్రవేశించక మునుపే భరత ఖండం అనే భౌగోళి స్వరూపం ఉందని చెప్పడం భారత్ లక్ష్యం. వారిని మినహాయించి, లేక ద్వితీయశ్రేణి పౌరులుగా చేసి దేశాన్ని రూపొందించాలనుకున్నపుడు వారు లేనప్పటి పేరే ఆదర్శమౌతుంది.

భారత్ అనడం వెనుక ఉన్న భావనలో ఏమి ఉంది, ఎవరు లేరు అనేవి కీలక ప్రశ్నలు. వీటికి సమాధానాలు 2020లో యుజిసి రూపొందించిన Learning Outcomes Based Curriculum Frameworkలో భాగంగా అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులకు నిర్దేశించి సిలబస్‌లో ప్రవేశపెట్టిన Idea of Bharath (భారత్ భావన) అనే పేపర్‌లో దొరుకుతాయి. ఇప్పుడిది జాతీయ విద్యా విధానం 2020లో భాగం. ఇది మొత్తం బి.ఎ. చరిత్రకు పరిచయాత్మక అంశంగా మొదటి పేపర్‌గా నిర్ణయించబడింది. దీని సిలబస్‌లో భరత వర్షం, స్థల కాల భావనలు, వేదాలు, ఉపనిషత్తులు, ఇతిహాసాలు, జైన బౌద్ధ వాఙ్మయం, లిపి పరిణామం, జ్ఞాన సంప్రదాయాలు, శౌర్యం (Indian valour), విద్యా విధానం, నైతికత, సామాజిక విలువలు, వసుధైక కుటుంబకం, శాస్త్రసాంకేతిక అభివృద్ధి, ఆయుర్వేదం, ప్రకృతివైద్యం, ఆర్థికభావనలు-భూమి, పరిశ్రమలు, వ్యాపారం, సముద్ర వాణిజ్యం మొదలైన అంశాలున్నాయి. ఇవన్నీ ప్రాచీన భారతదేశానికి సంబంధించినవే. ఇవి తప్పక అధ్యయనం చెయ్యవలసిన అంశాలనడంలో సందేహం లేదు. అయితే ఇది మాత్రమే భారత్ భావన ఎట్లా అవుతుందీ ? దీనిలోకి మధ్య యుగాలనాటి అపారమైన పర్షియన్ సాహిత్యం, మదర్సాలు, యునానీ వైద్యం, యుద్ధతంత్రం, కొనసాగిన శాస్త్ర సాంకేతిక అభివృద్ధి, అన్నిటినీ మించి భక్తి ఉద్యమంలోని సంస్కరణ భావాలు, సూఫీ తత్వం, ఉర్దూ భాష, వెల్లివిరిసిన దక్షిణ భారత, ఇతర ప్రాంతీయ భాషా సాహిత్యాలు, ఇక ఆధునికయుగానికొస్తే పాశ్చాత్య విద్య, సాంఘిక మత సంస్కరణోద్యమాలు, జాతీయభావ చైతన్యం, ప్రజాస్వామిక లౌకికభావనలూ ఇవన్నీ కలిస్తే కానీ భారత్ భావన ఏర్పడదు. 1947 దాకా జరిగిన పరిణామాల సారాంశంతో వైవిధ్యాన్ని భారతదేశ ఆత్మగా ప్రతిష్ఠిస్తూ రూపొందించాల్సిన భారత్ భావన ఇక్కడ కేవలం హిందు భావనగా మిగిలింది. ఇండియాను తొలగించి భారత్‌ను వెలిగించడం వెనుక ఉద్దేశ్యం ఇదే కావొచ్చు. భారత్ అంటే తొలినాళ్ల దేశమేననే సంకేతమివ్వడం కావొచ్చు. తరువాత ప్రవేశించిన జాతులు, మతాలు భారత్‌లో భాగంకాదని చెప్పడం కావొచ్చు. అది అధిక సంఖ్యాకవాద వ్యక్తీకరణ కావొచ్చు. లేక భారతీయులందరూ హిందువులేనని చెప్పడం కావొచ్చు. దేశమంటే మనుషులు కాదు, మట్టి మాత్రమే అనడం కావొచ్చు. భారత్ భావన ఇంత వరకే పరిమితం కాలేదు. అది అధికరణాల్ని అధిగమించి కశ్మీర్ సరస్సులో వికసించగల కమలం అయింది. మైనారిటీలుగా హిందువులు ఇతరదేశాల్లో తింటున్న దెబ్బలకు సీఏఏతో దెబ్బకు దెబ్బ తీయగల వస్తాదునంది. అరవై దేశాలకుపైగా కొవిడ్ టీకాను అందించిన ఆధునిక ధన్వంతరిగా మారింది. అంతేకాదు, అది చంద్రుడిపై అంతరిక్ష నౌకను దింపగల వ్యోమ అగ్రగామి. దేశ ఆర్థిక వ్యవస్థను ఐదు ట్రిలియన్ డాలర్లు దాటించగల బిగ్‌బుల్. ఒక వైపు మనుస్మృతిని పాటిస్తూనే ఇతర మతాలకు మాత్రం ఉమ్మడి పౌరస్మృతిని తీసుకురాగల న్యాయసింహం. పాక్ ఆక్రమిత కాశ్మీర్‌ను స్వాధీనం చేసుకోగల మహాబలి. విశ్వగురు.

ఈ మొత్తం భావజాలాన్ని ఎన్నికల ఫలితాలు ఒక్క కుదుపుకు లోనుచేశాయి. ఎన్నికల్లో సాధారణ మెజారిటీ సాధించలేక పోయినా ఎన్డీఏ కూటమిలో భాజపా భాగస్వామ్యం 82 శాతం ఉంది. అనేక ప్రయోజనాలు ఆశించి కూటమిలో ఉన్న తెలుగు దేశం, జనతాదళ్‌లు భాజపా మౌలిక భావజాల వ్యాప్తిని అరికట్టగలవా, అసలా ఉద్దేశ్యం వాటికి ఉన్నదా అన్నవి ప్రశ్నలు. వాటికీ భాజపాకు మధ్య సాగే ఇచ్చి పుచ్చుకునే బంతులాటలో అవి రాజ్యాంగస్ఫూర్తిని జారవిడుస్తాయేమోనని అనుమానం. ఎందుకంటే ఈ సంవత్సరం నుంచి ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకాల్లో ఇండియాను తొలగించి భారత్ అని రాయనున్నట్టు గతంలోనే ప్రకటించారు. దేశానికి పాఠ్య పుస్తకం రాజ్యాంగం కదా. అందులో నుంచి తొలగించే అవకాశం ఇప్పుడు లేకపోవచ్చు కానీ, ఈ ప్రతీకాత్మక అడుగును ఇండియా ఎదుర్కొనవలసి ఉంటుంది. ఈ దేశం గర్భస్థ పిండంగా ఉన్నప్పటి పేరు భారత్. సర్వాంగాలూ సంతరించుకుని పూర్ణశిశువుగా జననం పొందినపుడు ప్రామాణిక గ్రంథంలో 'ఇండియా దట్ ఈజ్ భారత్' అనే పేరును నమోదు చేశారు. అది ఇండెలిబుల్ ఇంక్‌తో రాయబడింది. దాన్ని చెరిపితే దేశం చెదిరిపోతుంది. ❑

# ఆర్ఎస్ఎస్ ఓ ఫాసిస్టు సంస్థ



- అనువాదం : ఎం.కోటేశ్వరరావు

- మధు లిమాయే

**నేను 1937లో రాజకీయ జీవితంలో ప్రవేశించాను. ఆ రోజుల్లో పూనాలో ఆర్ఎస్ఎస్ మరియు సావర్కర్ వాదులు (వినాయక్ దామోదర్ సావర్కర్ అనుచరులు) ఒక వైపు, మరోవైపు జాతీయవాదులు, సోషలిస్టులు మరియు వామపక్ష రాజకీయ సంస్థలు ఎంతో చురుకుగా ఉండేవి. 1938 మే 1న మే దినోత్సవాన్ని పాటించేందుకు మేము ఒక ప్రదర్శన జరిపాము. దాని మీద ఆర్ఎస్ఎస్, సావర్కర్‌వాదులు దాడి చేశారు. ఆ సందర్భంగా సుపరిచితులైన విప్లవవాది సేనాపతి బాపట్, మా సోషలిస్టు నేత ఎస్ఎం జోషి కూడా గాయపడిన వారిలో ఉన్నారు. హిందూత్వ సంస్థలతో అప్పటి నుంచి మాకు తీవ్రమైన విభేదాలు ఉండేవి.**

జాతీయవాద సమస్య మీద ఆర్ఎస్ఎస్‌తో మా తొలి విభేదం ఉంది. భారతదేశంలో ప్రతి పౌరుడికి సమాన హక్కులు ఉండాలని మేము నమ్మాము. కానీ ఆర్ఎస్ఎస్, సావర్కర్ వాదులు హిందూ రాష్ట్ర అనే భావంతో వచ్చారు. మహమ్మదాలీ జిన్నా కూడా అలాంటి లోకపు భావన బాధితుడే. భారత్ రెండు-ముస్లిం, హిందూ దేశాలతో ఏర్పడిందని అతను నమ్మారు. సావర్కర్ అదే చెప్పారు.

మా మధ్య రెండో ప్రధాన విభేదం ఏమిటంటే మేము ఒక ప్రజాస్వామిక సర్వసత్తాక రాజ్యం ఉద్భవించాలని కలగన్నాము. ప్రజాస్వామ్యం పశ్చిమదేశాల భావన, భారత్‌కు పనికిరాదని ఆర్ఎస్ఎస్ చెప్పింది. ఆ రోజుల్లో ఆర్ఎస్ఎస్ సభ్యులు అడాల్ఫ్ హిట్లర్‌ను ఎంతగానో పొగిడేవారు. గురూజీ(మాధవ సదాశివ గోల్వాల్కర్) ఆర్ఎస్ఎస్ అధిపతిగానే కాదు సైద్ధాంతిక గురువుగా కూడా ఉండేవారు. గురూజీ మరియు నాజీల మధ్య ఆలోచనల్లో అద్భుతమైన సామీప్యతలు ఉన్నాయి. ఆయన ఉత్తమ రచనల్లో ఒకటిగా ఉన్న "ఉయి ఆర్ అవర్ నేషన్‌హుడ్ డిఫైన్డ్" అనే గ్రంథం అనేక ప్రచురణలు పొందింది. హిందువులు కాని వారిని పౌరులుగా పరిగణించకూడదని స్పష్టంగా దానిలో చెప్పారు. వారి పౌరసత్వ హక్కులను రద్దు చేయాలని కోరారు. ఈ ఆలోచనలు కొత్తగా రూపుదిద్దుకున్నవి కాదు. మేము కాలేజీలో ఉన్న రోజుల నుంచి (1930 దశకం మధ్యలో) హిట్లర్ భావజాలంవైపు ఆర్ఎస్ఎస్ సభ్యులు మొగ్గు చూపేవారు. వారి దృష్టి ప్రకారం జర్మనీలో యూదుల పట్ల హిట్లర్ ఎలా వ్యవహరించాడో అదే మాదిరి భారత్‌లో ముస్లింలు, క్రైస్తవుల పట్ల వ్యవహరించాలి. నాజీ పార్టీ భావాల పట్ల గురూజీ ఎంతలా సానుకూలంగా ఉన్నారో "ఉయి ఆర్ అవర్ నేషన్‌హుడ్ డిఫైన్డ్" గ్రంథంలో దిగువ పేరాయే సాక్ష్యం. "తన జాతి, సంస్కృతిని పరిశుద్ధంగా ఉంచేందుకు సెమిటిక్ జాతులను-యూదులను అంతమొందించి జర్మనీ ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. జాతి ఔన్నత్యం దాన్ని ఉన్నతిని ఇక్కడ స్పష్టం చేసింది. జాతులు, సంస్కృతుల మధ్య ఉన్న విభేదాలకు కారణాలు తెలుసుకొంటే వాటిని తొలగించటం అసాధ్యం కాదని, ఐక్యంగా ఉంచటానికి సమీకృతం చేసేందుకు ప్రపంచానికి జర్మనీ దారిచూపింది. దాన్నుంచి నేర్చుకొనేందుకు, లబ్ధి పొందేందుకు హిందూస్తాన్‌లో మనకు మంచి పాఠం".

కుల సమస్య మీద గురూజీ మరియు ఆర్ఎస్ఎస్‌తో మా మూడో ప్రధాన విభేదం. ఒక సోషలిస్టుగా నా వంటి వారికి అది ఒక పెద్ద శత్రువు కాగా కుల వ్యవస్థ సమర్థకులు వారు. కుల వ్యవస్థ దాని పునాదిగా ఉన్న అసమానతలను నిర్మూలించకుండా భారత్‌లో ఆర్థిక, సామాజిక సమానత్వం సాధ్యం కాదన్నది నా గట్టి వైఖరి.

మేము విభేదించిన నాలుగో అంశం భాష. పౌరుల భాషలను ప్రోత్సహించేందుకు మేము అనుకూలం. అన్ని ప్రాంతీయ భాషలు దేశీయమైనవే. కానీ దీని మీద చెప్పిందేమిటి ? అందరికీ ఉమ్మడి భాషగా ప్రస్తుతానికి హిందీని, తరువాత అంతిమంగా జాతీయ భాషగా సంస్కృతాన్ని చేయాలని గురూజీ చెప్పారు.

ఐదవది, స్వాతంత్ర్యం కోసం తలెత్తిన జాతీయ ఉద్యమం ఫెడరల్ రాజ్యం అనే భావనను ఆమోదించింది. ఒక సమాఖ్య దేశంలో కొన్ని నిర్దేశిత విషయాలలో కేంద్రం కొన్ని తప్పనిసరి అధికారాలను కలిగి ఉంటుంది, ఇతర అన్ని అంశాలు రాష్ట్రాలకు చెందినవిగా ఉండాలి. కానీ దేశ విభజన తరువాత కేంద్రాన్ని పటిష్టపరిచేందుకు ఉమ్మడి జాబితాను నిర్దేశించారు. ఈ జాబితా ప్రకారం అనేక అంశాలను ఉమ్మడి జాబితాలో చేర్చారు. వాటి మీద కేంద్రం, రాష్ట్రాలకు సమానమైన అధికార పరిధి ఉంది. ఆ విధంగా సమాఖ్య రాజ్యం ఉనికిలోకి వచ్చింది. కానీ ఆర్ఎస్ఎస్ మరియు దాని ప్రధాన సిద్ధాంతవేత్త గురు

గోల్వాల్కర్ ఈ మౌలిక రాజ్యాంగ ఏర్పాటును వ్యతిరేకించారు. రాష్ట్రాల సమాఖ్య భావననే వీరు అపహాస్యం చేశారు. రాష్ట్రాల సమాఖ్యను కోరిన రాజ్యాంగాన్నే రద్దు చేయాలన్నారు. తన " బంచ్ ఆఫ్ థాట్స్" అనే గ్రంథంలో రాజ్యాంగాన్ని సమీక్షించాలని, కొత్త రాజ్యాంగంలో ఏక(యూనిటరీ) రాజ్య ఏర్పాటును లిఖించాలని పేర్కొన్నారు. ఏక లేదా మరో మాటలో చెప్పాలంటే కేంద్రీకృత రాజ్యాన్ని గురూజీ కోరారు.రాష్ట్రాల వ్యవస్థను వదిలించుకోవాలని చెప్పారు.

జాతీయోద్యమం ఎంచుకున్న త్రివర్ణ పతాకం మరొక సమస్య. మనం ఎంచుకున్న జాతీయ పతాక గౌరవం, ఔన్నత్యం కోసం వందలాది మంది భారతీయులు తమ ప్రాణాలను త్యాగం చేశారు, వేలాది మంది లాఠీ దెబ్బలను తిన్నారు. కానీ ఆశ్చర్యం ఏమిటంటే ఆర్ఎస్ఎస్ త్రివర్ణాన్ని జాతీయ జెండాగా ఎన్నడూ ఆమోదించలేదు. అది ఎల్లవేళలా కాషాయ పతాకానికే వందనం చేస్తుంది. స్మృతికందని కాలం నుంచీ అది హిందూ రాజ్య పతాకంగా ఉందని చెబుతుంది. ప్రజాస్వామిక వ్యవస్థ పట్ల గురూజీకి విశ్వాసం లేదు. ప్రజాస్వామ్య భావన పశ్చిమ దేశాల నుంచి దిగుమతి చేసుకున్నదనే దృఢ వైఖరిని కలిగి ఉన్నారు. భారతీయ నాగరికత, ఆలోచనకు పార్లమెంటరీ ప్రజాస్వామ్యం తగినది కాదన్నారు. ఏక నాయకత్వ సూత్రాన్ని ఆర్ఎస్ఎస్ నమ్ముతుంది. ఆర్ఎస్ఎస్ ఒక మానసిక దృక్పథాన్ని సృష్టిస్తుం దని అది పూర్తిగా క్రమశిక్షణతో కూడుకున్నదిగా ఉంటుందని అది ఏం చెబితే దాన్ని జనం అంగీకరిస్తారని గురూజీ కూడా స్వయంగా చెప్పారు. ఈ సంస్థ ఏక వ్యక్తి నాయకత్వ సూత్రం మీదనే పనిచేస్తుంది. సోషలిజం గురూజీ దృష్టిలో పూర్తిగా వెలుపలి భావజాలం, సోషలిజం, ప్రజాస్వామ్యంతోపాటు అన్ని ఇజాలూ విదేశీ ఆలోచనలే. వాటిని తిరస్కరించాలని, భారతీయ సమాజాన్ని భారతీయ సంస్కృతి ఆధారంగా నిర్మించాలని అతను పదే పదే చెప్పారు.

మా గురించి చెప్పాలంటే పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, సోషలిజం పట్ల మాకు విశ్వాసం ఉంది. శాంతియుత పద్ధతుల్లో గాంధీయన్ సూత్రాలకు అనుగుణంగా సోషలిజాన్ని ఏర్పాటు చేయాలని మేము కోరుకుంటున్నాము. మరోవైపు ఒక ప్రత్యేక మూసలో యువ మెదళ్లను తయారు చేయడంలో ఆర్ఎస్ఎస్ ప్రత్యేక నైపుణ్యాన్ని సంతరించుకుంది. తొలుత అది పిల్లలు, యువత మెదళ్లలోకి ఏమీ ప్రవేశించకుండా ఘనీభవింప చేస్తుంది. ఆ తరువాత వారు ఇతర భావజాలాలకు స్పందించ లేని అశక్తులుగా మారిపోతారు.

పేదల పట్ల కనికరం అవసరం లేదని గురూజీ భావించారు. తన బంచ్ ఆఫ్ థాట్స్ గ్రంథంలో దేశంలో జమిందారీ వ్యవస్థ రద్దు పట్ల వ్యతిరేకతను వ్యక్తం చేశారు. ఆ వ్యవస్థ రద్దు పట్ల తీవ్ర విచారాన్ని వ్యక్తం చేయటమే కాదు, తీవ్రంగా కలత చెందారు. ఇందిరాగాంధీ అత్యవసర పరిస్థితిని రుద్దినపుడు వీరితో (ఆర్ఎస్ఎస్ మరియు జనసంఘ్‌ను) మేము ఒక కూటమి కట్టామన్నది ఒక వాస్తవం. ఒక పార్టీగా ప్రతిపక్షాలు ఐక్యం కాకపోతే ఇందిరా గాంధీని ఓడించలేమని లోక్‌నాయక్ జయప్రకాష్ నారాయణ నమ్మారు. చౌదరి చరణ్‌సింగ్ కూడా అలాంటి వైఖరినే కలిగి ఉన్నారు. కనుక మేము ఒకే పార్టీగా ఐక్యమయ్యాము. మేము జైలులో ఉండగా ఒక పార్టీని ఏర్పాటు చేయటం, ఎన్నికల్లో పోటీ చేయటం గురించి అభిప్రాయాలు చెప్పమని మమ్మల్ని అడిగారు. మనం తప్పనిసరిగా ఎన్నికల్లో పోటీ చేయాలని ఒక సందేశాన్ని పంపిన అంశాన్ని గుర్తు చేసుకున్నాను. కోట్లాది మంది జనం ఎన్నికల్లో పాల్గొంటారు. ఎన్నికలు ఒక క్రియాశీల క్రమం. ఎన్నికల వాతావరణం పెరిగే కొద్దీ అత్యవసర పరిస్థితి సంకెళ్లు తెగుతాయి. జనం తమ ప్రజా స్వామిక హక్కును వినియోగించుకుంటారు. అందువలన మనం ఎన్నికల్లో పాల్గొనాలని నేను గట్టిగా చెప్పాను. ఒకే పార్టీ పతాకం కిందకు అందరూ రాకపోతే విజయం సాధించలేమని లోక్ నాయక్ జయప్రకాష్ నారాయణ్ ఇతర నేతల వైఖరి ఉన్న కారణంగా సోషలిస్టులంగా మా అంగీకారం తెలిపాం. అయితే ఇక్కడ ఒక విషయాన్ని నొక్కి చెప్పదలచాను. రాజకీయ పార్టీలు– జనసంఘ్, సోషలిస్టు పార్టీ, కాంగ్రెస్(ఓ), భారతీయ లోక్‌దళ్ (బీఎల్‌డీ), కాంగ్రెస్ ముఠాలలోని కొన్ని అసంతృప్త తరగతుల మధ్య మాత్రమే అవగాహన కుదిరింది. ఆర్ఎస్ఎస్‌తో ఎలాంటి ఏర్పాటుకు మేము రాలేదు. దాని డిమాండ్లను వేటినీ అంగీక రించలేదు. ఇంకా చెప్పాల్సిందేమంటే జైల్లో ఉన్న మా మధ్య పంపిణీ అయిన మనూభాయ్ పటేల్ లేఖ ద్వారా 1976 జూలై 7న మేము తెలుసుకున్నదేమంటే కొత్త పార్టీలో ఆర్ఎస్ఎస్ వారు పార్టీ సభ్యులైతే ద్వంద్వ సభ్యత్వ వివాదం తలెత్తవచ్చని చౌదరి చరణ్‌సింగ్ ఒక సమస్యను లేవనెత్తారు. దీని మీద అప్పుడు జనసంఘ్‌ను తాత్కాలిక ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఓమ్ ప్రకాష్ త్యాగి స్పందిస్తూ కొత్త పార్టీ సభ్యత్వాన్ని ఎలా కావాలంటే అలా రూపొందించుకోవచ్చని స్పందించారు. ఆర్ఎస్ఎస్ అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నందున రద్దయినట్లేనని, ఆర్ఎస్ఎస్ సభ్యత్వ సమస్య తలెత్తదని కూడా చెప్పారు.

తరువాత ప్రతిపాదిత జనతా పార్టీ నిబంధనావళిని రూపొం దించేందుకు ఒక ఉపసంఘాన్ని నియమించారు. జనతా పార్టీ లక్ష్యాలు, విధానాలు, కార్యక్రమాలతో విభేదించే ఏ సంస్థకు చెందిన వారికీ జనతా పార్టీలో సభ్యత్వం ఇవ్వకూడదని ముసా యిదా నిబంధనావళిలో పెట్టారు. దీని అర్థం ఏమంటే ఎవరూ ఈ నిబంధనను వ్యతిరేకించకూడదన్నది స్పష్టం. అయినప్పటికీ దీనికి వచ్చిన ఒకే ఒక అభ్యంతరం జనసంఘ్‌కు చెందిన సుందర్‌సింగ్ భండారీ నుంచి వెలువడటం గమనించాలి. తలెత్తిన సమస్యలను పరిష్కరించేందుకు 1976 డిసెంబరులో

ఏర్పాటు చేసిన సమావేశానికి జనసంఘ్‌ను, ఆర్‌ఎస్‌ఎస్ తరఫున అటల్ బిహారీ వాజ్‌పాయి రాసిన లేఖలో ప్రతిపాదిత పార్టీలో ఒక తరగతి నేతలు జనతా పార్టీ సభ్యత్వానికి సంబంధించి ఆర్‌ఎస్‌ఎస్ సమస్యను లేవనెత్తకూడదని అంగీకరించినట్లు పేర్కొన్నారు. అయితే అనేక మంది నేతలు అలాంటి హామీ ఇవ్వలేదని నాకు చెప్పారు. ఎందుకంటే ప్రతిపక్ష రాజకీయ పార్టీలు విలీనం కావాలని తలపెట్టినపుడు రంగంలో ఆర్‌ఎస్‌ఎస్ ఎక్కడా లేదు గనుక అన్నారు. నేను ఒకటి స్పష్టం చేయదలచాను. ఆ సమయంలో నేను జైల్లో ఉన్నాను. ఒక వేళ ఒక రహస్య అవగాహనకు వచ్చి ఉండి ఉంటే దానిలో నాకు భాగస్వామ్యం లేదు.

నేను ఒకటి విస్పష్టంగా చెప్పగలను. జనతా పార్టీ ఎన్నికల ప్రణాళిక ఏ రీత్యా చూసినా ఆర్‌ఎస్‌ఎస్ అంశాలను ప్రతిబింబించలేదు. వాస్తవానికి ప్రణాళికలోని ప్రతి అంశమూ స్పష్టంగా ఉంది. లౌకిక, ప్రజాస్వామిక, గాంధీయన్ సూత్రాల ప్రాతిపదికగా సోషలిస్టు సమాజం గురించి జనతా పార్టీ ప్రణాళిక ఉంది. దీనిలో హిందూ దేశం గురించిన ప్రస్తావన లేదు. మైనారిటీలకు సమాన హక్కులకు హామీ ఇవ్వటమే కాదు, వారి హక్కులకు రక్షణ కల్పిస్తామని కూడా చెప్పింది. కుల వ్యవస్థను కొనసాగిస్తామని చెప్పిందా ? ఇతరుల సేవకు శూద్రులు తమ జీవితాలను అర్పించాలని చెప్పిందా ? దానికి విరుద్ధంగా వెనుకబడిన తరగతుల పురోగమనానికి వాగ్దానం చేయటమే కాదు పూర్తి అవకాశాలు కల్పిస్తామని చెప్పింది, వారి కోసం ప్రత్యేక విధానాలు తీసుకొస్తామని పేర్కొన్నది. వారికి ప్రభుత్వ ఉద్యోగాల్లో 25-33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పింది. గురూజీ కేంద్రీకరణ జరపాలని గట్టిగా చెప్పగా వికేంద్రీకరిస్తామని జనతా పార్టీ అంగీకరించింది. రాష్ట్రాలను రద్దు చేయాలని, అసెంబ్లీలను, మంత్రి వర్గాలను కూడా రద్దు చేయాలని అతను కోరగా మరింత వికేంద్రీకరణ జరగాలని జనతా పార్టీ నొక్కివక్కాణించింది. మరో విధంగా చెప్పాలంటే రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని లాక్కోవాలన్న వాంఛ జనతా పార్టీకి లేదు.

పార్టీ ఎన్నికల ప్రణాళికలోని అంశాలను స్వచ్ఛందంగా అంగీకరించలేదన్నది నిజం. ఇది నా అభ్యంతరం, అంతే కాదు రాతపూర్వకంగా ఒకసారి కుష్‌భాహు థాకరేకు ఫిర్యాదు చేశాను. చర్చల సందర్భంగా మీవారు(ఆర్‌ఎస్‌ఎస్, జనసంఘ్‌ను) వెంటనే అంగీకరించినా హృదయ పూర్వకంగా పూర్తిగా వ్యతిరేకించారని నేను చెప్పాను. అందుకే మీ ఉద్దేశాలను అనుమానించాల్సి వస్తోంది. ఈ లేఖను నేను ఎంతో కాలం క్రితమే రాశాను. ఆర్‌ఎస్‌ఎస్ గురించి నాకు ఎప్పుడూ సందేహమే. నిరంకుశత్వాన్ని వ్యతిరేకించేందుకు అన్ని ప్రతిపక్ష పార్టీలు ఏకం కావాలన్న లోక్ నాయక్ జయప్రకాష్ నారాయణ వాంఛ. ఎలాంటి రాజీలు లేకుండా పార్టీ ఎన్నికల ప్రణాళిక ఉండటం వలన మన ఐక్యతకు నేను ఆమోదం తెలిపాను. అదే సమయంలో నేను ఒకటి చెప్పదలచుకున్నాను. ప్రారంభం నుంచి నాకు ఒక స్పష్టత ఉంది ఐక్య, విశ్వసనీయమైన జనతా పార్టీ ఆవిర్భవించాలంటే రెండు పనులు చేయాల్సి ఉంటుందని నా మనసులో ఉంది. ఒకటి, ఆర్‌ఎస్‌ఎస్ తన భావజాలాన్ని మార్చుకోవాలి. మరియు లౌకిక, ప్రజాస్వామిక రాజ్య భావనను అంగీకరించాలి. రెండవది, సంఘపరివార్‌లో భాగంగా ఉన్న వివిధ సంస్థలు భారతీయ మజ్దూర్ సంఘ్‌ను, విద్యార్థి పరిషత్ వంటివి తమను తాము రద్దు చేసుకొని లౌకిక భావజాలం ఉన్న కార్మిక సంఘాల్లో, జనతా పార్టీ విద్యార్థి విభాగంలో విలీనం కావాలి. జనతా పార్టీ కార్మిక విభాగం, విద్యార్థి విభాగాల వ్యవహారాలను పర్యవేక్షించమని పార్టీ నాకు విధి అప్పగించిన నాటి నుంచీ నేను దీని గురించి స్పష్టతతో ఉన్నాను. ఈ రెండు సంస్థలూ ప్రత్యేక ఉనికిని రద్దు చేసుకోవాలని నేను ప్రయత్నిస్తూనే ఉన్నాను. హిందువులను మాత్రమే సంఘటితపరచాలనే మీ భావజాలాన్ని వదలి వేసుకోవాలని, మీ సంస్థలో అన్ని మతాల వారికీ చోటు కల్పించాలని, జనతా పార్టీలో ఉన్న భిన్నమైన తరగతుల ప్రాతిపదికన ఉన్న సంస్థలలో విలీనం కావాలని నేను ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులకు చెప్పాను. అది వెంటనే జరిగేది కాదని, అనేక ఇబ్బందులు ఉన్నాయని, కానీ కొద్ది కొద్దిగా మారాలని కోరుకుంటున్నట్లు వారి స్పందన ఉంది. వారు అలా తప్పించుకొనే జవాబులను కొనసాగించారు.

వారి ప్రవర్తన చూసిన తరువాత వారిలో మార్పు ఉద్దేశ్యం లేదన్న నిర్ధారణకు వచ్చాను. ప్రత్యేకించి 1977జూన్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల తరువాత వారు నాలుగు రాష్ట్రాల్లో, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలో అధికారానికి రాగలిగారు. అప్పటి నుంచి కొత్తగా వచ్చిన ప్రతిష్టతో మారాల్సిన అవసరం లేదని వారు ఆలోచించటం ప్రారంభించారు. ఇప్పటికే వారు నాలుగు రాష్ట్రాలను కైవశం చేసుకున్నారు. క్రమంగా ఇతర రాష్ట్రాలను, చివరకు కేంద్రాన్ని కూడా పట్టుకొనేందుకు చూస్తారు. జనతా పార్టీలోని ఇతర రాజకీయ నేతలు పెద్ద వారు, వారు ఎంతో కాలం జీవించలేరు. పార్టీలో ఉన్న ఉన్నత స్థానాలకు ఎదిగేట్లు ఆర్‌ఎస్‌ఎస్, జనసంఘేతర నేతలను చేయలేరు. అయినప్పటికీ నేను ప్రయత్నించాను. ఒక సందర్భంగా అన్ని కార్మిక సంఘాల నేతల సమావేశం ఏర్పాటుచేశా. జనతా పార్టీలోని అన్ని పక్షాల ప్రతినిధులు వచ్చారు. భారతీయ మజ్దూర్ సంఘ్‌ను సమావేశాన్ని బహిష్కరించింది. అంతే కాదు ఎలాంటి కారణం లేకుండానే వారు నన్ను దూషించారు. విద్యార్థి పరిషత్, యువ మోర్చాలతో అలాంటి ప్రయత్నమే జరిగింది. విలీనం కోసం జరిగిన అన్ని ప్రయత్నాలకూ వారు దూరంగా ఉన్నారు. ఇదంతా ఎందుకంటే పార్టీ మీద పెత్తనం చేయాలన్న ఆర్‌ఎస్‌ఎస్ వాంఛ కారణంగానే. ప్రజల ప్రతి జీవన రంగంలోకి ప్రవేశించాలన్నది

వారి లక్ష్యం, అంతేకాదు దాన్ని అదుపు చేయాలన్నది కూడా. ఇలాంటి అభిప్రాయాలను గురూజీ తన ఉరు అర్ అవర్ నేషన్‌హుడ్ డిఫైన్డ్ అనే గ్రంథంలో పదే పదే వక్కాణించారు. నిరంకుశ సంస్థ ఏదీ స్వేచ్ఛను అనుమతించదు. దాని వేర్లు కళలు, సంగీతం, ఆర్థికం, సాంస్కృతిక రంగం ప్రతిచోటా ఉంటాయి. ప్రతి ఫాసిస్టు సంస్థ సారం ఇదే. వీరు అరుదైన సందర్భాలలో చేసే దానికి పెద్ద ప్రాధాన్యత ఉండదు. గురూజీ బాటలో ఆలోచనలను వదలి వేస్తామని ఆర్‌ఎస్‌ఎస్ ఎన్నడూ చెప్పలేదు. జైళ్లలో ఉన్నపుడు వీరు క్షమాభిక్ష కోసం ప్రార్థించారు. రాజనారాయణ్ కేసులో సుప్రీంకోర్టు తీర్పు ఇందిరాగాంధీకి అనుకూలంగా వచ్చినపుడు బాలాసాహెబ్ దేవరస్ ఆమెను అభినందించారు. అందువలన వీరి ఉద్ఘాటనల మీద నాకు నమ్మకం లేదు. నేను వీరిని (జనతా పార్టీలో పూర్వపు జనసంఘ్ నేతలు) ఎప్పుడు నమ్ముతానంటే పార్టీ, కార్యవర్గ కమిటీల నుంచి ఆర్‌ఎస్‌ఎస్ నేతలను బహిష్కరించినపుడు, ఆర్‌ఎస్‌ఎస్ కార్యకలాపాల మీద ఆంక్షలు విధించినపుడు, ప్రత్యేకించి నానాజీ దేశముఖ్, సుందర్ సింగ్ బండారీ వారి అనుచరులను బహిష్కరించినపుడే నమ్ముతాను. ❑

**గమనిక :** మధు లిమాయే(1922 –1995) పూనాలో జన్మించారు. కాంగ్రెస్‌లో, కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ, తరువాత ప్రజా సోషలిస్టు పార్టీ నేతగా వ్యవహరించారు. ఆర్‌ఎస్‌ఎస్ సభ్యత్వంపై వివాదం కారణంగా జనతా పార్టీ నుంచి పూర్వపు జనసంఘనేతలు వేరు పడి బీజేపీని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. అధికారం కోసం అవసరాలకు అనుగుణంగా ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ ఊసరవెల్లి మాదిరి రంగులు మార్చింది తప్ప మౌలిక స్వభావం, లక్ష్యాలలో ఎలాంటి మార్పు లేదు. నాలుగు దశాబ్దాల నాడు(1979) రాసిన ఈ వ్యాసంలో లేవనెత్తిన అంశాలు నేటికీ సంగతమైనవే గనుక జనతా వార పత్రిక నుంచి సేకరించి అనువదించి అందించాను.

# ప్రస్తుత పాలనలో పిల్లల నాటకమూ నేరమే!

**(9వ పేజీ తరువాయి)**

ఎంత మందిని చంపినా, చివరి మనిషి వరకు నిన్ను ప్రతిఘటిస్తూనే ఉంటారు" అనే ఒక చారిత్రక సత్యాన్ని చెప్పడం. ఆ మొత్తం సభను రహస్యంగా వీడియో రికార్డ్ చేసుకున్న తెలంగాణ పోలీసులకి (ప్రత్యేకంగా చెప్పాలంటే ప్రజాస్వామ్య పరిరక్షణకు హామీ పడిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కనుసన్నల్లో నడిచే పోలీసులకి) వనరుల దోపిడీలో గాని, ఆ దోపిడీని ప్రతిఘటిస్తూ పోరాటం చేస్తున్న ఆదివాసులని చంపడంలో గానీ ఎలాంటి తప్పు కనిపించలేదు. కానీ ఆ సున్నిత మనస్కులకు పిల్లలని ఆ నాటకంలో భాగం చేయడం చాలా కలిచివేసింది. అందుకే సభ నుండి బయటకు వచ్చిన ఇద్దరు పిల్లలను మఫ్టీలో వచ్చి మరీ ఎత్తుకెళ్లిపోయారు. ఆ నాటకంలో ప్రదర్శించిన హింసాత్మక సంఘటనలు పసిపిల్లల హృదయాల్ని కలచివేస్తాయి కాబట్టి అందులో పాల్గొన్న పిల్లలకు, వారిని ప్రోత్సహించిన వారి తండ్రికి కౌన్సెలింగ్ అవసరం అని సదరు పోలీసు భావించారట. అందుకే ఆ పిల్లల్ని, వాళ్ల నాన్నకి ఉచిత కౌన్సెలింగ్ ఇచ్చి, మరోసారి ఇలాంటి తప్పు చేయకూడదని ఒక అండర్‌టేకింగ్ తీసుకొని పంపారు.

బహుశా దేశం మొత్తంలోనే ఇంతటి "కరుణామయ" పోలీసులు మరెక్కడా ఉండకపోవచ్చు. నిజమే. కళ్ల ముందు హింస జరుగుతుంటే చలనం లేనట్లుగా చూస్తూ ఉండిపోవాలి తప్ప రక్తమాంసాలున్న మనుషులుగా, బుద్ధి జీవులుగా ఎందుకు స్పందించాలి ? అందులోనూ పిల్లలను భాగస్వామ్యం చేయడం ఏంటి ? తెలంగాణ పోలీసులది ఎంతటి ఉదారవాద మానవత్వం !

మరి ఇంతకీ ఆ పిల్లల్ని కౌన్సెలింగ్ చేస్తున్నప్పుడు పోలీస్‌స్టేషన్ల ఉన్న తుపాకులు ఏం చేశారో ? బహుశా పిల్లల కంట పడకుండా దాచేసే ఉంటారు. కౌన్సెలింగ్ అని ఒక మంచి ముద్దు పేరు పెట్టారు కానీ, ఇంతకు ఆ పిల్లలతో పోలీసులు ఏం మాట్లాడి ఉంటారు? తమ "తోటి పిల్లల్ని తమ గ్రామాలకు, బడులకు, బాల్యానికి దూరం చేస్తూ వేట కుక్కల్లా వెంటాడుతున్న 'కగార్' సైనిక మూకల్ని అడవి నుండి బయటకు పిలవండి" అని పిల్లలు అడిగితే పోలీసుల దగ్గర ఏం సమాధానం ఉండేదో?! మళ్లీ ఇటువంటి నాటకంలో భాగంగా కావద్దు అని అంటే, కనీసం మానవత్వం ఉన్న మనుషులుగా బతకొద్దు అనే మెసేజ్‌ను పోలీసులు కౌన్సెలింగ్ ద్వారా ఇచ్చారనుకుందామా? అయినా నాటకాలు ఆడితే చట్ట సభల సాక్షిగా దోపిడీ వర్గాలు, కులాలు ఆడాలి కానీ, పీడిత ప్రజలు, వారికి మద్దతునిచ్చే కవులు, కళాకారులు రచయితలు ఆడితే ఎట్లా? ఎన్నికల్లో బూటకాలను ప్రచారం చేయడం, గెలిచి నాటకాలను చట్టసభల్లో ప్రదర్శించడం కూడా పిల్లల మనసులను, ఎదుగుతున్న వాళ్ల వ్యక్తిత్వాన్ని గాయపరుస్తాయి కదా.

మరి వీటి సంగతి ఏంటో రేవంత్‌రెడ్డి పోలీసులే చెప్పాలి. చరిత్రని చదువుకునే వయసులోనే ఆ పిల్లల్ని చరిత్ర నిర్మాణంలో భాగం చేసిన విప్లవ రచయితల సంఘానికి అభినందనలు. గడ్డ కట్టుకుపోతున్న సమాజాన్ని చలనంలోకి తేవడానికి తమ వంతు ప్రయత్నం చేసిన ఆ పిల్లలకి, ప్రోత్సహించిన తల్లిదండ్రులకు వందనాలు ! ❑

# బలహీనపడుతున్న మీడియా స్వేచ్ఛ



- నంటూ బెనర్జీ

**ప్రపంచవ్యాప్తంగా పత్రికలు, మీడియా స్వేచ్ఛ రోజురోజుకీ బలహీనపడుతోంది. కొన్నిదేశాల్లో ప్రభుత్వాలు జర్నలిస్టులపై నిరంకుశంగా వ్యవహరిస్తూ, తమ రహస్యాలను బైట పెట్టినందుకు జర్నలిస్టులపై నిరంకుశంగా వ్యవహరిస్తూ చంపివేసిన ఘటనలున్నాయి. 30 దేశాల్లో 360 మంది జర్నలిస్టులు పాలకుల రహస్యాలను కనిపెట్టినందుకుగాను అరెస్టుచేసి జైళ్లలో నిర్బంధించిన కేసులున్నాయి. ఇలాంటి వందల కేసుల్లో వికిలీక్స్ వ్యవస్థాపకుడు జులియస్ అసాంజె కేసు అత్యంత హృదయ విదారకరమైంది. అమెరికా నిఘాచట్టాన్ని ఉల్లంఘించారని కేసు బనాయించి జైలులో పెట్టారు. అసాంజే స్వేచ్ఛ పొందడానికి ఆస్ట్రేలియా ప్రధానమంత్రి ఆంథోని అల్బన్సె సహాయం చేశారు.**

అమెరికా ఏ దేశంలో ఎన్ని అకృత్యాలు నిర్వహించి, అమెరికా నిఘాసంస్థ ఎన్ని ప్రభుత్వాలను కూల్చి వేసిందని, ఇంకా అనేక విషయాలను బ్కెటపెట్టి తమను అప్రతిష్టపాలు చేసిందని ఆగ్రహం వ్యక్తం చేసి అమెరికా అసాంజెను కష్టాలపాలు చేసింది. ఆస్ట్రేలియా దౌత్యపరంగా సహకరించి అమెరికాతో చర్చలు జరిపిన తర్వాత ఎట్టకేలకు అసాంజెకు విముక్తి లభించింది. తాను తప్పు చేసినట్లు అసాంజె అంగీకరించడం వల్లనే స్వేచ్ఛ లభించింది. 14 ఏళ్లపాటు అసాంజె న్యాయ పోరాటం చేశారు. ఆస్ట్రేలియా సంఘీభావం ఆయనకు లభించింది. అసాంజె జన్మించిన దేశం ఆస్ట్రేలియా. అంతిమంగా అమెరికా అసాంజెను శిక్ష నుంచి మినహాయించాలని క్షమాబిక్ష పెట్టింది. అమెరికా సైనిక పత్రాలను, ఇరాక్, అఫ్ఘానిస్థాన్‌లపై అమెరికా చేసిన దాడులకు సంబంధించిన వీడియోలను అసాంజె బైటపెట్టారు. ఏ దేశంలో ఎన్ని ఘోరాలకు, నేరాలకు అమెరికా పాల్పడిన అంశంపై 'హిట్‌మాన్' పేరుతో పుస్తకం రాసి అమెరికా నిఘా విభాగానికి చెందిన రచయిత వారి గుట్టంతా బైటపెట్టారు. అమెరికా అఫ్ఘానిస్థాన్‌పై దాడి చేసి అనేక మందిని కస్టడీలోకి తీసుకుని అమెరికాలో ఖైదు విధించింది. మానవ హక్కులను ఉల్లంఘించి పౌరులను చంపివేశారు. ప్రభుత్వాలే కాకుండా అనేకమంది ఉన్నత స్థానాల్లోఉన్న నాయకుడు చేసిన అక్రమాలను సైతం బైటపెట్టారు. ప్రత్యేక సమాచారం పేరుతో రహస్యంగా దాచిన చర్యలను అసాంజె తన సామర్థ్యంతో వెలుగులోకి తీసుకొచ్చారు. ఆయన బ్రిటన్‌లో అత్యున్నత భద్రత కలిగిన జైలులో ఐదేళ్లకుపైగా శిక్ష అనుభవించారు. లండన్‌లోని ఈక్వెడార్ రాయబార కార్యాలయంలో ఏడేళ్ల పాటు ఆశ్రయం పొందారు. ఆ తరువాత ఆయనపై అత్యాచారం కేసు నమోదైంది. అదే కాకుండా, పద్దెనిమిది క్రిమినల్ కేసులను కూడా ఆయనపై మోపారు. ఆయన ఇలాగే కొనసాగినట్లయితే అమెరికా జైలులో జీవితాంతం ఉండవలసి వచ్చేది. అఫ్ఘానిస్థాన్, ఇరాక్‌లపై అమెరికా సైన్యం దాడులకు సంబంధించి సైనిక రహస్యపత్రాలను కూడా అసాంజె బైటపెట్టారు. ప్రపంచంలో బహుశ: ఇలాంటి సాహస చర్యలను ఏ జర్నలిస్టు నిర్వహించలేదు. తప్పులు చేసిన వారి తప్పులను బైట పెట్టినందుకే వికిలీక్స్ వ్యవస్థాపకుడు జులియన్ అసాంజెను ఎనలేని కష్టాలకు గురిచేశారు. చివరకు తన తప్పు లేకపోయినా తప్పు చేసినట్లు కోర్టులో అంగీకరించడంతో స్వేచ్ఛ కల్పించారు. ఆయన ఆస్ట్రేలియాకు చేరుకుని కుటుంబంతో కలిసి ఎంతో సంతోషాన్ని వెలిబుచ్చారు. కుటుంబసభ్యులు దీర్ఘకాలం తరువాత ఇంటికి వచ్చిన అసాంజెను హృదయపూర్వకంగా ఆహ్వానించారు.

వాల్‌స్ట్రీట్ జర్నల్ రిపోర్టర్ వివాన్ జర్షింకోవిచ్‌ని పదిహేను నెలలుగా మాస్కో జైలులో నిర్బంధించడంపై పశ్చిమదేశాలు తీవ్ర ఆందోళన చెందుతున్నాయి. అమెరికాకు 1500 కిలోమీటర్ల దూరంలో ఎక్టేరిన్‌బర్గ్‌లో విచారణ జరుపుతున్నారు. వాల్‌స్ట్రీట్ జర్నల్ కోసం వార్తలు అందించే వివాన్‌పైన కూడా నిఘా చట్టాన్ని ఉల్లంఘించారని పేర్కొంటూ జైలులో పెట్టారు. అలాగే వాల్‌స్ట్రీట్‌కు చెందిన పాకిస్తాన్‌లో పనిచేసిన విలేకరి డేనియల్ పెరల్‌ను పోలీసులు అపహరించి చంపివేశారు. వివాన్ పాకిస్తాన్‌లోని కరాచీలో ఉంటున్న ముబారక్ అలీ జిలానీని ఇంటర్వ్యూ చేసేందుకు వెళ్లారు. ఇదే విధంగా సౌదీ జర్నలిస్టు జమాల్ అహ్మద్ ఖషోగ్గి కూడా హింసకు గురయ్యారు. ఆయన అల్ అరబ్ న్యూస్ చానల్‌కు ప్రధాన ఎడిటర్‌గా చేశారు. 'మిడిల్ ఈస్ట్ ఐ'లో క్రమం తప్పకుండా ఒక కాలమ్ రాసేవారు. వాషింగ్టన్ పోస్టుకు ఆయన విలేకరిగా పనిచేశారు. అయనను ఇస్తాంబుల్‌లోని సౌదీ రాయబార కార్యాలయంలో సౌదీ ప్రభుత్వ

**(మిగతా 20వ పేజీలో)**


# విద్య వ్యాపారీకరణ విష ఫలితమే 'నీట్ ' కుంభకోణం!



- ఎస్.గోవిందరాజులు

**ఎన్నికల ఫలితాలు వెలువడిన జూన్ 4వ తేదీనే నీట్-యూజీ ఫలితాలు వెలువడ్డాయి. ఇలా జరగడం యాదృచ్ఛికం కావచ్చు. లేదా ఏదో మతలబు ఉందని సందేహించవచ్చు. ఎన్నికల ఫలితాల సంభ్రమంలో దీన్ని గురించి ఎవరూ ఆలోచించే అవకాశం ఉండదనే ఎత్తుగడేమో అన్న అనుమానం తలెత్తవచ్చు. ఏది ఏమైనా చివరకు అందరినీ దిగ్భ్రాంతికి గురిచేసే విధంగా వందల కోట్ల రూపాయలు చేతులు మారిన నీట్ కుంభకోణం బట్టబయలైంది.**

ఒకవైపు మూడోసారి మోదీ ప్రభుత్వ ప్రమాణ స్వీకారోత్సవం, మంత్రి పదవుల పంపకాలు జరుగుతుంటే, మరోవైపు నీట్ అవినీతి దుమారం మీడియాను ముంచెత్తింది. ఈ పరిణామం లక్షలాది విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఎంతో క్షోభకు గురిచేసింది. సుప్రీంకోర్టు సైతం 'నీట్ పవిత్రత దెబ్బ తింది' అని తీవ్రంగా వ్యాఖ్యానించింది. ఇంత జరిగినా, లక్షలాది విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారినా, దేశ వ్యాప్త నిరసనలు చెలరేగుతున్నా ప్రధానమంత్రి మాత్రం పెదవి విప్పలేదు. ఇది మోదీ మార్కు పాలనకు మరొక ఉదాహరణ. తమ ప్రభుత్వంపై పడిన అవినీతి మరకను కప్పి పుచ్చుకోవడానికి ఎన్టీఏ అధికారులను బలి పశువులను చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఎన్టీఏను సంస్కరించే పేరిట ఏవో చర్యలు, ప్రకటనలు వెలువడుతున్నాయి. అసలు కేంద్ర ప్రభుత్వం అకడమిక్ వ్యవహారాలతో ఏ మాత్రం సంబంధం లేని ఎన్టీఏ లాంటి ఒక బ్యూరోక్రటిక్ సంస్థను ఎందుకు ఏర్పాటు చేసింది ? ఆ సంస్థకు నీట్, జేఈఈ వంటి అత్యంత ప్రతిష్ఠాత్మక ప్రవేశ పరీక్షలతో సహా అన్ని రకాల పోటీ పరీక్షల నిర్వహణను ఎందుకు అప్పగించింది ? ఇలాంటి కీలక ప్రశ్నలు చర్చకు రావడం లేదు. నీట్ కుంభకోణం నేపథ్యంలో మన దేశ విద్యారంగంలో అమలవుతున్న విధానపరమైన మార్పులను నిశితంగా పరిశీలించాలి. ఎందుకంటే ప్రశ్నపత్రాల లీకేజీ, పరీక్షల లో అక్రమాలు, ఫలితాలలో అవకతవకలు తదితర సమస్యలన్నీ ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్య వ్యాపారీకరణ, ప్రైవేటీకరణ అనే ప్రధాన విధానంతో ముడిపడి ఉన్నాయి. ప్రస్తుతం అమలవుతున్న జాతీయ విద్యావిధానం-2020లో యావత్తు విద్యను, ప్రత్యేకించి ఉన్నత విద్యను గంపగుత్తగా కార్పొరేట్ సంస్థలకు




అప్పగించడానికి అవసరమైన సిఫార్సులు చాలా ఉన్నాయి. ఈ విధానం నిరాటంకంగా, వేగంగా అమలు కావడానికి విద్యా రంగంలోని అన్ని అధికారాలను కేంద్ర ప్రభుత్వ పరిధిలోకి బదలాయించే చర్యలు వరుసగా చేపడుతున్నారు. రాజ్యాంగంలో విద్యారంగం ఉమ్మడి జాబితాలో ఉన్నప్పటికీ, రాష్ట్రాల అభిప్రాయాలతో నిమిత్తం లేకుండా అన్ని వ్యవహారాలను కేంద్రమే నిర్దేశించడం ఫెడరల్ సూత్రాలకు పూర్తి విరుద్ధం. ఈ విధమైన అధికారాల కేంద్రీకరణలో భాగంగానే గతంలో రాష్ట్రాల పరిధిలో ఉన్న మెడికల్ ప్రవేశాలు, అడ్మిషన్ల మొత్తం ప్రక్రియను కేంద్రం నియమించే వ్యక్తులతో కూడిన ఎన్టీఏకు అప్పగించారు. దీనితో యూనివర్శిటీలు ఉత్సవ విగ్రహాలుగా మారిపోయాయి.

నీట్‌ను ప్రవేశపెట్టిన తరువాత మెడికల్ విద్యలో చోటు చేసుకున్న మార్పుల గురించి అమృత్‌సర్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎమిరిటస్ ప్రొఫెసర్‌గా పనిచేసిన డాక్టర్ శ్యామ్ సుందర్ దీప్తి వెలిబుచ్చిన అభిప్రాయాలు గమనార్హమైనవి. ఆల్ ఇండియా సేవ్ ఎడ్యుకేషన్ కమిటి 2021 అక్టోబర్ 31న జాతీయ విద్యావిధానం-2020పై నిర్వహించిన ఒక జాతీయ స్థాయి సెమినార్‌లో ఆయన మాట్లాడుతూ ఇలా చెప్పారు:

**"నీట్‌కు ముందు, ఆ తర్వాత విద్యార్థులకు కల్పించబడిన ప్రవేశాలలో చాలా వ్యత్యాసం ఉంది. అంతకు ముందు సంవత్సరాల్లో గ్రామీణ, పట్టణ ప్రాంతాల నుంచి, వివిధ రకాల ఆర్థిక-సాంస్కృతిక నేపథ్యాల నుంచి వచ్చిన విద్యార్థులందరూ ప్రవేశాలు పొందారు. అయితే నేడు కేవలం నగరాలు,**

**మహానగరాల నుండి వచ్చిన విద్యార్థులు మాత్రమే ప్రవేశాలు పొందారు. ఈ తేడా కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. మధ్య, దిగువ మధ్య తరగతి నుండి ప్రవేశాలు పొందిన విద్యార్థులను వేళ్లపై లెక్కించవచ్చు. దీనికి కారణం సుస్పష్టం. నీట్ ప్రవేశ పరీక్షకు సన్నద్ధమవడానికి కోచింగ్ సెంటర్లకు, అదేవిధంగా కోర్సులో చేరిన తరువాత మెడికల్ కళాశాలలకు చెల్లించవలసిన ఫీజులు అత్యధికంగా ఉండటమే. ఈ ఫీజులు కనీసం 25 లక్షల నుండి 30 లక్షల వరకు ఉంటున్నాయి. ఇంత పెద్ద మొత్తాన్ని మధ్య తరగతి కుటుంబాలు భరించడం చాలా కష్టం. ఈ భారీ ఫీజులకు కారణం మొత్తం మెడికల్ కళాశాలల్లో 50 శాతానికి పైగా ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోనూ, కార్పొరేట్ వ్యక్తుల చేతుల్లోనూ ఉండటమే. వారి చేతుల్లో కేవలం కళాశాలలను ఉంచడమేగాక, వారికి అనుకూలంగా విద్యా ప్రణాళిక రచించబడింది కూడా! కార్పొరేట్ వ్యవస్థను నడిపే పనిముట్లుగా శిక్షణ పొందిన సిబ్బందిని ఉత్పత్తి చేయడమే ఈ విద్యా ప్రణాళిక ముఖ్య ఉద్దేశ్యం."**

ఈ అభిప్రాయాలు ఎంత వాస్తవికంగా ఉన్నాయో మన కళ్ళ ముందు స్పష్టంగా కనిపిస్తోంది. ఈ పరిస్థితులు ఇలాగే కొనసాగితే ప్రస్తుతం జరిగిన నీట్ కుంభకోణం వంటివి భవిష్యత్తులో మరిన్ని పెద్దస్థాయిలో జరిగే అవకాశాలు లేకపోలేదు. కావున నీట్‌ను తిరిగి నిర్వహించాలనే డిమాండ్‌తో పాటుగా ఎన్టీఏను తక్షణం రద్దు చేయాలని, విద్యలో అన్ని చెడులకు మూలమైన విద్య కార్పొరేటీకరణ, అధికారాల కేంద్రీకరణ విధానాన్ని ఉపసంహరించాలని కోరుతూ ఒక సమరశీల ఉద్యమాన్ని నిర్మించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ❑

# బలహీనపడుతున్న మీడియా స్వేచ్ఛ

(18వ పేజీ తరువాయి)

ఏజంట్లు చంపివేశారని ఆరోపణలున్నాయి. సౌదీ రాచరిక కుటుంబానికి అత్యంత సన్నిహితుడు. ఖషోగ్గి వాషింగ్టన్ పోస్టుకు నెలవారీ రాసే వ్యాసంలో సౌదీ క్రౌన్ ప్రిన్స్ మహమ్మద్ బిన్ సల్మాన్ దేశ పాలకుడిగా వ్యవహరించారు. ఎక్కువ సంవత్సరాలు గడవకుండానే ఖతార్ నుంచి ఇంగ్లీషు ఛానల్ అల్ జజీరాకు ఖతార్‌లో ఉంటూ ముగ్గురు జర్నలిస్టులు పనిచేశారు. వారు ఆస్ట్రేలియన్ పీటర్ గ్రస్టి, కెనడియన్ మహమ్మద్ ఫామి, ఈజిప్టుకు చెందిన బహర్ మొహమ్మద్‌లను ఈజిప్టు భద్రతాదళాలు కస్టడీలోకి తీసుకుని దేశ భద్రతను దెబ్బ తీసారని కేసు నమోదు చేసి జైలులో పెట్టారు. వారిని నేరస్థులుగా పరిగణించి ఏడు నుంచి పదేళ్లపాటు జైలుశిక్ష విధించారు. అయితే అధ్యక్షుడు వారిని మన్నించి క్షమా బిక్ష పెట్టారు. జర్నలిస్టులను కాపాడేందుకు న్యూయార్క్‌లో ఒక కమిటీ ఏర్పడింది. అది లాభరహిత సంస్థ.

ప్రపంచవ్యాప్తంగా విలేకరుల స్వేచ్ఛను మరింత పెంపొందించేందుకు పనిచేస్తున్నది. గత సంవత్సరం వరకు 30 దేశాల్లో 363 మంది జర్నలిస్టులను నిర్బంధించింది. ఎక్కువ మంది జర్నలిస్టులను ఇరాన్, చైనా, మియన్మార్ దేశాలలో గత సంవత్సరం సీపీజే నివేదిక ప్రకారం, ఇండియాలో ఏడుగురు జర్నలిస్టులను నిర్బంధించారు. వీరిని మూడేళ్లపాటు జైలులో నిర్బంధంలో ఉంచారు. వీరిలో నలుగురిపై క్రూరమైన చట్టాన్ని మోపారు. జమ్ము కశ్మీర్ ప్రభుత్వ రక్షణా చట్టం క్రింద అరెస్టు చేశారు. నిర్బంధించిన వారిలో కశ్మీర్ నుంచి పనిచేసే ఆసిఫ్ సుల్తాన్, అలాగే కశ్మీర్‌కు చెందిన సజాద్ గుల్, ఇండిపెండెంట్ జర్నలిస్టులు రూపేష్ కుమార్ సింగ్, గౌతమ్ నవల్‌ఖా, మజీద్ హైదరీ, ఇర్ఫాన్ మెహరాజ్, ప్రబీర్ పురకాయస్థ (న్యూస్ క్లిక్) ఉన్నారు. ఇంఫాల్ నుండి ప్రచురితమవుతున్న హైయన్ లాన్‌పావ్ పత్రికకు పనిచేస్తున్న జర్నలిస్టును ఈ సంవత్సరం జనవరి 5వ తేదీన అరెస్టు చేశారు. మతాలు, జాతుల మధ్య వ్యతిరేకతను రెచ్చగొడుతున్నారంటూ జర్నలిస్టులను అరెస్టు చేశారు. అయితే ఈ అరెస్టుల గురించి ఎక్కువ ప్రాంతాలకు తెలియదు. అలాగే ప్రబీర్ పురకాయస్థ అరెస్టు కూడా ఎక్కడా అంతగా తెలియదు. ఉన్నతస్థాయి విద్యార్హత కలిగిన టెలికాం ఇంజినీరు, సామాజిక కార్యకర్తగా పనిచేస్తున్న నవల్‌ఖా ఢిల్లీ సైన్స్ ఫోరం వ్యవస్థాపక సభ్యుడు. అయనను అరెస్టు చేసి తిహార్ జైలులో 2023 నవంబరు 2న పెట్టారు. ఇటీవల సుప్రీంకోర్టు ప్రబీర్ పురకాయస్థ అరెస్టు చెల్లదని తీర్పునిచ్చింది. అంతక్రితం ఢిల్లీ లోయర్ కోర్టు బెయిల్ మంజూరుచేసింది. ఈ కోర్టు విధించిన శిక్ష మూలంగానే మొదట ఆయన జైలుకు వెళ్లారు. 74 ఏళ్ల జర్నలిస్టును అక్రమ కార్యాకలాపాల (నిరోధక) చట్టం క్రింద అరెస్టు చేశారు. చైనాకు అనుకూలంగా ప్రచారం చేసేందుకు గాను విదేశాల నుంచి ఆయనకు నిధులు లభిస్తున్నాయన్న ఆరోపణలపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. పైగా చార్జిషీటులో వార్తల సిండికేట్‌ల కుంభకోణం అని పేర్కొన్నారు. అంతేకాదు, సామాజిక కార్యకర్త తీస్తా సెతల్వాద్ ఇంకా ఇతర కాలమిస్టులకు పురకాయస్థ నిధులు అందచేస్తున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. అన్ని మీడియా వేదికలు–ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్, ప్రచార సాధనాలు ప్రజా ప్రయోజనం కోసం తమ ఆలోచనలను వెలుగులోకి తెచ్చేందుకు వారికి అన్ని హక్కులు ఉంటాయి. భారత ప్రభుత్వం అధికారిక రహస్యాల చట్టాన్ని అణచివేసే చట్టం, హక్కుగల సమాచార చట్టం(2005) మధ్య సమతుల్యత ఉండేలా చర్యలు తీసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. ❑

# ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టవలసిన విద్యా సంస్కరణలు

- హరివెంకటరమణ



విద్య అసలు లక్ష్యం సమాధానాలను అందించడం కాదు, ప్రశ్నలను సంధించడం అంటారు అమెరికన్ రచయిత, ఉపాధ్యాయురాలు హెలెన్ కెల్లర్. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో విద్యా విధానాలపై అనేక ప్రశ్నలు, కావలసిన సమాధానాలు వెతక వలసిన సమయం. ఇప్పటి అయిదేళ్ల సంస్కరణల్లో మంచి చెడూ చర్చించి ఇప్పుడు చేయవలసిన దిద్దుబాట్లు గురించి చర్చించడం ఈ వ్యాసం ఉద్దేశ్యం.



కొత్త ప్రభుత్వం కొలువు తీరాక రెండు ముఖ్య విషయాలు అందరూ చర్చించారు. ఇంకా తమ హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. అవి ఒకటి మెగా డీఎస్సీపై సంతకం. రెండు విద్యా దీవెన కింద పిల్లలకు ఇచ్చిన స్కూల్ బ్యాగులపై గత ముఖ్యమంత్రి బొమ్మ వున్నా వాటిని కొనసాగించమనడం. ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చడం అనేది ఢిల్లీ కేజ్రీవాల్ ప్రభుత్వం మొదటగా 2015 లో ప్రారంభించింది. దీనిని "ఢిల్లీ విద్యా విప్లవం"గా అభివర్ణించారు. ఇది గణనీయంగా అందరి దృష్టిని ఆకర్షించింది. స్కూళ్లకు మంచి రంగులు, పిల్లలకు సరిపడా ఫర్నీచర్, మార్గదర్శకులైన గురువులు, గణనీయమైన మార్కులు ప్రధానంగా ఈ విద్యా సంస్కరణల ఉద్దేశ్యంగా చెబుతారు.

2019లో అధికారంలోకి వొచ్చిన వైసీపీ ప్రభుత్వం కొన్ని ముఖ్యమైన విద్యా సంస్కరణలు చేపట్టింది. 2022లో నాడు నేడు పేరుతో వేలాది స్కూళ్ల రూపురేఖలు మార్చింది. రెండో విడత పనులు కొనసాగుతూ.. వున్నాయి. అయితే ఈ లోగా ప్రభుత్వాన్ని ప్రజలు వద్దనుకున్నారు. ఈ మౌలిక వసతుల మార్పు సహజంగా విద్యా రంగంలో పనిచేస్తున్న వారిని ఆకర్షించింది. దీంతో చాలామంది మేధావులు ఈ సంస్కరణలకు స్వాగతం పలికారు. మరికొంత మంది మరింత ముందుకు వెళ్లి జేజేలు పలికారు. ఇవి వరుసగా ఒక దాని తరువాత ఒకటి చాలా వేగంగా పిల్లల ముందు చేరాయి. 2020లో కోవిడ్ వచ్చింది. పిల్లలు పాఠశాలకు దూరమయ్యారు. కోవిడ్ విపత్కర పరిస్థితిలో వారికి ఆన్‌లైన్ తరగతులు ప్రారంభించారు. మొబైల్ పట్టుకున్న పిల్లవాడు మెల్లగా ఆన్‌లైన్ గేమ్స్‌కు, ఇతరత్రా సైబర్ అభద్రతలకు గురయ్యాడు. ఆ ఊబిలోంచి ఇప్పటికీ పిల్లలు బయటకు రాని పరిస్థితి. ఇక మీడియం గురించి వస్తే విద్యా హక్కు చట్టం, 2009 కింద అధ్యాయం Vలోని సెక్షన్ 29(ఎఫ్) స్పష్టంగా, "సూచనల మాధ్యమం, ఆచరణ సాధ్యమైనంత వరకు, పిల్లల మాతృభాషలో ఉండాలి" అని పేర్కొంది. ఇంగ్లీష్ మీడియం అనేది ప్రభుత్వ బడులలో 2017 (విశాఖలో అయితే జీవీఎంసీ పాఠశాలల్లో) నుంచే మెల్లగా ప్రవేశ పెట్టారని, ఇది మంచి సంస్కరణ అని అప్పటి నుంచే ఉందని మనం గుర్తుంచుకోవాలి. పిల్లలకు ప్రాథమిక స్థాయి నుంచి ఇంగ్లీష్ మీడియంలో బోధనతో కూలీ నాలీ చేసుకొని ప్రైవేటు బడుల్లో చేర్చే తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చడం మొదలు పెట్టారు. విద్యార్థులకు వారి మాతృభాషలో బోధించినప్పుడు, పిల్లలు సులభంగా అర్థం చేసుకొంటారు అది నిర్వివాదాంశం. కానీ తల్లిదండ్రుల ఇంగ్లీష్ బోధనా ఆసక్తులు, కోరికలు కూడా పరిగణనలోకి తీసుకొని ప్రాథమిక స్థాయి నుంచి తెలుగు ఇంగ్లీష్ రెండు మాధ్యమాలు తప్పనిసరిగా ఉంచాలి. ఇందువల్ల వారిలో చిన్నతనం నుంచే కాగ్నిటివ్ ఎబిలిటీ అంటే నేర్చుకునే సామర్థ్యాలు పెంపొందుతాయి.

విద్య ఉమ్మడి అంశం కనుక కేంద్ర ప్రభుత్వ జాతీయ విద్యా విధానాన్ని శరవేగంగా అమలు చేయవలసిన అవసరం లేదు. జాతీయ విద్యా విధానం, 2020 ప్రకారం, "ప్రస్తుత నేర్చుకునే ఫలితాలు, కావాల్సిన వాటి మధ్య అంతరాన్ని చిన్ననాటి విద్య నుండి ఉన్నత విద్య ద్వారా వ్యవస్థలోకి అత్యధిక నాణ్యత సమగ్రతను తీసుకురావడానికి స్థూల స్థాయి సంస్కరణలను చేపట్టాలి. జాతీయ విద్యా విధానం (NEP) ఎర్లీ చైల్డ్ కేర్ ఎడ్యుకేషన్ (ECCE), ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ (FLN)పై నేర్చుకునేందుకు, విద్యా వ్యవస్థలో సమర్థవంతమైన వనరులు, పాలన ఆవశ్యకతపై పూర్తి దృష్టి సారించింది. అంగన్వాడీలను వాటిలాగే, కిలో మీటర్ పరిధిలోని ప్రాథమిక

పాఠశాలలను అలాగే ఉంచాలి. నాలుగు, అయిదు తరగతులను హైస్కూల్‌లో విలీనం చేయకూడదు. ప్రాథమిక పాఠశాలల నుండి అదనంగా ఉన్న ఉపాధ్యాయులను ఉన్నత పాఠశాలకు బదిలీ చేసినప్పటికీ ప్రాథమిక స్థాయి విద్యార్థులకు కావలసిన ఫౌండేషన్ స్థాయి బోధన సంక్షోభంలో పడింది. ఇందువల్ల చిన్న పిల్లలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. హైస్కూల్ ప్లస్ టులో గత విద్యా సంవత్సరంలో చాలా నాసిరకం ఫలితాలు వచ్చాయి. వీటికంటే ఇంటర్మీడియేట్ కళాశాలలను మరిన్ని అందుబాటులో ఉంచడం, లేదా వీటిలో నైపుణ్యం గల లెక్చరర్స్‌ను నియమించడం మంచిది.

ప్రాథమిక పాఠశాలలను కిలోమీటర్ పరిధిలోని పాఠశాలలను అలాగే ఉంచాలి. నాలుగు, అయిదు తరగతులను హైస్కూల్‌లో విలీనం చేయకూడదు. చేయడం వల్ల చిన్న పిల్లలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే హైస్కూల్ ప్లస్ టులో గత విద్యా సంవత్సరంలో చాలా నాసిరకం ఫలితాలు వచ్చాయి. వీటికంటే ఇంటర్మీడియేట్ కళాశాలలను మరిన్ని అందుబాటులో ఉంచడం, లేదా వీటిలో నైపుణ్యం గల లెక్చరర్స్‌ను నియమించడం మంచిది. ఇక సీబీఎస్‌సీ విషయానికొస్తే దేశంలో బహుశా ఆంధ్రప్రదేశ్ మొదటి ఏకైక రాష్ట్రం. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వెయ్యి పాఠశాలల్లో ఎనిమిదో తరగతితో ప్రారంభమయ్యే గత విద్యా సంవత్సరం నుంచి సీబీఎస్ఈ సిలబస్‌ను రూపొందించారు. ఈ వ్యవస్థ 2024–25లో పదో తరగతికి విస్తరణ అవుతుంది. ఈ ప్రయత్నం మంచిదే కానీ ప్రస్తుత ప్రభుత్వం ఈ విధాన అమలుకు మరిన్ని మెరుగైన మార్గాలను అన్వేషించాలి, అమలుకు కొత్త ప్రణాళికలు రూపొందించాలి. సీబీఎస్సీ సిలబస్ బోధించడానికి నైపుణ్యాలు గల ఉపాధ్యాయులను ఎంపిక చేయాలి. ఇప్పటికే కొనసాగుతున్న ఉపాధ్యాయులకు మరిన్ని నైపుణ్యాలను సమకూర్చాలి.

ఇక వివాదాస్పదమైన బైజూస్ కంటెంట్ బైజూ కంటెంట్‌తో కూడిన 5,18,740 ట్యాబ్‌లను ఉపాధ్యాయులతోపాటు 4.59 లక్షల మంది 8వ తరగతి విద్యార్థులకు పంపిణీ చేయడానికి దాదాపు రూ.686 కోట్లు ఖర్చు చేశారు. అయితే ఇందుకు బదులుగా రాష్ట్ర విద్యా పరిశోధనా శిక్షణా సంస్థ (ఎస్‌సీఈఆర్టీ) కరికులం ఆధారిత డిజిటల్ సామగ్రిని రూపొందిస్తే మంచిది. దీనికి స్థానిక రచయితలను, చిత్రకారులను, యానిమేటర్లను వినియోగిస్తే కంటెంట్‌లో స్థానికత కనిపిస్తుంది. విద్యార్థులు నేర్చుకోవడానికి ఆసక్తి కనబరుస్తారు.

అలాగే ఉపాధ్యాయులకు యాప్‌ల పనిభారం తగ్గించి పూర్తి సమయం బోధనకు, పాఠ్యాంశాల ప్రణాళికకు, కృత్యాల ఆధారంగా బోధించడానికి సమయం ఇవ్వాలి. సమగ్ర శిక్ష కనెక్ట్ టు ఆంధ్ర, సేవ్ ద చిల్డ్రన్ సాంకేతిక సహకారంతో ఏర్పాటవుతున్న స్టెమ్ (సైన్స్ టెక్నాలజీ ఇంగ్లీష్ మేథమెటిక్స్) లేబొరేటరీల సద్వినియోగం ద్వారా విద్యార్థులకు క్లిష్టమైన పాఠ్యాంశాలను అనుభవాత్మక విద్య ద్వారా బోధనను అత్యంత సులభతరం చేయవచ్చు. పిల్లల కోసం పనిచేసే సంస్థలు సదుద్దేశంతో ప్రారంభించిన లెర్నింగ్ ఇంప్లిమెంటేషన్ ప్రోగ్రాం (లిప్) ఇస్తున్న మంచి ఫలితాలు మదింపు చేసి, ఇది మరింత మెరుగ్గా ఎలా చేయగలమో ఆలోచన చేయాలి.


ఆసెర్ (అన్యువల్ స్టేట్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్) 2023 లో ఇచ్చిన బియాండ్ బేసిక్స్ అనే నివేదిక చూస్తే దాదాపు 25% మంది ఇప్పటికీ తమ ప్రాంతీయ భాషలో రెండో తరగతి స్థాయి వచనాన్ని సరళంగా చదవలేరు. అంక గణితం, ఆంగ్ల పఠనంలో ఇస్తున్న నివేదిక చూస్తే మన పిల్లల విద్యా నైపుణ్యాలు చాలా తక్కువ స్థాయిలో వున్నాయి. అలాగే ప్రపంచ బ్యాంకు లెర్నింగ్ పావర్టీ ఇండెక్స్ ప్రకారం, భారతదేశంలోని 55 శాతం మంది పిల్లలు ఈ రోజు ప్రాథమిక వయస్సు చివరిలో చదవడం లో నైపుణ్యం కలిగి లేరు. ఈ ఫలితాలలో మన పిల్లలూ వున్నారు. ఇక భాషా నైపుణ్యాలు మా క్షేత్రస్థాయి పరిశీలనలో చాలా మంది ప్రభుత్వ పాఠశాలల పిల్లలకు పదో తరగతిలోకి చేరుకున్నా తెలుగు, ఇంగ్లీష్ తప్పులు లేకుండా రాయడం రావటం లేదని తేలింది. భాష పునాది మీదనే మిగతా విద్య అంతా ఉంటుంది. ఇంత బడ్జెట్ కేటాయించి, టీచర్లను ఏడిపించి, పాఠశాలలను మూసివేసి, పిల్లల విద్యపై సాధించినది ఏమిటి ? మొదటి తరగతిలో వుత్తీర్ణత, ర్యాంకులు సంగతి సరే. నిజమైన విలువలతో కూడిన విద్య అందుతుందా ? లేదా ఇంత శ్రమా బూడిదలో పోసిన పన్నీరేనా ? ఆలోచించి ప్రాథమిక స్థాయి నుంచి వీటిని సరిదిద్దాలి. లేదా ఈ పిల్లలు ఇలాగే ఇంటర్లు డిగ్రీలు పూర్తి చేసి అక్షర దోషాలతో అన్నీ రాస్తుంటారు. గత ప్రభుత్వం కేవలం కొంత మంది అధికారుల మాటలతోనే విద్యా సంస్కరణలు చేపట్టింది, పిల్లల వాస్తవ అవసరాలు ఏమిటి ? వారి ఆసక్తులు ఏమిటి ? ఈ రంగంలో దశాబ్దాలు పనిచేస్తున్న క్షేత్రస్థాయి కార్యకర్తలు ఏం చెపుతున్నారు ? అని అడిగిన వారు విన్న వారు వున్నారా ? కానీ మన సమాజంలో అన్ని రకాల పిల్లలూ వుంటారు, అందరినీ పాఠశాల గొడుగులోకి తేవడం అందరి బాధ్యత.

ఈ రంగంలో పనిచేసే బాలల సామాజిక కార్యకర్తలు, విద్యావేత్తలతో సమావేశం ఏర్పాటు చేయాలి. బడి అందరిదీ అనే భావన అందరిలో కలిగించాలి, పాఠశాలలు ఎంత అందంగా కట్టినా శుభ్రత, బాధ్యత లేక పోతే అవి త్వరగా వాటి వైభవాన్ని కోల్పోతాయి. విద్యని గౌరవించే, ఉపాధ్యాయుడిని గౌరవించే, సమాజం పట్ల బాధ్యత వుండే విద్యార్థి రూపొందాలి. లేదంటే ఎన్ని సంస్కరణలు తీసుకొచ్చిన వృధా. మరోసారి విద్యా సంస్కరణల ఫలితాలు మదింపు చేయాలి, ఇది సరైన సమయం. ❑

# రాజ్యాంగ పీఠికపై ప్రచారానికి విశాల వేదిక

**తణుకు సదస్సు విజ్ఞప్తి**

రాజ్యాంగ పీఠిక చిన్నదిగా కనిపించినా రాజ్యాంగంలోని అంతస్సారాన్ని వ్యక్తీకరిస్తోందని, దేశంలో అందరికి సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని, భావ ప్రకటనా స్వేచ్ఛను, మత విశ్వాస స్వేచ్ఛను, అందరికీ అవకాశాల సమానత్వాన్ని ప్రకటిస్తూ జాతీయ ఐక్యతను, సమగ్రతను ప్రజల మధ్య సౌభ్రాతృత్వాన్ని పెంపొందించడమే లక్ష్యంగా పీఠిక దేశ ప్రజలకు వాగ్దానం చేసిందని, నిజమైన ప్రజా పాలన అంటే రాజ్యాంగ పీఠికను అమలు చేయడమేనని దారిదీపం సంపాదకులు డీవీవీఎస్ వర్మ ఆదివారం పశ్చిమ గోదావరి జిల్లా తణుకు సురాజ్య భవనంలో తణుకు స్టడీ సర్కిల్ - సామాజిక న్యాయ పోరాట సమితి సంయుక్తంగా నిర్వహించిన సమాలోచన సభ'లో స్పష్టం చేశారు. రాజ్యాంగ పీఠిక ఆధారంగా సాగే ప్రజా పాలన కోసం పౌర సమాజాన్ని, శ్రామిక ప్రజలను జాగృతం చేయడం కోసం 'రాజ్యాంగ పీఠిక ప్రచార ఉద్యమం' సాగించాలని ఆయన పిలుపునిచ్చారు. నవంబరు 26 రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు "రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞ" కార్యక్రమాలను విద్యా సంస్థల సహకారంతో, విద్యార్థుల భాగస్వామ్యంతో పెద్ద ఎత్తున నిర్వహించడానికి సన్నాహాలు


భారత రాజ్యాంగము

భారత ప్రజలమైన మనము మన భారతదేశాన్ని
సార్వభౌమ సామ్యవాద లౌకిక ప్రజాస్వామ్య గణతంత్ర
రాజ్య వ్యవస్థగా నిర్మించేందుకు పవిత్రదీక్షతో తీర్మానించి
మన దేశ పౌరులందరికీ సామాజిక ఆర్థిక రాజకీయ
న్యాయాల్ని
ఆలోచనా భావప్రకటనా మతవిశ్వాస ఆరాధనా
స్వేచ్ఛను
హోదాల్లోనూ అవకాశాలలోను
సమానత్వాన్ని
సాధించేందుకు వ్యక్తి గౌరవాన్ని జాతి ఐక్యత సమగ్రతను కల్పించే
సౌభ్రాతృత్వాన్ని
పెంపొందించాలని మన రాజ్యాంగ నిర్ణాయక సభ లో
1949 నవంబర్ 26వ తేదీన ఈ రాజ్యాంగాన్ని
స్వీకరించి శాసనీకరించి ఆమోదించి
మనకు మనము సమర్పించుకుంటున్నాము

## నవంబరు 26 - రాజ్యాంగ దినోత్సవం

### రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞ దినం

ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో నవంబరు 26వ తేదీకి ముందుగా రాజ్యాంగ వ్యాస రచన, ప్రసంగ పోటీలు నిర్వహించాలి. విద్యా సంస్థలలో సామూహికంగా లేదా తరగతి గదులలో రాజ్యాంగ పీఠికను చదివించాలి. రాజ్యాంగాన్ని గౌరవిస్తానని, పరిపాలన రాజ్యాంగబద్ధంగా వుండాలని, రాజ్యాంగ పీఠిక వాగ్దానం చేసిన సామాజిక, ఆర్థిక రాజకీయ న్యాయం కోసం అందరికీ సమాన అవకాశాలు, సాధన కోసం కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించాలి. ఉద్యోగ సంఘాలు, కార్మిక సంఘాలు తమ పని ప్రదేశాలలో రాజ్యాంగ పీఠికను చదివి, ప్రతిజ్ఞ చేయాలి. ప్రజా సంఘాలు తమ సమావేశాలలో లేదా ఆఫీసులలో ఈ కార్యక్రమం నిర్వహించాలి.

## జనవరి 26 - రిపబ్లిక్ డే

### రాజ్యాంగ పీఠిక దీక్షా దినం

రాజ్యాంగం అమలులోకి వచ్చిన జనవరి 26 రిపబ్లిక్ డేను రాజ్యాంగ పీఠిక దీక్షా దినంగా నిర్వహించాలి. ప్రతి పట్టణంలో కార్మిక సంఘాలు, అన్ని ప్రజా సంఘాలు, వృత్తి సంఘాలు రాజ్యాంగ పరిరక్షణ మీద ఆసక్తిగల సంస్థలు, సంఘాలు ఉమ్మడిగా "పీఠిక దీక్షా దినం" జరపాలి. జాతీయ జెండాతో వివిధ సంఘాల బ్యానర్లు, బాడ్జీలతో అన్ని సంఘాల సభ్యులు పాల్గొనేలా ప్రదర్శనలు, సభలు, సమావేశాలు నిర్వహించాలి. సామాజిక ఆర్థిక రాజకీయ న్యాయం కోసం అందరికీ సమాన అవకాశాల సాధన కోసం సాగే ఉద్యమంగా దీనిని నిర్వహించాలి.



మాడభూషి శ్రీధర్ రాసిన రాజ్యాంగ పీఠిక పుస్తకావిష్కరణ

ప్రారంభించాలని కోరారు. రాజ్యాంగం అమలులోకి వచ్చిన జనవరి 26 రిపబ్లిక్ దినోత్సవాన్ని కార్మిక సంఘాలు, కుల వృత్తి సంఘాలు, వివక్షకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న దళిత, బహు జన, మహిళా సంఘాలు, వివిధ తరగతుల ప్రజా సంఘాలు సంయుక్తంగా సామాజిక ఆర్థిక రాజకీయ న్యాయాన్ని సమాన త్వాన్ని సాధించే "పీఠిక దీక్షా దినం"గా పాటించాలని వర్మ పిలుపునిచ్చారు. ఈ సభకు వివిధ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రముఖులు, వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు వాపక్ష పార్టీల మిత్రులు హాజర య్యారు. ఈ కార్యక్రమాలు నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది. రాజ్యాంగ పరిరక్షణ వేదిక నాయ కులు విశ్రాంత ఐఏఎస్ బండ్ల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన మొదటి రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ పీఠిక పాలకుల ఆచరణకు, ప్రచారాలకు గీటురాయి కావాలని దానికోసం పౌరసమాజం గళం విప్పాలన్నారు.

### రాజ్యాంగ పీఠిక పుస్తకావిష్కరణ

ప్రముఖ న్యాయ నిపుణులు మాడభూషి శ్రీధర్ రాసిన 'భారత రాజ్యాంగ పీఠిక' పుస్తకాన్ని రాజ్యాంగ పరిరక్షణ వేదిక సభ్యు రాలు సంకు మనోరమ ఆవిష్కరించి తొలి ప్రతిని రాష్ట్ర సామా జిక పోరాట సమితి నాయకులు పేరూరి మురళీకుమార్‌కు ఇచ్చారు. అనంతరం **"బహుళ సంస్కృతిపై హిందూత్వ దాడి : ప్రత్యామ్నాయాలు"** అనే అంశంపై జరిగిన రెండవ సదస్సుకు ప్రముఖ జర్నలిస్టు మందలపర్తి కిషోర్ అధ్యక్షత వహించగా ప్రత్యామ్నాయ సాంస్కృతిక ఉద్యమ నేత కె.శాంతారావు, ప్రజా నాట్యమండలి నాయకులు డా సి.స్టాలిన్, డి.సోమసుందర్, విశ్రాంత జిల్లా జడ్జి అదబాల లక్ష్మి, సామాజిక ఉద్యమకారులు హైమావతి, వావిలాల సరళాదేవి, అమీనా బేగం, చర్చలో పాల్గొన్నారు. సభకు డా హుస్సేన్, డా కృష్ణమోహనరావు, డా సత్యనారాయణ, డా కృష్ణారెడ్డి, శాంతిరెడ్డి, విశ్రాంత ప్రిన్సిపాల్స్ శ్రీనివాసప్రసాద్, అడ్డాల సత్యనారాయణ, సీనియర్ జర్నలిస్టులు రత్నరాజు, డి.రామకృష్ణ, న్యాయవాదులు పిపి శాస్త్రి, అంబేద్కర్, పొట్ల సురేష్, సిపిఐ నాయకులు బొద్దాని నాగరాజు, నామన వెంకటేశ్వరరావు, గార ప్రసాద్, సిపియం నాయకులు పివి ప్రతాప్, పి.దక్షిణామూర్తి, రైతు కూలీ సంఘం నుండి కోటిరెడ్డి, బాషా, బియస్‌పి నాయకులు మధు, కాంగ్రెస్ నాయ కులు రామారావు వివిధ ప్రాంతాల నుండి "మానవత" జానకి రామ రాజు, మందలపర్తి హరీష్, మొగళ్ళపు వెంకటేశ్వరరావు, జాన పద కళాకారుడు ఎల్ఆర్ కృష్ణబాబు వంటి ఆరు జిల్లాలకు చెందిన ప్రముఖులు చాలా మంది పాల్గొన్నారు. ❑



# శ్రమజీవుల ఉద్యమాలకు కొత్తచూపు

**ఎ.ఐ.టి.యు.సి. నూజివీడు వర్క్‌షాప్**



**- డి.సోమసుందర్**

సుమారు యాభై ఐదు లక్షల మంది సభ్యులతో భారతీయ కార్మికోద్యమ అగ్రగామి పోరాటసంస్థగా ఎ.ఐ.టి.యు.సి. కొనసాగుతున్నది. నూరేళ్లుగా భారతీయ కార్మికోద్యమానికి ఒక దిశ, దశ చూపడం కోసం ఎ.ఐ.టి.యు.సి కాలానుగుణ వ్యూహంతో ఎత్తుగడలతో విశాల ఐక్య కార్మికోద్యమ నిర్మాణానికి ప్రయత్నిస్తూ వచ్చింది. ప్రస్తుతం దేశాన్ని పాలిస్తున్న మతతత్వ, కార్పొరేట్ పెట్టుబడిదారీ పాలకవర్గంపై పోరాటానికి ఐక్య కార్మికోద్యమం ఒకే వేదికపైకి వచ్చిన సంగతి తెలిసిందే. గత పదేళ్ళలో జరిగిన రెండు డజన్ల దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలు కోట్లాది మంది శ్రమ జీవులను పోరాటాల్లోకి సమీకరించాయి. తీవ్ర ప్రతికూల పరిస్థితుల్లో ప్రస్తుత పోరాటాలన్నీ అమల్లో ఉన్న హక్కులను కాపాడుకునే ఆత్మరక్షణ పోరాటాలుగా పరిమితం అయ్యాయి. పెట్టుబడిదారీ వర్గంపై ఎదురుదాడి చేసి, హక్కులను విస్తరించుకునే పోరాటాలకు కార్మికవర్గ శ్రేణులను సంసిద్ధం చేసుకోవాలి. ఈ నేపథ్యంలో ఎ.ఐ.టి.యూ.సి. ఆంధ్రప్రదేశ్ సమితి రాష్ట్ర స్థాయి నాయకత్వ బృందానికి “మేధో మథన సమాలోచన వర్క్ షాప్” జూలై 6, 7, తేదీల్లో నూజివీడులో నిర్వహించింది. “దారి దీపం” మాస పత్రిక సంపాదకులు, మార్క్సిస్టు మేధావి, సీనియర్ కార్మికనేత డి.వి.వి.ఎస్.వర్మ **“కొత్తచూపు-కొత్తదారి”** పేరుతో వర్క్ షాప్ కోసం ఒక థీమ్ పేపర్ తయారుచేశారు. ఆయన రెండు రోజులపాటు వర్క్ షాప్‌లో పాల్గొని థీమ్ పేపర్‌పై చర్చలకు సారథ్యం వహించారు. ఎఐటియుసి రాష్ట్ర అగ్ర నాయకత్వం వర్క్ షాప్‌లో పాల్గొని చర్చలలో క్రియాశీల పాత్ర పోషించారు. ఇందులో ఉపన్యాస పద్ధతికి భిన్నంగా ప్రతినిధులు అందరూ మేధో మథనంలో పాలు పంచుకునే రీతిలో జరిగింది. కొన్ని ప్రశ్నలు లేవనెత్తి, వాటికి సభ్యులే జవాబులు కనుగొనే పద్ధతిలో సెషన్స్ జరిగాయి. మొత్తం సభ్యులు బృందాలుగా విడివడి తమలో తాము చర్చించుకుని సారాంశాన్ని ఒక్కొక్క గ్రూపు నాయకుడు మెయిన్ సెషన్‌లో ప్రజంట్ చేసే పద్ధతి అనుసరించారు. 2 రోజులపాటు జరిగిన వర్క్‌షాప్‌లో రాష్ట్రంలోని 24 జిల్లాల నుండి ఎంపిక చేసిన నాయకులు 70 మంది హాజరయ్యారు.




మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

6వ తేదీ వర్క్ షాప్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా వచ్చిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ కార్మికవర్గం తమ సమస్యల కోసం పోరాటానికి మరింత బలపడాలని, రాజకీయాలను ప్రభావితం చేసే శక్తిగా తన పాత్రను నిర్వహించాలని అందుకు ఈ వర్క్ షాప్ తగిన నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. వర్కు షాపును రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు ప్రారంభించారు. కార్మికోద్యమాన్ని విస్తృతం చేయడం, పటిష్టం చేయడం లక్ష్యంగా వర్క్ షాప్ నిర్వహిస్తున్నామని ఓబులేసు స్పష్టం చేశారు. **తొలి సెషన్‌లో** వర్మ గారు వర్క్ షాప్ కాన్సెప్ట్‌ను పరిచయం చేశారు.

### మొదటి రోజు : సంఘాలు.. పనితీరు

**“మనం ట్రేడ్ యూనియన్‌లలో ఎందుకు పని చేస్తున్నాం”** అనే ప్రశ్నను సంధించారు. దానికి సుమారు ఇరవై మంది ప్రతినిధులు స్పందించి మాట్లాడారు. దేశంలో విప్లవాన్ని తీసుకురావడం, పెట్టుబడిదారీ వ్యవస్థను కూల్చటం, కార్మికవర్గ రాజ్యాధికారాన్ని స్థాపించడం, కార్మికుల జీవనస్థితి గతులను సమూలంగా మార్చడం, వేతనాలను పెంచడం, పని పరిస్థితులను మెరుగుపరచడం, కార్మికులను సంఘటితం చేయడం వంటి సమాధానాలు వచ్చాయి.

**“ప్రతినిధులు వ్యక్తం చేసిన లక్ష్యాల కోసం తాము పనిచేస్తున్న సంఘాలలో ఎలాంటి ప్రయత్నం చేస్తున్నారు”** అని వర్మగారు రెండో ప్రశ్న సంధించారు. అందుకు ప్రతినిధులు సమాధానాలు ఇచ్చారు. కార్మికుల వేతనాలు పెంపుదల, పని పరిస్థితుల మెరుగుదల, కార్మికులను సంఘటితం చేసే పని మాత్రమే సాగుతున్నదని, కార్మికులకు ఉపశమనం కలిగించే కొన్ని పోరాటాలు చేస్తున్నామని అన్నారు.

**“పెట్టుబడిదారీ వర్గ పాలనను కూల్చి కార్మిక వర్గ రాజ్యస్థాపన చేయాల్సిన ప్రధాన రాజకీయ లక్ష్యం కోసం జరుగుతున్న**

**పోరాటాలు ఏమైనా ఉన్నాయా"** అని వర్మగారు వేసిన ప్రశ్నకు ఉపన్యాసాలలో, శిక్షణా తరగతులలో వాటి గురించి చెప్పడమే తప్ప రోజువారీ కార్యకలాపాలలో రాజకీయ లక్ష్యాన్ని జోడించే కృషి జరగడం లేదని ప్రతినిధులు అభిప్రాయపడ్డారు.


వర్క్‌షాపులో బృంద చర్చలు

**"ఒకప్పుడు కార్మిక కేంద్రాల నుండి కార్మికవర్గ ప్రతినిధులు చట్టసభలకు ఎన్నికయ్యే వారని, ప్రస్తుతం అలా ఎందుకు ఎన్నిక కాలేకపోతున్నారని"** వర్మ గారు మరో ప్రశ్న వేశారు. దానికి ఎక్కువ మంది ప్రతినిధులు స్పందించారు. ఎన్నికల్లో డబ్బు, కులం, మతం ప్రభావం పెరిగిపోయాయని, కార్మికులు కూడా స్వార్థపరులైపోయారని, వారు డబ్బుకు అమ్ముడుపోతున్నారని, కులం, మతం, ప్రాతిపదికనే ఓటు వేస్తున్నారని కార్మికులు వర్గ రాజకీయాలకు దూరంగా ఉంటున్నారని వారు చెప్పారు.

**"మార్క్స్, లెనిన్, కాలం నాటి కార్మికవర్గం , ప్రస్తుతం మనం చూస్తున్న కార్మికవర్గం ఒకటేనా"** అనే ప్రశ్నపై సవివరమైన చర్చ జరిగింది. కార్మికవర్గ స్వరూప స్వభావాలలో తీవ్ర మార్పులు వచ్చాయని అందరూ చెప్పారు. అందుకు ఉత్పత్తి సాధనాలలో, ఉత్పత్తిలో వచ్చిన మార్పులు, దోపిడీ పద్ధతుల్లో వచ్చిన మార్పులు, చట్టాలలో వచ్చిన సానుకూల మార్పులు, ప్రభుత్వాలు తెస్తున్న సంక్షేమ చర్యలు కారణమని పలువురు అభిప్రాయపడ్డారు. ఉత్పత్తి ప్రక్రియలో వచ్చిన వైవిధ్యం కారణంగా కార్మికులు చీలిపోయి ఉన్నారని, కార్మిక సంఘాలలో చీలికలు ఎక్కువగా ఉన్నాయని, ప్రతినిధులు వివరించారు.

**"పెట్టుబడిదారీ వ్యవస్థను కూల్చే శక్తి ప్రస్తుత మన కార్మిక వర్గానికి ఉందా"** అనే ప్రశ్నకు లేదన్న సమాధానమే ఎక్కువగా వినవచ్చింది. ప్రతికూల పరిస్థితుల్లో సైతం కొన్ని పోరాటాలు సాగుతున్న అంశాన్ని ప్రతినిధులు గుర్తుచేశారు. వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా సాగిన రైతాంగ ఉద్యమం, సీఏఏకు వ్యతిరేకంగా వెల్లువెత్తిన ఉద్యమం, యూనివర్సిటీల్లో రోహిత్ వేముల సమస్యపై సాగిన విద్యార్థి ఉద్యమం, కార్మికుల సార్వత్రిక సమ్మెలు వంటి పోరాటాలు ఇటీవల కనిపించిన సానుకూల అంశాలని ప్రతినిధులు అభిప్రాయపడ్డారు.

## మనవాళ్లు ఎవరు ? చర్చ

**రెండో సెషన్‌లో.. "మనవాళ్లు ఎవరు?"** అనే అంశంపై వర్మ గారు కొన్ని వివరణలు ఇచ్చారు. శ్రమజీవులు అంటే శ్రమ మీద ఆధారపడి జీవించేవారంతా మన వాళ్ళేనని నిర్వచించుకుంటే మనకు అలాంటి అనేక సమూహాలు కనిపిస్తాయని, సంఖ్యా పరంగా శ్రామికవర్గ విస్తృత బలగం మనకు కనిపిస్తుందని అన్నారు. ఒక్కొక్క నియోజకవర్గంలో జనాభా లెక్కలలో మెయిన్ వర్కర్స్, మార్జినల్ వర్కర్స్ కేటగిరీల్లో సుమారు 50 నుండి 60 శాతం జనాభా ఉన్నట్లు చెబుతున్నాయని ఆయన తెలిపారు. **"ఎన్ని రకాల శ్రమజీవుల సమూహాలు మీ మీ పట్టణాలలో వున్నాయో గుర్తించాలి"** అని వర్మగారు కోరారు. మొత్తం ప్రతినిధులు ఐదు బృందాలుగా విడివడి చర్చించారు. తమ ప్రాంతాలలో వున్న శ్రమజీవుల సమూహాలను గుర్తించే పనిని ప్రతినిధులు సుమారు గంటసేపు చర్చించారు. పబ్లిక్ సెక్టార్, ప్రైవేట్ సెక్టార్, ట్రేడ్ యూనియన్‌లలో ఇప్పటికే సంఘటితం అయిన వారు, సంఘటితం కాని వారు, పనిచేస్తున్నప్పటికీ చెల్లా చెదురుగా ఉన్న పనివారు, చేతి వృత్తులవారు, సేవా రంగంలో ఉన్నవారు, స్వయం ఉపాధి పొందుతున్న వారు సహా మొత్తం నూట యాభైకి పైగా రంగాల్లో రకరకాల శ్రమజీవుల సమూహాలు ఉన్నట్లు ప్రతినిధులు జాబితా రూపొందించారు. **"మన వాళ్లు ఎవరు"** అనే చర్చతో శ్రమజీవుల బలగానికి ఉన్న విశ్వరూపం ప్రతినిధులకు కళ్ళముందు సాక్షాత్కారం అయ్యింది. ఎన్నో ఏళ్లుగా ట్రేడ్ యూనియన్ కార్యకర్తలుగా పని చేస్తున్నప్పటికీ మన బలగం మీద మనకు ఇలాంటి అవగాహన లేదన్న విషయాన్ని కొందరు ప్రతినిధులు ఈ చర్చలో ప్రస్తావించారు.

## శ్రమ జీవులు.. శక్తి

మొదటి రోజు మధ్యాహ్నం **"శ్రమ జీవులలో శక్తి మనం ఎప్పుడు చూడగలుగుతాం?"** అన్న చర్చ జరిగింది. విడి కార్మికులలో అలాంటి శక్తి కనిపించదు. మార్క్స్ చెప్పినట్లు పెట్టుబడిదారీ వర్గం గోరీ కట్టే శక్తి లెనిన్ కార్మిక రాజ్యస్థాపనకు దారితీసిన శక్తి శ్రమజీవులకు వుందని, దానిని వెలికి తీసే బృహత్తర ప్రయత్నం మన కర్తవ్యంగా వివరిస్తూ శ్రమజీవులలో దాగిన శక్తి పైకి కనిపించదు. నీటికి వున్న శక్తి కూడా పైకి కనిపించదు. దానిని ఆవిరిగా మారిస్తేనే అది యంత్రాలను నడిపే శక్తి అవుతుంది. అలాగే శ్రమజీవులను ఒక వర్గంగా మార్చితే అప్పుడు అది మహత్తర కార్యాలు సాధించగల శక్తి అవుతుందన్నారు. దీనిపై జరిగిన చర్చలో శ్రమజీవులు ఒక వర్గం అనే భావన ముందుగా కార్మిక సంఘాలలో రావాల్సిన అవసరం ఉందని కొందరు అన్నారు. ప్రధానంగా వివిధ కార్మిక సంఘాల మధ్య కొనసాగుతున్న పరస్పర అపనమ్మకం,

అపోహలు, రాజకీయ విభేదాలు, చీలికలు శ్రామిక వర్గ రాజకీయాలకు పెద్ద అవరోధంగా ఉన్నాయన్న భావన గట్టిగా వ్యక్తమైంది. దీనిపై వర్మగారు మాట్లాడుతూ అందరికీ వర్తించే ఉమ్మడి ఆర్థిక, సామాజిక అంశాల ప్రాతిపదికపై కార్మిక సంఘాల ఐక్యతను సాధించే కార్యక్రమాలను సాగించాలని, దానికే పరిమితం కాకుండా నేరుగా శ్రమజీవులందరికీ ఐక్యతా సందేశాన్ని, మనమంతా ఒక వర్గంగా కలిసివుంటే గెలుస్తాం అన్న ప్రచారాన్ని నిరంతరం సాగించాలన్నారు. శ్రమజీవులను విడి విడి ముక్కలుగా కాకుండా వారిని ఒక వర్గంగా గెలుచుకోవడం మన లక్ష్యం కావాలని, కార్మిక సంఘాలలో పనిచేసేవారు లెనిన్ రాసిన "అతివాద కమ్యూనిజం-ఒక బాల్యారిష్టం" పుస్తకంలో ట్రేడ్ యూనియన్‌లపై రాసిన భాగాన్ని తప్పనిసరిగా అధ్యయనం చేయాలని సూచించారు. వచ్చే మేడేని శ్రామిక హక్కుల విస్తరణ దినంగా, శ్రామిక వర్గ ఐక్య పోరాట దినంగా నిర్వహించాలి. మన వాళ్ళుగా గుర్తించిన వివిధ సమూహాల శ్రమజీవుల సంస్థల ఐక్య ఉద్యమంగా నిర్వహించడానికి ఇప్పటి నుండీ సన్నాహాలు చేసుకోవాలని ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. మొదటిరోజు సాయంత్రం ప్రముఖ సైకాలజిస్టు, హాస్య యోగా మాస్టర్ ట్రైనర్ టి.గంగాధర్ కార్మిక నాయకుల ఆరోగ్యానికి తోడ్పడే **"హాస్య యోగా"**లోని పలు అభ్యాసాలను చేయించారు.

## వ్యవస్థను మార్చే ఉద్యమ నిర్మాణం

జూలై 7వ తేదీ రెండో రోజు ఉదయం సెషన్‌లో **"కార్మికవర్గ నాయకత్వం - మనో వికాసం"** అంశంపై ప్రముఖ విశ్లేషకుడు డి.పాపారావు మాట్లాడారు. విప్లవానికి ముందు, విప్లవకాలంలో శ్రామిక వర్గ శ్రేణులలో వ్యక్తం అయ్యే విభిన్న ధోరణులపై లెనిన్ అభిప్రాయాలు నీలం నోట్ బుక్ పుస్తకంలో ఉన్నాయని ఆయన చెప్పారు. ఆ పుస్తకంలోని పలు అంశాలను వివరించారు. ట్రేడ్ యూనియన్ నాయకులు కార్మికులకు నిజాలు చెప్పడం, వారికి వాస్తవిక దృష్టి కల్పించడం, ప్రశ్నించే అవకాశం ఇవ్వడం, నిజాయితీగా ఉండటం, ఆర్భాటాలకు దూరంగా ఉండటం, వంటివి శ్రామిక వర్గ సంస్కృతిలో భాగమని పాపారావు వివరించారు. సమాజానికంటే ఒక అడుగు ముందుండాల్సిన చారిత్రక బాధ్యత కార్మిక నాయకత్వంపై ఉందని ఆయన స్పష్టం చేశారు.

రెండోరోజు ఉదయం రెండో సెషన్‌లో.. **"వ్యవస్థను మార్చే ఉద్యమ నిర్మాణం"** అంశంపై చర్చ జరిగింది. శ్రమజీవుల వేతనాలు పెంపుదల, పని పరిస్థితుల మెరుగుదల, హక్కుల విస్తరణకు సంక్షేమానికి సాగించే వర్గ పోరాటాలు తక్షణ ఉపశమనం కలిగించేవి మాత్రమేనని, దోపిడీ నుండి శాశ్వతంగా విముక్తి సాధించడానికి వ్యవస్థను మార్చే ఉద్యమాలకు శ్రమజీవులను నడిపించాలని వర్మ సూచించారు. పెట్టుబడిదారీ వర్గ పాలనపై జరిపే రాజకీయ పోరాటం పౌరసమాజాన్ని ప్రభావితం చేసే విశాల ప్రజా ఉద్యమం గాను, అంచలంచెలుగా పెట్టుబడి వర్గాలపై దాడి చేసి విజయాలను సాధించే నినాదాలను కార్యాచరణను రూపొందించుకోవాలని వర్మ చేసిన సూచనపై ప్రతినిధుల అభిప్రాయాలను సేకరించారు. పెట్టుబడిదారీ దోపిడీ వ్యవస్థ నుండి పుట్టుకొచ్చి దేశ సంపదను తమ గుప్పెటలో పెట్టుకున్న కార్పొరేట్ శక్తుల మీద పోరాటం సాగించాలని అభిప్రాయపడ్డారు. దేశంలో 10 శాతం మంది దగ్గర పోగుపడ్డ 75 శాతం సంపద పునఃపంపిణీ నినాదాన్ని చేపట్టాలని భావించారు. పోగుపడ్డ సంపద అంతా శ్రమ దోపిడీ నుండి పోగుపడ్డదేనని దానిని సంపద పన్ను, వారసత్వ పన్ను, విండ్ ఫాల్ పన్నులు విధించి శ్రమజీవులకు చట్టబద్ధ హక్కు విద్య, వైద్యం, నివాసం, ఆహార భద్రతలను, పేదలందరికీ కనీస ఆదాయ పథకాన్ని ప్రకటించాలనే నినాదాలతో, దోపిడీ, వివక్ష లేని సమాజం లక్ష్యంగా సమస్త శ్రమ జీవులను, కార్మిక సంఘాలను, వివిధ తరగతుల ప్రజా సంఘాలను, వివక్షకు వ్యతిరేకంగా పోరాడుతున్న దళిత, బహుజన, మహిళా, సంఘాలను, మైనారిటీలను, సమీకరించే ఐక్య ఉద్యమం నిర్మించాలని భావించారు. ఈ నినాదంతో విశాల ప్రజా ఉద్యమానికి దేశ ప్రజలందరికి సామాజిక, ఆర్థిక, రాజకీయ, న్యాయాన్ని, అందరికీ అవకాశాల్లో సమానత్వాన్ని, భారత రాజ్యాంగ పీఠిక వాగ్దానం చేసిందనీ, జనాకర్షణ గల శ్రమజీవుల జాతీయ రాజకీయ ఉద్యమ నిర్మాణానికి జనవరి 26 రిపబ్లిక్ డేని ఎంచుకుని నిర్వహించాలని వర్మ చేసిన సూచనకు ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు. ఈ వర్క్ షాపు రూపొందించిన కార్యకలాపాల నిర్వహణకు రాష్ట్రంలోని పది పట్టణాలకు చెందిన నాయకులు ముందుకు వచ్చారు. వారికి అన్నివిధాలా సహకరిస్తామని ఎ.ఐ.టి.యు.సి. రాష్ట్ర నాయకత్వం ప్రకటించారు. ముగింపులో వర్క్ షాప్‌లోని అంశాలపై, వర్క్ షాప్ జరిగిన తీరుపై దాదాపు ముప్పై మంది ప్రతినిధులు మాట్లాడారు. కీలక అంశాలపై తమకు స్పష్టత వచ్చిందని, చర్చా పద్ధతిలో జరగడం బాగుందని, ఇలాంటి వర్క్ షాప్‌లు జిల్లాస్థాయిల్లో కూడా నిర్వహించాలని ప్రతినిధులు అభిప్రాయపడ్డారు.

79 ఏళ్ల వయసులో కూడా రెండు రోజులపాటు వర్క్ షాప్‌ను ఓపిగ్గా, ఉత్సాహంగా నిర్వహించిన డి.వి.వి.ఎస్.వర్మను ఏ.ఐ.టి.యు.సి. రాష్ట్ర నాయకులు జి.ఓబులేసు, ఆర్.రవీంద్రనాథ్, ఎస్.వెంకటసుబ్బయ్య, చలసాని వెంకట రామారావు, వెలుగూరి రాధాకృష్ణమూర్తి, తదితరులు సన్మానించారు. వర్క్ షాప్ నిర్వహణలో అర్థవంతంగా చర్చలు సాగించడానికి సహ సమన్వయ బాధ్యతలు నిర్వహించిన సోమసుందర్‌ను వర్మ ప్రత్యేకంగా అభినందించారు. నూజివీడు "మేధో మథన సమాలోచన" వర్క్ షాప్‌లో ఎ.ఐ.టి.యు.సి రాష్ట్ర నాయకులు ఆ దిశగా ఒక క్రియాశీలమైన ముందడుగు వేశారని చెప్పవచ్చు. ❑

# సంపద పన్ను, వారసత్వ పన్నులతో సంక్షేమ రాజ్యం



- ప్రభాత్ పట్నాయక్

**పెట్టుబడిదారుడు తన వారసుడికి సంపదను తన తదనంతరం కట్టబెట్టగలగడం అనేది ఆ వ్యవస్థ మనుగడకు అత్యంత కీలకం అని తరచూ భావిస్తూ వుంటారు. అటువంటిదానికి అవకాశం గనుక లేకపోయినట్లైతే పెట్టుబడిదారుడు ముందుకు పోవడానికి ప్రోత్సహించే అంశం వేరే ఏదీ ఉండదని, అప్పుడు ఆ వ్యవస్థ తన చురుకుదనాన్ని కోల్పోతుందని వారు అనుకుంటారు. ఇంతకన్నా అవాస్తవికమైనది మరొకటి ఉండదు. నిజానికి బూర్జువా వర్గం ఆస్తి హక్కును కలిగివుండడాన్ని సమర్థించుకోవడానికి చేసే వాదనలకు వారసత్వం ద్వారా ఆస్తి సంక్రమించడం అనేది విరుద్ధం.**

పెట్టుబడిదారులకు కొన్ని అరుదైన లక్షణాలు ఉంటాయని, వాటిని వినియోగించగలిగితేనే దేశం సంపద్వంతం అవుతుందని, అందువలన ఆ లక్షణాలను వినియోగించుకోవడానికి వీలుగా పెట్టుబడిదారులకు తగిన ప్రతిఫలం ముట్టాలని పెట్టుబడిదారీ ఆస్తి హక్కును సమర్థించేవారు చెప్తారు. ఆ 'అరుదైన లక్షణాలు' ఏమిటో స్పష్టంగా చెప్పే విషయంలో మాత్రం ఈ సమర్థకుల మధ్య ఏకాభిప్రాయం లేదు. ఉత్పత్తి జరిగే క్రమాన్ని పర్యవేక్షించడంలో ఆ ప్రత్యేక లక్షణం ఉంటుందని అనుకుందామా అంటే ఆ పనిని జీతానికి పని చేసే సూపర్‌వైజర్లు చేస్తారు. అందుకు గాను వారికి జీతాలు ముడతాయే తప్ప లాభాలలో వాటా ఏమీ దక్కదు (ఆ కంపెనీలో వారికి షేర్ల రూపంలో కొంత ఆస్తి ఉంటేనే తప్ప). 'పరిశ్రమలను నడిపేది పెట్టుబడిదారులు కాదు, ఆ పని వ్యవస్థీకృత సాంకేతికత ద్వారా జరుగుతుంది' అని జాన్ కెన్నెత్ గాల్బ్రియత్ అన్నారు. పెట్టుబడిదారులకు వుండే 'వేటాడే జంతు ప్రవృత్తి' (యానిమల్ స్పిరిట్స్) గురించి కీన్స్ ప్రస్తావించాడు. పోనీ, అదే వారి ప్రత్యేక, అరుదైన లక్షణం అని అనుకుందామా అంటే ఆ లక్షణం ఎంత మొత్తాన్ని పెట్టుబడిగా పెడతాడో దానిని నిర్ణయిస్తుంది తప్ప అసలు ఆ పెట్టుబడిదారుడికి ఆ సంపద ఎలా వచ్చిందో, అది ఆస్తి ఏవిధంగా అయిందో వివరించదు.

పెట్టుబడి పెట్టడం ద్వారా పెట్టుబడిదారుడు రిస్క్ తీసుకుంటాడు గనుక అతనికి ఆ ప్రతిఫలం ముట్టాల్సిందే అని వాదించే వారున్నారు. కాని నిజానికి రిస్క్ తీసుకునేది పెట్టుబడిదారుడు కాదు. బ్యాంకుల ద్వారా పోగుబడిన ఇతరుల సొమ్ము ఆ పెట్టుబడిదారుల దగ్గరకు చేరుతుంది. దానిని అతడు పెట్టుబడి పెడతాడు. ఆ వెంచర్ గనుక దెబ్బ తింటే దాని పర్యవసానం అనుభవించేది ఆ ఇతరులే. అయితే ఈమధ్య కాలంలో ప్రభుత్వాలు ఆ బ్యాంకులను ఆదుకోడానికి నిధులు వెచ్చిస్తున్నాయి. అలా వెచ్చించడం అంటే ఆ రిస్క్ ప్రభుత్వం తీసుకుంటోందని భావించాలి. అంటే సమాజమే ఆ రిస్క్ తీసుకుంటున్నట్టు అవుతుంది తప్ప పెట్టుబడిదారుడు కాదు. అంటే రిస్క్ తీసుకునే గుణం పెట్టుబడిదారుడికి లేదు.

పెట్టుబడిదారుడు తన ఆదాయాన్ని ఊరికే ఖర్చు చేసేయకుండా పొదుపు చేసి కూడబెట్టి దానిని పెట్టుబడిగా పెడతాడు. ఆ విధంగా ఖర్చు చేయకుండా త్యాగం చేశాడు గనుక అతగాడికి ప్రతిఫలం ముట్టాల్సిందే అని కొందరు వాదిస్తారు. త్యాగం అంటే ఏమిటి? అన్న తాత్విక చర్చలోకి పోనవసరం లేకుండానే ఆ వాదనను తిప్పికొట్టవచ్చు. పెట్టుబడి నుండి పొదుపు వస్తుంది తప్ప పొదుపు నుండి పెట్టుబడి రాదు. పరిశ్రమల్లో అంత వరకూ పూర్తి సామర్ధ్యాన్ని వినియోగించుకోకుండా ఉన్న సందర్భాల్లో ఆ సామర్ధ్యాన్ని మరింత ఎక్కువగా వినియోగించుకోవడానికి అదనంగా పెట్టుబడి పెడతారు. ఆ పెట్టుబడి చలామణీ అయ్యే క్రమంలో పొదుపుకు కావలసిన ధనం సమకూరుతుంది. ధరలు పెరిగి కార్మికుల నిజ వేతనాలు పడిపోయినపుడు అలా చౌకగా కార్మికుల శ్రమను పొందగలిగినందు వలన పెట్టుబడిదారుల వద్ద పొదుపుకు ధనం సమకూరుతుంది. అనేకమంది అనేక కారణాల రీత్యా పొదుపు చేస్తారు. అలా చేయడమే 'త్యాగం' అయినట్టు పరిగణించడం, అందుకు వారికి ప్రతిఫలం ముట్టాలని అనడం పెట్టుబడిదారీ వ్యవస్థ నడిచే విధానానికి సరిపడని వాదన.

పెట్టుబడిదారులు ధైర్యశాలురని, అందుచేత కొత్త కొత్త ప్రక్రియలను ప్రవేశ పెట్టగలరని, అటువంటి "ధైర్యం" కొద్దిమందికే ఉంటుందని, అందుకే వారికి తగిన ప్రతిఫలాన్ని ముట్టజెప్పాలని మరొక వాదన ఉంది. అయితే, ఎటువంటి కొత్త ప్రక్రియనూ ప్రవేశ పెట్టకుండా సాధారణ పునరుత్పత్తినే కొనసాగించినా కూడా పెట్టుబడిదారుడి వద్ద ఉండే ఆస్తి లాభాలను తెచ్చి పెడుతూనే వుంటుంది. అందుచేత ఈ వాదన కూడా చెల్లదు. అయితే, పెట్టుబడిదారుడికి ఆస్తి ఎలా సమకూరిందన్నది కాని,

లాభం ఎందుకివ్వాలన్నది కాని ప్రస్తుత చర్చనీయాంశం కాదు. పెట్టుబడిదారులకు కొన్ని అరుదైన లక్షణాలు ఉంటాయని, అందువలన వారి వద్ద ఆస్తి పోగుపడడం గాని, వారికి లాభం చేకూరడం గాని సమర్ధనీయమేనన్న వాదనలు సరైనవే అని మాటవరసకు అనుకుందాం. అటువంటి ప్రత్యేక లక్షణాలు ఏవీ లేకున్నా వారి వారసులకు ఈ ఆస్తి వారసత్వంగా సమకూర డాన్ని ఏ విధంగా సమర్ధిస్తారు? అట్లా సమర్ధించడం ద్వారా పెట్టుబడిదారుడికి ప్రత్యేక లక్షణాలు వుంటాయన్న వాదనను పరోక్షంగా తిరస్కరించినట్టు అవుతుంది కదా? కనుక వారసత్వం ద్వారా ఆస్తి సమకూరడం అనేది పెట్టుబడిదారుడు ఆస్తి కలిగి వుండడాన్ని సమర్ధించే వాదనలను పూర్వపక్షం చేస్తుంది. ఒక వాదన ఇంకా ఉండిపోయింది. పెట్టుబడిదారుడికి గనుక ఆస్తిని తన వారసులకు బదలాయించే హక్కు లేకపోతే అతగాడు తన ప్రత్యేక లక్షణాలను ప్రదర్శించడానికి ప్రోత్సాహకం అంటూ (ఇన్సెంటివ్) ఏదీ ఉండదు కదా అన్నదే ఆ వాదన. అయితే ఈ వాదన నిజానికి వారసత్వాన్ని సమర్ధించే దిగా కాక, పెట్టుబడిదారుడి బ్లాక్‌మెయిల్ ను సమర్ధించేదిగా ఉంది. 'వారసత్వ హక్కును గనుక అంగీకరించకపోతే నా ప్రత్యే క లక్షణాలను బైటపెట్టను' అని పెట్టుబడిదారుడు సమాజాన్ని బెదిరించినట్టు ఉంది ఈ వాదన. నైతికంగా ఈ వాదన సమర్ధనీయం కాదు. పైగా ఇది తర్కానికి నిలిచేది కాదు.

వారసత్వ హక్కు లేనట్లయితే సమాజంలో సృజనాత్మకత లేకుండా పోతుందా ? చొరవ లేకుండా పోతుందా? నూతన ఆవిష్కరణలు లేకుండా పోతాయా? నాకు వారసత్వ హక్కు లేకుండా పోయిందని ఒకడు తన చొరవను, సృజనను ప్రదర్శిం చడం మానుకుంటే, అతనికి బదులు ఆ లక్షణాలను ప్రదర్శించే మరో వ్యక్తి ముందుకు వస్తాడు-అతగాడికి ఎటువంటి వారసత్వమూ సంక్రమించకపోయినా సరే (మార్కెట్‌లో పోటీ ఉంటుంది కదా). అందుచేత బూర్జువా తర్కం ప్రకారం చూసినా, వారసత్వ హక్కుకు ఎటువంటి తార్కిక సమర్ధనా లేదు. అందుచేతనే, పెట్టుబడిదారులకు పూర్తిగా అనుగుణంగా ఉండే ప్రస్తుత నయా ఉదారవాద శకంలో కూడా అనేక పెట్టుబడిదారీ దేశాల్లో వారసత్వ పన్ను చాలా ఎక్కువ శాతంలో విధిస్తున్నారు. జపాన్‌లో వారసత్వ పన్ను 50 శాతం. అమెరికాలో కూడా 40 శాతం ఉంది. చాలా యూరోపియన్ దేశాలలో 40 శాతం వరకూ ఉంది. ఈ పన్నును ఎగ్గొట్టేవాళ్ళు ఎక్కువగానే ఉన్నప్పటికీ, వారసత్వ పన్ను ఉండాలనే సూత్రాన్ని మాత్రం విస్తృతంగానే ఆమోదిస్తున్నారు.

మన దేశంలో మాత్రం ఒక వైపు ఆర్థిక అసమానతలు విపరీతంగా పెరిగిపోతున్నా, సంపద పన్ను గాని, వారసత్వ పన్ను గాని ఉన్నట్టు గట్టిగా చెప్పుకోడానికి లేదు. ఈ విషయమై పబ్లిక్‌లో ఎటువంటి చర్చ కూడా జరగడంలేదు. రాజ్యాంగం మనకు సమాన అవకాశాలను కల్పిస్తామని హామీ ఇచ్చినా, చాలా మంది దృష్టిలో సమాన అవకాశాలు అనేవి ఆచరణలో సాధ్యంకాని ఒక కలగానే ఉంది. అందుచేత ఆ విషయాన్ని విడిచిపెట్టి తమ దుర్భర పరిస్థితుల నుండి ఎంతోకొంత ఊరట కలిగించే సహాయ చర్యలనే వారు కోరుకుంటున్నారు.

**ప్రజాస్వామ్యం మనగలగాలి అంటే సమాన అవకాశాలు ఉండి తీరాలి (ఇది పెట్టుబడిదారీ వ్యవస్థ ఉండగా సాధ్యం కాదు). సమాన అవకాశాలు కల్పించే వైపుగా అడుగు పడాలంటే సంపదలో ఉన్న అసమానతలను తగ్గించడం, వారసత్వం ద్వారా సంపద సంక్రమించే సూత్రాన్ని రద్దు చేయడం మొదటి మెట్టు అవుతుంది. దీనివలన ఒనగూడేదేమిటో కొన్ని అంకెల ద్వారా వివరించవచ్చు. 2019లో మన దేశంలో ప్రైవేటు వ్యక్తుల వద్ద ఉన్న సంపద విలువ సుమారు రూ.945 లక్షల కోట్లు అని అంచనా వేశారు. ఇందులో అత్యంత సంపన్నులు ఒక శాతం మంది వద్ద 42.5 శాతం సంపద ఉంది. అంటే అది సుమారు రూ.400 లక్షల కోట్లు. దీని మీద కనీసం 2 శాతం సంపద పన్ను విధించినా దానివలన రూ.8 లక్షల కోట్లు వస్తుంది.**

(ఎలిజబెత్ వారెన్ అమెరికా అధ్యక్ష పదవికి పోటీలో ఉన్న కాలంలో ఆమె 5 శాతం సంపద పన్ను విధిస్తానని తన ప్రణాళికలో ప్రకటించింది. తర్వాత బెర్నీ శాండర్స్ సంపద ఎక్కువ ఉన్నకొద్దీ పన్ను రేటు ఎక్కువ ఉండేవిధంగా 1 నుండి 8 శాతం వరకూ సంపద పన్ను విధించాలని ప్రతిపాదించాడు.)ఇక వారసత్వ పన్ను సంగతి చూద్దాం. అత్యంత సంపన్నులు ఒక్క శాతం మందిలో ప్రతీ ఏటా 5 శాతం మందికి వారసత్వంగా ఆస్తి వస్తుంది (అంటే అత్యంత సంపన్నుల్లో ప్రతీ 100 మందిలో ఏడాదికి అయిదుగురు తమ వారసులకు ఆస్తులు అప్పజెప్తున్నారు అనుకుందాం). అంటే రూ.400 లక్షల కోట్లలో 5 శాతం అవుతుంది. అది రూ.20 లక్షల కోట్లు. దానిలో మూడో వంతు వారసత్వ పన్నుగా నిర్ణయిస్తే రూ. 6.67 లక్షల కోట్ల చొప్పున ప్రతి ఏటా ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. జనాభాలో కేవలం ఒక్క శాతంగా ఉన్న అత్యంత సంపన్నులపై ఈ పన్నులు విధిస్తే ప్రభుత్వానికి ఏటా రూ.14.67 లక్షల కోట్లు వస్తాయి. ఇది మన జిడిపిలో 7 శాతం.

**(మిగతా 35వ పేజీలో)**

# సంపద పన్నుతో సామాజిక సంక్షేమం



- రాహుల్ కుమార్

**సంపద చుట్టూ మానవ చరిత్ర తిరిగింది. దాని పంపకంలో అసమానతలు వర్గాలను సృష్టించాయి. వాటి మధ్య తలెత్తిన సంఘర్షణలు సమాజాన్ని కుదిపేశాయి. సమాజ గమనాన్ని కొత్తదారులు పట్టించాయి. వెతికితే వేల ఏళ్ల చరిత్రలో అలాంటి దారులెన్నో కన్పిస్తాయి. అసమానతలను సమర్థిస్తూనో, విమర్శిస్తూనో ఎన్నో సిద్ధాంతాలు వచ్చాయి. నిశితంగా చూస్తే మత, తాత్విక భావాలన్నీ అసమానతలను వివరించటానికో, విమర్శించటానికో పుట్టినట్లు కనిపిస్తాయి. అందుకే సంపద సృష్టి, పంపిణీలు చుట్టూ వివాదాలు చెలరేగుతూనే ఉంటాయి.**

ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో సంపద పంపిణీ చుట్టూనే ప్రచారం హోరెత్తింది. హిందువుల సంపదను ముస్లింలకు పంచటానికే కాంగ్రెస్ కంకణం కట్టుకుందని ప్రధాని మోదీ ఆరోపించారు. వారసత్వంగా వచ్చే ఆస్తులపై పన్నులు వేసే దురాలోచనను ఆ పార్టీ చేస్తోందనీ విమర్శించారు. తనకు అలాంటి ఆలోచనే లేదంటూ కాంగ్రెస్ పార్టీ తిప్పికొట్టినా ఇటీవల కాలంలో సంపద పంపిణీ గురించి ఎక్కువగా మాట్లాడింది ఆ పార్టీనే.

రాజకీయంగా ఇతర అస్త్రాలు పనిచేయనప్పుడు సంపద పునఃపంపిణీ గురించి స్మరించటం అన్ని పార్టీలకు అలవాటే. దీనికి కాంగ్రెస్ మినహాయింపు కాదు. అయితే ఒకటి మాత్రం ప్రస్తుతం మన రాజకీయాల్లో స్పష్టంగా కనపడుతోంది. సంపద పునఃపంపిణీ అనేది జనాకర్షణ నినాదంగా మారింది. అన్ని పార్టీలకూ ఇది విస్మరించలేని విధానంగా పరిణమించింది. దీనికి ప్రత్యేకమైన కారణమూ ఉంది. ఏ ప్రజాస్వామ్య దేశంలో లేనంత స్థాయిలో సంపద, ఆదాయ పంపిణీల్లో అసమానతలు భారత్‌లో ఏర్పడ్డాయనీ నిరూపించే గణాంకాలు ఇటీవల బాగా వెలుగులోకి వస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా అసమానతలను విశ్లేషించటంలో ఫ్రెంచ్ ఆర్థికవేత్త టామస్ పికెటీ, ఆయన సహచర బృందం ఎంతో కృషి చేస్తోంది. ఆదాయం, సంపదల్లో అసమానతలు.. భారత్‌లో గతంలో ఎన్నడూ లేని రీతిలో విపరీతంగా పెరిగిపోయాయని పేర్కొంటూ ఈ ఏడాది మార్చి 18న ఒక నివేదికను విడుదల చేసింది. దీనికి కొనసాగింపుగా మే నెలలో మరో చిన్న నివేదికను ప్రచురించింది. ఇందులో కులానికీ సంపద, ఆదాయ అసమానతలకూ మధ్యనున్న సంబంధాన్ని విశ్లేషించారు. భారత్‌కు సంబంధించి ఫోర్బ్ మ్యాగజీన్ ఏటా ప్రచురించే బిలియనీర్ల జాబితాతోపాటు జాతీయ గణాంకాల కార్యాలయం నిర్వహించే 'డెట్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ సర్వేను' (ఏఐడీఐఎస్) ఆధారం చేసుకుని ఎగువ, వెనుకబడిన, దళిత, గిరిజన కులాల దగ్గరున్న సంపద లెక్కలను వివరించారు. ఫోర్బ్ ప్రచురించిన 100 మంది బిలియనీర్ల (100 కోట్ల డాలర్ల సంపద కలిగినవారు) జాబితాలోని వ్యక్తుల ఇంటి పేర్లను విశ్లేషించి ఎవరు ఏ కులానికి చెందుతారో నిర్ధారించారు. అట్లా 2022-2023 నాటి ఫోర్బ్ జాబితాను పరిశీలిస్తే అందులో 90 శాతం మంది అగ్రకులాలకు చెందిన వారే ఉన్నారు. వెనుకబడిన తరగతులకు (ఓబీసీ) చెందిన వారు 10 శాతంలోపే ఉన్నారు. షెడ్యూల్డు కులాలకు(ఎస్సీ) చెందిన వారు 2.6 శాతం ఉండగా గిరిజనులకు (ఎస్టీలు) అసలు చోటే దక్కలేదు. ఇక 2018-2019 నాటి ఏఐడీఐఎస్ ప్రకారం చూస్తే కాస్త భిన్నమైన సామాజిక చిత్రం కనపడింది. అగ్రకులాల జనాభా 25 శాతం ఉందనుకుంటే వారి దగ్గరున్న సంపద మాత్రం 55 శాతం వరకూ ఉంది. ఓబీసీల దగ్గర 35 శాతం సంపద ఉంటే ఎస్సీ, ఎస్టీల దగ్గర వారి జనాభాతో పోల్చితే సగం శాతం మాత్రమే ఉంది. అంటే 10 శాతానికి కాస్త అటూ ఇటూగా ఉంటుందని అనుకోవచ్చు. సామాజికంగా కులాల హెచ్చు తగ్గుల స్థితికీ సంపదలో వాటికి ఉన్న వాటాలకు మధ్య సంబంధం స్పష్టంగా ఉందనీ పైగణాంకాల వల్ల తెలుస్తోంది.

మొత్తంగా సమాజాన్ని నాలుగు కుల సమూహాలుగా చూస్తే ఇందులో ఎటువంటి సందేహం కలగదు. అయితే విడివిడిగా ఒక్కో కులాన్ని నిర్దిష్టంగా పరిశీలిస్తే మరో కఠిన వాస్తవం కనపడుతుంది. చాలా కులాల్లో సంపదతో ముడిపడిన వర్గాలు తలెత్తటం, వాటి మధ్య తేడాలు పెరగటమూ బాగా జరుగుతోంది. అందుకే ఒక తరహా ఆర్థిక అంశాల చుట్టూ ఒక కులం వారందరినీ సమీకరించే ప్రయత్నాలు అనుకున్న రీతిలో ముందుకు పోలేని దృశ్యాలే ఎక్కువ. అలాగే కులంలోని వారందరినీ ఒక గాటన కట్టి తారతమ్యాలు పట్టించుకోకుండా పదవులు, ఉద్యోగాల్లో ఎక్కువ వాటా కావాలని కోరే ఉద్యమాలను ఆర్థిక హెచ్చుతగ్గులు చాలాచోట్ల నిలువరిస్తున్నాయి. కులాల అంతర్గత పరిస్థితులపై సరైన గణాంకాలుంటే చాలా విషయాలపై స్పష్టత వస్తుంది. రిజర్వేషన్లు, సంక్షేమ పథకాలను నిర్దిష్టంగా ఎవరికి వర్తింపచేయాలో తేల్చవచ్చు. దీన్ని దృష్టిలో

ఉంచుకునే ప్రతి కుటుంబానికి చెందిన ఆస్తులు, ఆదాయ గణనకు సామాజిక-ఆర్థిక సర్వే చేపట్టాలన్న అభిప్రాయం బలంగా వినిపిస్తోంది. పికెటీ బృందం కూడా ఇదే భావాన్ని వ్యక్తంచేసింది. సంపద, ఆదాయాలకు సంబంధించి ప్రస్తుతం ఉన్న గణాంకాలు చాలా లోపభూయిష్టమైనవి. వెల్లడైన ఆస్తుల కంటే దాచేసినవే ఎక్కువ. భారత్‌లో బిలియనీర్ రాజ్ నడుస్తోందంటూ పికెటీ బృందం మార్చి నివేదికలో వ్యాఖ్యానించటం పెద్ద వివాదాన్నే సృష్టించింది. ముఖ్యంగా 2014 నుంచి అసమానతలు ఇంకా ఎక్కువయ్యాయని గణాంకాల ప్రాతిపదికన వివరించటంతో ప్రభుత్వ ఆర్థిక విధానాలను సమర్థించే వారి నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. పికెటీ బృందం వీటన్నిటినీ పరిశీలించి వాటిలో పసలేదనీ తేల్చింది. దీనికే పరిమితం కాకుండా అసమానతలను తగ్గించటానికి కొన్ని కీలక ప్రతిపాదనలు చేసింది.

ఒక శాతం జనాభా చేతుల్లో 40 శాతం సంపద పోగుపడిందన్న విషయం పికెటీ బృందం ఇప్పటికే చాలాసార్లు ప్రస్తావించింది. 1980ల నాటికి ఈ పరిస్థితి లేదు. అప్పటికి వీరి చేతుల్లో ఉన్న సంపద 12.5 శాతం మాత్రమే. ఆదాయంలోనూ ఇదే పరిస్థితి కనపడుతుంది. 1980ల నాటికి 1 శాతం జనాభాకు ఆదాయం లో 7.3 శాతం ఉంటే అది 2022-2023 నాటికి 22.6 శాతా నికి పెరిగింది. 46 కోట్ల వయోజనుల చేతుల్లో ఉన్న మొత్తం సంపదతో పోల్చితే పది వేల మంది ధనికుల చేతుల్లో సంపద మూడు రెట్లు ఎక్కువగా ఉంది. అసమానతల్లో మనం అగ్రగా ములం అయ్యాం. విశ్వ గురువుగా మారాం. మరి దీనికి విరుగుడు ఏమిటి? పికెటీ బృందం న్యాయబద్ధంగా పన్నును (టాక్స్ జస్టిస్) విధించటాన్ని ఒక పరిష్కారంగా చూపించింది. ముందుగా కేవలం ధనిక వర్గానికి చెందిన 0.4 శాతం మందిపై సంపద, వారసత్వ పన్నులను విధిస్తే రెండు రకాల ప్రయోజనాలు కలుగుతాయని చెప్పింది. **ఒకటి :** దీంతో అసమానతలు కొంతవరకూ కట్టడి చేయొచ్చు. **రెండు :** విద్య, వైద్యం, సామాజిక భద్రత, సంక్షేమ రంగాలకు కావాల్సిన నిధులను గణనీయంగా పెంచుకోవచ్చు. సంపద కలిగిన వ్యక్తి మరణించినప్పుడే వారసత్వ పన్నును విధించగలగుతాం. కాబట్టి దీని పరిధి పరిమితం. అందుకే సంపదపై పన్నును విధించటమే కీలకం. 99.96 శాతం జనాభాపై ఎటువంటి భారం లేకుండా కేవలం 0.4 శాతం మందిపై సంపద పన్నును విధిస్తే వచ్చే ఆదాయం పికెటీ బృందం అంచనా ప్రకారం చాలా ఎక్కువే ఉంటుంది. మొదటగా కనీస స్థాయిలో 10 కోట్ల సంపద దాటిన వారిపై రెండు శాతం సంపద పన్నునీ, 33 శాతం వారసత్వ పన్నునీ విధిస్తే జీడీపీ విలువలో 2.7 శాతం విలువకు సమానమైన అదనపు ఆదాయం వస్తుంది. 2023-24లో మన జీడీపీ విలువ (ప్రస్తుత ధరల ప్రకారం) 295.36 లక్షల కోట్లు ఉంటుందని అంచనా వేశారు. ఇందులో 2.7 శాతమంటే ఎనిమిది లక్షల కోట్లకు కాస్త తక్కువగా ఆదాయం లభిస్తుంది. ఇది చాలదనుకుంటే మరో రెండు స్థాయిల్లో సంపద, వారసత్వ పన్నులను ప్రతిపాదించారు. నికర సంపద 100 కోట్లు దాటిన వారిపై 2-4 శాతం పన్నులను విధిస్తే జీడీపీ విలువలో 4.6 శాతం ఆదాయం వస్తుందనీ అదే 3-5 శాతం విధిస్తే 6.1 శాతం ఆదాయం లభిస్తుందనీ తేల్చారు. పికెటీ బృందం ప్రతిపాదించిన విధంగా 0.4 శాతం జనాభాపై పన్నులు విధించగలిగితే విద్య, వైద్యం, సామాజిక సంక్షేమం, పౌర సదుపాయాలపై ఖర్చు బాగా పెరిగి కొన్నేళ్లలోనే మన మానవాభివృద్ధి చిత్రమే మారిపోతుంది. ఇదే జరిగితే ప్రధానంగా కింది, మధ్య కులాలు బాగా లబ్ధిని పొందుతాయి. కులతత్వ ఆలోచనలూ తగ్గే అవకాశం ఉంటుంది. సామాజికపరమైన అంతరాలను తగ్గించటంలో విద్యా వ్యాప్తి ప్రభావం అన్నిటికంటే ఎక్కువగా ఉంటుంది. ప్రపంచీకరణ వల్ల తలెత్తుతున్న పోటీ వాతావరణంలో అవకాశాలు దక్కించుకోటానికి నాణ్యమైన విద్య, నైపుణ్యాలు ఎంతో కీలకమైనవి. ఈ రెండూ కింది కులాల్లోని అర్హులకు తగిన స్థాయిలో దక్కకపోవటమే అభివృద్ధికి ఆటంకంగా ఉంది. ఈ దిశగా చర్యలు లేకుండా ఆదాయ, సందద అసమానతలు మరింతగా పెరగనిస్తే తలెత్తే నాలుగు విపరిణామాలు ప్రధానంగా చెప్పుకోవచ్చు.

1) విపరీత ఆదాయ అంతరం పేద, మధ్య తరగతి కొనుగోలు శక్తిని విపరీతంగా తగ్గిస్తుంది. ఉత్పత్తులకు తగినంత గిరాకీ ఉండదు. దీంతో ఆర్థిక వ్యవస్థ దీర్ఘకాలిక ప్రగతి మందగిస్తుంది. 2) విపరీత అసమానతలకు లోనవుతున్న ప్రజలు అసంతృప్తి, ఆగ్రహాలతో రగలిపోతూ రాజకీయ-సామాజిక అస్థిరతలకు కారణమవుతారు. 3) ఫలితంగా డాంబిక జనాకర్షణ నినాదాలతో నియంతృత్వ పోకడలు గల రాజకీయ నేతలు అధికారాన్ని చేజిక్కించుకునే ప్రమాదం పెరుగుతుంది. 4) విపరీత సంపద కేంద్రీకరణ ప్రభుత్వంపై కొద్ది మంది ధనికుల అనుచిత ప్రభావాన్ని నెరపటానికి కారణమవుతుంది. మరి.. 0.4 శాతం ప్రజలపై సంపద పన్నుని విధించటానికి రాజకీయ పార్టీలు సంసిద్ధంగా ఉన్నాయా? అని ప్రశ్నించుకుంటే అవునని చెప్పుకొనే పరిస్థితి లేదు. చాలా రాజకీయ పార్టీల్లో కీలక స్థానాలను 0.4 శాతం నుంచి వచ్చిన వారే క్రమేపీ ఆక్రమిస్తున్నారు. సంపదలు, ఆస్తులపై పట్టును వదులుకోవటం ఏ వర్గమూ అంత తేలికగా అంగీకరించదు. ఎన్నో సంఘర్షణలు, ఎన్నో ఒత్తిడులు తలెత్తితే కానీ సంపద పునఃపంపిణీకి అడుగులు పడవు. రెండు వందల ఏళ్ల ప్రపంచ చరిత్ర చెప్పే నిజం అదే. బలంగా వేళ్లూనుకున్న రాజకీయ ప్రజాస్వామ్యం కొన్ని సందర్భాల్లో అసాధ్యాలను సుసాధ్యాలు చేయగలదు! భారత్ కూడా అందుకు మినహాయింపు కాదేమో! ❑

# ఆగస్టు 9న 'కార్పొరేట్స్ క్విట్ ఇండియా డే'

**పోరుబాటలో సంయుక్త కిసాన్ మోర్చా**

నవ తెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో రైతులు, కార్మికులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్కేఎం) పోరాటానికి సిద్ధమైంది. ఎంఎస్‌పీ చట్టం, రుణమాఫీ, పంటల బీమా, రైతులు, కార్మికుల పెన్షన్, విద్యుత్ ప్రైవేటీకరణను వెనక్కి తీసుకోవడం వంటి పెండింగ్‌లో ఉన్న ఇతర డిమాండ్లపై ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించింది. కేంద్ర కార్మిక సంఘాలు, ఇతర టీయూలు, కార్మికులు, వ్యవసాయ కార్మికులు, విద్యార్థులు, యువత, మహిళలు, ఇతర బహుజన వర్గాల సంఘాలతో సమన్వయ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని తెలిపింది. బుధవారం సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్కేఎం) జనరల్ బాడీ సమావేశం జరిగింది. రాజస్థాన్‌లోని సికార్ నుంచి రైతు నాయకులు అమ్రారామ్, బీహార్‌లోని కరకట్ నుంచి రాజారామ్‌సింగ్, బీహార్‌లోని అర్రా నుంచి సుదామ ప్రసాద్, తమిళనాడులోని దిండిగల్ నుంచి ఆర్.సచ్చితానందం ఎంపీగా గెలుపొందడం పట్ల జనరల్ బాడీ అభినందనలు తెలిపింది. ఈ జనరల్ బాడీ అధ్యక్ష వర్గంగా అశోక్ ధావలే, దర్శన్‌పాల్, యుధ్వీర్ సింగ్, బల్బీర్ సింగ్ రాజేవాల్, రావుల వెంకయ్య, మేధాపాట్కర్, సత్యవాన్, రుల్దు సింగ్ మాన్సా, సునీలం, అవిక్ సాహా, ఆశిష్ మిట్టల్, తాజిందర్ సింగ్ విర్క్, కన్వర్జిత్ సింగ్ వ్యవహరించారు. ఏఐకేఎస్ నేత హన్నన్ మొల్లా ప్రతినిధులకు స్వాగతం పలికారు. 17 రాష్ట్రాల నుంచి 143 మంది ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా భవిష్యత్తు కార్యాచరణను ఎస్కేఎం ప్రకటించింది.

జూలై 11వ తేదీ గురువారం నాడిక్కడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్కేఎం నేతలు హన్నన్ మొల్లా, సునీలం, అవిక్ సాహా, రావుల వెంకయ్య, ప్రేమ్‌సింగ్ గెహ్లావత్, పి.కృష్ణప్రసాద్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఎస్కేఎం నిర్ణయాలను వెల్లడించారు. ఈ నెల 16 నుంచి 18 వరకు మూడ్రోజులపాటు తమ డిమాండ్లపై ఎస్కేఎం రాష్ట్ర నాయకత్వం లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలందరికీ వినతి పత్రాలను కలిసి ఇవ్వనుందని అన్నారు. తమ డిమాండ్లపై ఎన్డీఏ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని అభ్యర్థించనుందని తెలిపారు.

అలాగే ప్రధాని మోడీ, ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ అపాయింట్‌మెంట్‌లను కోరుతున్నట్టు ఎస్కేఎం నేతలు తెలిపారు. వారు అపాయింట్‌మెంట్ ఇస్తే వారికి తమ డిమాండ్లతో కూడిన



మెమోరాండం సమర్పిస్తారని అన్నారు. "ఆగస్టు 9న దేశవ్యాప్తంగా నిరసన ప్రదర్శలను చేయాలని, క్విట్ ఇండియా డేని" కార్పొరేట్స్ క్విట్ ఇండియా డే"గా నిర్వహించాలని ఎస్కేఎం పిలుపునిచ్చింది. వ్యవసాయ ఉత్పత్తి, వాణిజ్యంలో డబ్ల్యూటీఓ నుంచి ఇండియా బయటకు రావాలని డిమాండ్ చేసింది. తీవ్ర నీటి సంక్షోభం, అప్పుల భారం, రోడ్డు కారిడార్లతో ఇండియా-పాకిస్తాన్ వాణిజ్యాన్ని తెరవడం వంటి పంజాబ్ డిమాండ్లకు సంబంధించి ఆగస్టు 17న పంజాబ్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రితో సహా మంత్రులందరి ఇళ్ల వద్ద మూడు గంటలపాటు ఆందోళన చేపట్టనుంది. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో హర్యానా, మహారాష్ట్ర, జార్ఖండ్, జమ్మూ కాశ్మీర్ రాష్ట్ర సమన్వయ కమిటీలు తమ సమావేశాలను ఏర్పాటు చేస్తాయి. బీజేపీని శిక్షించాలని, ఎస్కేఎం డిమాండ్ల ఆధారంగా రైతులలో స్వతంత్ర, భారీ ప్రచారాన్ని నిర్వహిస్తారు. కార్మికులను ఇతర సంఘాలను కలుపుకుని రైతులు వాహన జాతాలు, పాదయాత్రలు, మహా పంచాయత్‌లను నిర్వహిస్తారు. తమ తమ రాష్ట్రాల్లో నెలకొన్న రైతుల సమస్యలను గుర్తించేందుకు, కేంద్ర కార్యాచరణ కార్యక్రమాలతో పాటు వారి ఆందోళన కార్యక్రమాలనూ రూపొందించేందుకు తక్షణమే అన్ని రాష్ట్రాల్లో ఎస్కేఎం రాష్ట్ర సమన్వయ కమిటీ సమావేశాలు నిర్వహించాలని పిలుపునిచ్చాయి."

### జనరల్ బాడీ ఆమోదించిన డిమాండ్లు

- అన్ని పంటలకు గ్యారెంటీ సేకరణతో 2+50 శాతంతో కూడిన ఎంఎస్‌పీ చట్టబద్ధంగా హామీ ఇవ్వాలి.
- వ్యవసాయ కార్మికులకు రుణభారం నుంచి విముక్తి కల్పించి రైతుల ఆత్మహత్యలకు ముగింపు పలకడానికి సమగ్ర రుణ మాఫీ చేయాలి.
- విద్యుత్ రంగం ప్రైవేటీకరణ ఆపాలి. ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు పెట్టొద్దు. **(మిగతా 42వ పేజీలో)**

# సాధారణ చరిత్ర, సాహిత్య చరిత్ర కలిసి నడవాలి

వకుళాభరణం రామకృష్ణతో కె.శ్రీనివాస్ ఇంటర్వ్యూ



మానవ ప్రయాణ కథనమే చరిత్ర అని స్థూలంగా అనుకుంటే, అందులో సాహిత్య ప్రయాణ కథనమే సాహిత్య చరిత్ర. అనేక శాస్త్రాల అన్వయం అవసరమయ్యే ప్రక్రియ సాహిత్యచరిత్ర. తెలుగు సాహిత్య చరిత్రకు చాలా చరిత్ర ఉంది. అందులో చాలా పాయలు, కోవలు ఉన్నాయి. ప్రాధాన్యాలు ఉన్నాయి. వివక్షలున్నాయి. ఉల్లేఖనలకు, విస్మరణలకు సామాజిక, రాజకీయ కోణాలున్నాయి. ఆధునిక సాహిత్య ఉద్యమాలన్నిటిలోను చరిత్ర ఒక ప్రధాన సంవాదాంశంగా ఉంటూ వచ్చింది. తెలుగు సాహిత్య చరిత్ర ప్రస్థానాన్ని సమీక్షించుకోవడానికి, కొత్త చూపులు జోడించడానికి, ఖాళీలు పూరించడానికి ఉపయుక్తమయ్యే ప్రయత్నంగా, సాహిత్య, సామాజిక చరిత్రకారులతో చేస్తున్న సంభాషణలలో మొదటిది వకుళాభరణం రామకృష్ణతో ఈ ఇంటర్వ్యూ.



**బ్రిటిషాంధ్ర సాంఘికోద్యమాల చరిత్రపై సాధికారమైన పరిశోధన చేసి, ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్‌తో గాఢానుబంధం కలిగి, ఆంధ్రప్రదేశ్ సమగ్రచరిత్ర సంపుటాల రూపకల్పనకు సారథ్యం వహించిన రామకృష్ణ, సాహిత్య, సాధారణ చరిత్రల మధ్య సంబంధం గురించి ఈ ఇంటర్వ్యూలో మాట్లాడారు.**

- **చరిత్ర రచన భారతీయులకు అలవాటు లేని విషయమని, వలసవాదులతోనే అది మొదలయిందని అనుకోవడం ఇప్పటికీ సరిఅయినదేనా ?**

మనం యివ్వాళ చరిత్రగా పరిగణించే రీతిలో, చరిత్ర రచన వలసపాలనకు ముందులేని మాట. ఒప్పుకోడానికి కష్టమైనా, నిజమే! అంతకుముందు చారిత్రక గ్రంథాలంటూ ప్రత్యేకించి లేవు. శాసనాలు (అశోకుడు, సముద్రగుప్తుడి కాలంలో వెలువడ్డ శాసనాలు-ప్రధానంగా, చరిత్రకు ఉపకరించే (గుప్తుల చరిత్ర), అలహాబాద్ స్తంభ శాసనం, సాహిత్యపరంగా బాణుడి "హర్ష చరిత్రము" (ఇందులో ప్రశస్తి, పొగడ్తలు, అతిశయోక్తులు వున్నాయి), మొగలుల కాలంలో వెలువడ్డ విదేశీ యాత్రికుల రచనలు, అప్పటి ప్రభుత్వాలు జారీ చేసిన ఉత్తర్వులు లభిస్తున్నాయి. ఆ తర్వాత వచ్చిన వలసవాదులు జారీచేసిన ఉత్తర్వులు, వారి వాణిజ్య కార్యకలాపాలు రికార్డయ్యాయి. శాస్త్రీయ రచనా పద్ధతికి ఇదే మొదలు.

- **తెలుగువారి చరిత్ర రచన ప్రారంభం ఎట్లా జరిగింది? మొదటి ఆధునిక తెలుగు చరిత్ర రచనగా దేనిని పరిగణించవచ్చు?**

19వ శతాబ్దంలో ఆవిర్భవించిన సాంస్కృతిక పునరుజ్జీవనంలో తెలుగువారి చరిత్ర మొదలైంది. జాతీయస్థాయిలో వచ్చిన మేధో మథనంలో భాగంగా, తెలుగు మేధావులు తెలుగు జాతి చరిత్ర, సంస్కృతులపై దృష్టి సారించారు. జాతీయోద్యమ భావజాలానికి మరింత బలం చేకూరుతుందన్న భావంతో, చరిత్ర కారులు, జాతీయ వాద చరిత్ర రచన అనే ఆలోచనా సరళిని ప్రోత్సహించారు. ఈ క్రమంలో విద్వాంసులు, సాహిత్యకారులైన కల్నల్ మెకంజీ, చార్లెస్ బ్రౌన్, జిల్లా మాన్యుయల్స్, గెజిటీర్లను వెలికితీసి చరిత్ర నిర్మాణానికి పూనిక చేశారు.

1900 సంవత్సరంలో లండన్ నుంచి ప్రచురితమైన రాబర్ట్ సీవెల్ రాసిన విస్మృత సామ్రాజ్యం(Forgotten Empire), ఆంధ్రుల చరిత్ర రచనకు దోహదం చేసింది. కొమర్రాజు లక్ష్మణరావు విజ్ఞాన చంద్రికా గ్రంథ మండలిని స్థాపించారు. ఈ సంస్థ ద్వారా 1910-36 మధ్య కాలంలో, కొమర్రాజు వారి ప్రోత్సాహంతో, మధ్యాంధ్ర దేశ చరిత్రపై విజయనగర

సామ్రాజం వరకు, మూడు సంపుటాలు వెలువరించారు. 1925లో చిలుకూరి, కొమర్రాజు, మల్లంపల్లి, భావరాజు ప్రభృతులు కలిసి 'ఆంధ్రా హిస్టారికల్ రిసెర్చి సొసైటీ' ని స్థాపించారు. ఒక త్రైమాసిక పరిశోధక సంచికను ప్రారంభించారు. ఆంధ్రదేశ చరిత్ర రచనలో యిదొక పెద్ద మలుపు. ఆంధ్రుల చరిత్ర సాధికారికంగా విజ్ఞాన చంద్రికా గ్రంథ మండలి ఆధ్వర్యంలో, కొమర్రాజు లక్ష్మణరావు రచనతో ఆరంభమైందని భావించడం కద్దు. నిజమే! కానీ, ఆ ప్రచురణకు ముందు, కొన్ని ప్రయత్నాలు జరిగాయి. గంగాదేవి రాసిన 'మధురా విజయం' (వీరకంపరాయ చరిత్ర) సంస్కృతంలో రాసిన సాహిత్యగ్రంథం. విజయనగర సామ్రాజ్య స్థాపకులైన హరిహర రాయ, బుక్కరాయల వంశానికి చెందిన వీరకంప రాయ జీవితం, అందులో వస్తువు. గంగాదేవి వీరకంపరాయని భార్య. వీరకంపరాయడు మధురను క్రీ.శ. 1371లో జయించాడు. ఆ చారిత్రక సందర్భంలో చోటు చేసుకొన్న ముఖ్యఘటనలను ఈ గ్రంథంలో గంగాదేవి పేర్కొంది.

19వ శతాబ్ది ప్రథమభాగంలో, కావలి సోదరుల (వెంకట బొర్రయ్య, వెంకటరామశాస్త్రి) పూనికతో, విస్తారమైన, ముఖ్య మైన చారిత్రక ఆధారాలను, స్థానికంగా లభిస్తున్న ప్రాచీన, ఇతిహాస, పురాణ వ్యాఖ్యలను, వివరణలను, వాటితోపాటు తాటాకులపై రాసిన సమాచారాన్ని, అనువాదాలు, పటాలు (Maps), చిత్రలేఖనాలు, పురావస్తు ఆధారాలు, శిల్పాలు, రాగి రేకులపై లభించిన శాసనాలను, తాటియాకులపై రాసి భద్రప రిచిన చారిత్రక, సామాజిక అంశాలను, నాణేలను సేకరించి భద్రపరిచారు. అనేక లిపులను వెలికితీసి, సరిచేసి, తుదిరూపా న్నిచ్చారు. కావలి సోదరులు రాసిన దక్కన్ కవుల చరిత్ర, దక్షిణ దేశ చారిత్రక పరిణామాల ఆనవాళ్లను సేకరించి భద్రపరిచారు. కావలి వెంకట బొర్రయ్యను శాసన సాహిత్య ప్రముఖుడిగా, వాస్తవానికి తెలుగు ప్రజల చరిత్రకు ఆద్యుడిగా పరిగణించాలి. కావలి వెంకట బొర్రయ్య తర్వాత, బుక్కపట్నం రాఘవాచార్యులు రచించిన History of Andhras గ్రంథంలో కళింగ రాజవంశాల గూర్చిన సమాచారం లభ్యమవుతున్నది. మద్రాసు లోని 'ప్రాచీన చరిత్ర, సంస్కృతికి సంబంధించిన ప్రతుల గ్రంథా లయం (Manuscripts Library)లో దీనికి సంబంధించి రాతప్రతులు లభ్యమవుతున్నాయి.

- **ఓరియంటలిస్టులు మొదలైనవారు భారతదేశం మీద కల్పించిన దృక్పథ చట్రం ప్రభావంతోనో, దానికి ప్రతిక్రియగానో భారతీయ చరిత్ర రచన మొదలైందనుకుంటే, తెలుగువారి చరిత్ర రచనను ఎజెండా మీదకు తెచ్చినవి ఏ కారణాలు?**

మీరన్నట్లు, భారతీయ చరిత్ర విషయంలో జరిగిందదే ! తెలుగు వారి చరిత్ర భారతదేశ చరిత్రలో అంతర్భాగంగా, అదే నేపథ్యంలో ప్రారంభమైంది. యూరోపియన్ సాహిత్యం ద్వారా పాశ్చాత్య సంస్కృతిని ఆకళింపు చేసుకొన్న తెలుగు రచయితలు, నూతన సాహిత్యసృష్టిలో భాగంగా తెలుగు కవుల చరిత్రను ఆధునిక దృక్పథంతో రాయనారంభించారు. పత్రికారచనలో కూడ కొత్త పుంతలు, దీని ప్రభావంతో ఏర్పడ్డాయి. కందుకూరి సాహిత్య కృషికి, గురజాడ, గిడుగులు మరింతగా దోహదం చేసి, వస్తుపరంగా, భాషాపరంగా తెలుగు సాహిత్య సంస్కృతుల ను ముందుకు తీసుకెళ్లారు. గురజాడ స్థానిక చరిత్రల రచనకు కూడా శ్రీకారం చుట్టారు. విజ్ఞాన చంద్రికా గ్రంథమండలి స్థాపన ద్వారా కొమర్రాజు లక్ష్మణరావు చరిత్ర, సంస్కృతులపై పరిశోధనా దృక్పథాన్ని జోడించి రచనలు చేశారు. 1912లో ఆంధ్రమహాసభ ఏర్పడింది. ఒక పరిశోధనా త్రైమాసిక పత్రిక ప్రారంభమైంది. కాలగర్భంలో కలిసిపోయిన శాసనాలను వెలికి తీసి, వాటిలోని సారాంశాన్ని చరిత్ర రచనకు పనిముట్టుగా ఉపయోగించుకున్నారు. అప్పుడు వెలువడ్డ ముఖ్యమైన రచనల్లో, ఈ ప్రశ్నకు సమాధానంగా చెప్పుకోదగ్గవి-మారేమండ రామా రావు రాసిన 'కాకతీయ చరిత్ర', నేలటూరు వెంకట రమణయ్య రాసిన 'విజయనగర మూడవ రాజవంశములోని పతనములు', సురవరం ప్రతాపరెడ్డి 'ఆంధ్రుల సాంఘికచరిత్ర' మొదలైనవి.

- **సాధారణ చరిత్రకు, సాహిత్య చరిత్రకు ఉండే సంబం ధం ఏమిటి? సామాజిక, రాజకీయ, సాంస్కృతిక చరిత్రరచనకు అనేక దినుసులను సాహిత్యం సమ కూరుస్తున్నది, మరి సాహిత్యచరిత్ర కారులు సాధారణ చరిత్ర నుంచి తీసుకోవలసినంత తీసుకుంటున్నారా?**

సాధారణ చరిత్ర అన్ని అంశాలను (చారిత్రక, సామాజిక, రాజకీయ, సాహిత్య, సాంస్కృతిక) సవివరంగా వ్యక్తీకరిస్తుంది. ఈ కృషికి దోహదం చేస్తూ, సాహిత్యం, ఆయా కాలాల్లో, అప్పటి సమాజాల్లో నెలకొన్న పరిస్థితుల్ని వ్యక్తపరుస్తుంది. ఈ వ్యక్తీకరణ నేరుగా, సరళరేఖలా వుండదు. సాహిత్య చరిత్రకారులు, కొద్ది మందిని మినహాయిస్తే, సాధారణ చరిత్రాంశాలను తీసుకోడం లేదు. దీనికి ఈ రెంటిమధ్య వున్న ముఖ్య సంబంధం తెలియక పోవడం ఒక కారణమైతే, సాధారణ చరిత్రపొరలలో దాగివున్న సాహిత్యాంశాలను గ్రహించగలిగిన శిక్షణ, నైపుణ్యం లేకపోవ డం మరో కారణం. ఇలా జరగనప్పుడు, సాహిత్య చరిత్ర సమగ్రం కాదు.

- **సాధారణ చరిత్ర రచన కేవలం పాలకుల వంశావళు లు, దండయాత్రలు యుద్ధాల జాబితాలను దాటి జన జీవనంలోని స్థితిగతులను సూక్ష్మస్థాయి దాకా పట్టుకోగ లుగుతోంది. సాహిత్యచరిత్ర రచన కవుల, రచయితల,**

**ప్రక్రియల, ఉద్యమాల కాలక్రమ చరిత్రగానే కొనసాగుతోందా? ఇతర సామాజిక, మానవీయ శాస్త్రాలతో సమన్వయం ఎంత వరకు జరుగుతోంది?**

అవును. అంతర్ సామాజిక శాస్త్ర అధ్యయనం (inter-social sciences disciplinary studies) ప్రక్రియ ఈనాడు ప్రాముఖ్యంలోకి వచ్చింది. దీనివల్ల చరిత్ర అధ్యయనంలో విషయ పరిజ్ఞానం పెరిగింది. సాహిత్య చరిత్రలో ఈ ప్రక్రియ జరుగుతున్నది కానీ, ఊపందుకోలేదు. సాహిత్య చరిత్ర కారులకు సామాజిక, మానవీయ శాస్త్రాలతో, కొద్దిమందిని మినహాయిస్తే, పరిచయం, పరిజ్ఞానం తక్కువ. ఇది సాహిత్య కారుల లోపం కాదు. సాహిత్య చరిత్రను బోధించే ప్రక్రియలోనే లోపం వుంది. సాహిత్యకారులకు ఇతర సామాజిక శాస్త్రాల విషయాలు బోధించే, పరిశోధించే విధానాల్లో మార్పు రావాలి. ఈ విషయంలో విశ్వ విద్యాలయాల్లో తగు మార్పులు చేయాలి. తెలుగు భాష, బోధన, సాహిత్యం, పరిశోధన రంగాల్లో కొనసాగుతున్న మునుపటి, కాలం చెల్లిన సంప్రదాయాలు, పద్ధతులు మారాలి.

- **ఆంధ్రలో సామాజికోద్యమాల చరిత్ర రచనలో మీది ప్రత్యేకమైన కృషి. అందులో సాహిత్యంతో సహా రకరకాల వ్మాయాన్ని ఆధారాలుగా తీసుకున్నారు. తెలుగు సాహిత్యచరిత్ర కారులకు తప్పనిసరిగా అవసరమయ్యే వాచక, వాచకేతర వనరుల గురించి మీ సూచనలు, సలహాలు..?**

'వాచక', 'వాచకేతర' వనరుల గూర్చి ఒక పట్టిక ఇక్కడ ఇవ్వలేను. కొన్ని సూచనలు, సలహాలు : 1) చారిత్రక దృక్పథంతో, కొద్దో గొప్పో, చారిత్రక అంశాలతో కూడిన సాహిత్యం. 2) ఏ అంశంపై పరిశోధన చేస్తున్నారో, దానిపై లభ్యమయ్యే రచనలు సేకరించడం. 3) యాత్రా చరిత్రలు, స్వీయ చరిత్రలు, రచయితల, సామాజిక, రాజకీయ వేత్తల ఆత్మ కథలు, అనుభవాలు, జ్ఞాపకాలు. 4) వాచకేతర వనరుల్లో... ఇంటర్వ్యూలు 5) ఆయా కాలాలపై, అప్పటి కాలంలో ప్రచురించిన సమకాలీన అనుభవాలతో కూడిన రచనలు.. ఇలా ఎన్నైనా చెప్పుకుంటూ పోవచ్చు. సాహిత్య చరిత్రకారులు విస్తారంగా, తమ పరిశోధనకు సంబంధించి లభ్యమయ్యే సామాజిక శాస్త్రాల్లోని విషయాలను సంప్రదించడం చేయాలి. ఇక, వనరుల గూర్చి ఇతమిత్థంగా, ఫలానా అని చెప్పలేము. అవి పరిశోధించే విషయాలను బట్టి, ఒక ఆధారాన్ని సంప్రదిస్తే, అది మరొక వనరుకు దోహదం చేస్తుంది. ఇది, ఈ ప్రక్రియ, పరిశోధన మొదలై ఆఖరు దాకా అవిచ్ఛిన్నంగా కొనసాగాలి.

- **చరిత్రకారుడిగా మీరు అభిమానించే తెలుగుసాహిత్యచరిత్ర కారులెవరు?**

అందరి పేర్లూ ఇక్కడ ఉటంకించలేను. ముఖ్యంగా ఇంకా రాస్తున్న వారిని ఎంచి చెప్పలేను. పూర్వులలో గురజాడ, కె.వి. రమణారెడ్డి తరువాత కె.వి.రమణారెడ్డి, జి.యన్.రెడ్డి, ఆరుద్ర, వెల్చేరు నారాయణరావు, కె.కె. రంగనాథాచార్యులు... వీరి చరిత్ర రచనను నేను అభిమానించాను. ❑

---

# పెట్టుబడిదారీ విధానం సంపద వారసత్వం

(29వ పేజీ తరువాయి)

**మన దేశం సంక్షేమ రాజ్యంగా ఉండాలంటే..**

- (1) అందరికీ అందుబాటులో ఉండే ధరల్లో చౌకగా ఆహారాన్ని పొందగలిగే హక్కు
- (2) అందరికీ ఉపాధి ఏడాది పొడవునా పొందే హక్కు
- (3) అందరికీ ఉచితంగా వైద్యసేవలు అందేలా ఆరోగ్య హక్కు
- (4) అందరికీ ఉచితంగా యూనివర్సిటీ స్థాయి దాకా విద్య పొందే హక్కు
- (5) వృద్ధాప్యంలో, అంగవైకల్యంలో జీవించడానికి అవసరమైన మోతాదులో పెన్షన్ పొందే హక్కు ఉండాలి.


ఈ అయిదు హక్కులూ అమలు కావాలంటే ప్రస్తుత జిడిపిలో 10 శాతం అదనంగా వనరులు అవసరమౌతాయి. ఈ అదనపు 10 శాతాన్ని ప్రభుత్వం ఖర్చు చేయగలిగితే, అలా ఖర్చయిన మొత్తం నుండి వివిధ పన్నుల రూపంలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు కనీసం 15 శాతం అదనంగా తిరిగి వస్తుంది. ఆ 15 శాతాన్ని మినహాయించి తక్కిన 85 శాతాన్ని అదనపు పన్నుల రూపంలో వసూలు చేస్తే చాలు. పైన తెలిపిన లెక్కల ప్రకారం సంపద పన్ను, వారసత్వ పన్ను వసూలు చేస్తే వచ్చే మొత్తం అందుకు సరిపోతుంది. అంటే, కేవలం ఒక్క శాతం జనాభాగా ఉన్న అత్యంత సంపన్నులపై రెండే రెండు రకాల పన్నులను విధిస్తే మన దేశాన్ని సంక్షేమ రాజ్యంగా మార్చవచ్చు. మనది పేద దేశమని, ప్రజలు అనుభవించే దుర్భర పరిస్థితులను మార్చడానికి కావలసిన ఆర్థిక వనరులు లేవని ఎవరైనా అంటే అది శుద్ధ తప్పు. ❑

# చలం-మతం-దేవుడు-మనం



- కాత్యాయనీ విద్మహే

**పుస్తకం-అది ఏ కాలంలో ఏ ప్రక్రియకు సంబంధించిందైనా కావచ్చు - సాహిత్య సృజన కావచ్చు, చరిత్ర కావచ్చు, విమర్శ కావచ్చు, సామాజిక తాత్విక చింతనా సంబంధి కావచ్చు- ఏమైనా అది కాలగతిలో సామాజిక రాజకీయార్థిక సాంస్కృతిక సందర్భాలు మారుతున్నపుడల్లా చదివే పాఠకులకు ఎప్పటికప్పుడు సమకాలీన సంక్లిష్టతలను, సంఘర్షణలను అర్థం చేసుకొనటానికి కొత్త సాధనంగా అంది రావటంలోనే సార్వకాలిక గుణాన్ని సంతరించుకొంటుంది. అది స్వీయ అధ్యయన అనుభవంలోకి రావటం మెదడులో వెలుతురు కిటికీలను తెరుస్తుంది. చలం మ్యూజింగ్స్ అలాంటి అనుభవం ఇచ్చిన పుస్తకం.**



2024 మే 18. చలం 130వ జయంతి. ఆ రోజున హైదరాబాద్‌లో జరిగే ఒక సభలో మాట్లాడటానికి మ్యూజింగ్స్ చదువవలసి వచ్చింది. 30 ఏళ్ళ తరువాత మళ్ళీ చదవటం ఇదే. 1994 చలం శతజయంతి సంవత్సరం. తెలుగు సమాజ చరిత్రను, సాహిత్యాన్ని స్త్రీవాద దృక్కోణం నుండి అధ్యయనం చేస్తున్న కాలం. ఆ క్రమంలోనే అప్పుడు స్త్రీపురుష సంబంధాల గురించి చలం ఆలోచనలు మ్యూజింగ్స్‌లో ఎలా భాగమయ్యాయో తెలుసుకోవాలన్న దృష్టి మాత్రమే ప్రధానమైంది. ఇప్పుడు వర్తమాన ఫాసిస్ట్ మత రాజకీయ సందర్భంలో చదువుతుంటే మతం, వేదాంతం, దేవుడు మొదలైన వాటి గురించి చలం ఆలోచనలు ఆశ్చర్యం కలిగించాయి. వాటిలో తర్కం, వ్యంగ్యం నన్ను బాగా ఆకట్టుకొన్నాయి. ప్రత్యేకించి రామాయణం గురించి రాముడి గురించి చలం వ్యాఖ్యలు చదువుతుంటే అసలు ఆధునిక తెలుగు సాహిత్య ప్రపంచం రామాయణాన్నిఎలా చూసిందీ, రాముడిని ఎలా వ్యాఖ్యానించిందీ ప్రత్యేకంగా అధ్యయనం చేయటం అవసరం అనిపించింది.

అనేకానేక విషయాల గురించి వ్యక్తి చింతనలో నిరంతరాయంగా కదిలే భావాలు ఆలోచనలు భిన్న సమయాలలో, భిన్న సందర్భాలలో జ్ఞాపకాలుగానో కథనాలుగానో, సంభాషణలో భాగంగానో వ్యాఖ్యనించబడే ప్రక్రియ మ్యూజింగ్స్. చలం మ్యూజింగ్స్ 1937 నుండి 1955 మధ్యకాలంలో రచించబడినవి. హిందూ సామాజిక కుటుంబ వ్యవస్థలలో స్త్రీల మీద, పిల్లలమీద అమలయ్యే అధికారానికి నొచ్చుకొంటూ 1920ల నాటికే రచనలు ప్రారంభించిన చలం మ్యూజింగ్స్ అత్యంత సహజంగా హేతువాద ప్రజాస్వామిక సామ్యవాద భావ చైతన్యంతో ఆధునికమవుతున్న ఆ కాలపు ప్రశ్నలకు, సందేహాలకు, నిరసనలకు, ధిక్కారాలకు, తిరుగుబాట్లకు ప్రాతినిధ్యం వహించాయి. ప్రకృతి సౌందర్యం, స్వేచ్ఛా కాంక్ష, సుఖదుఃఖ అనుభవం, విద్యా విధానం, స్త్రీ పురుష సంబంధాలు, పాతివ్రత్యం, పిల్లలపెంపకం, హింసాహింసల విచికిత్స, వేదాంత తాత్విక విషయ వివేచన, కవిత్వం, పాట, ప్రాచీన ఆధునిక సాహిత్య రచయితలు, రచనలు, కమ్యూనిజం, జాతీయోద్యమ రాజకీయాలలో గాంధీ స్థానం వంటి అనేకానేక విషయాల మీద చలం ఆలోచనలు మ్యూజింగ్స్‌లో భాగం అయ్యాయి. మతమే ప్రభుత్వం అవుతూ, రామనామం అధికార దండం అవుతూ, ఆరోగ్యకరమైన లౌకిక ప్రజాస్వామిక స్వభావం అభావం చేయబడుతున్న వర్తమాన సందర్భంలో మతం, దేవుడు, రాముడు అనే మూడంశాలకు పరిమితమై చలం భావనల పరామర్శ తక్షణ కర్తవ్యం.

**"కుల మతాలను వొదిలిపెట్టటం ఒక మహత్కార్యం కాదు. కాని వొదిలిపెట్టలేకపోవడం అల్పత్వం, భీరుత్వం, అంధత్వం. వీటన్నిటి కన్నా గొప్పది అసలు మనిషి కారెక్టర్" అంటాడు**

**చలం.** కుల భేదాలు సర్వమానవ సౌభ్రుత్వత్వానికి అడ్డు అని అంగీకరిస్తూనే, కులభేదాలు పాటించే వాళ్ళలో కూడా చాలా మందికి ఇరుగు పొరుగు వారి మీద నిజమైన ప్రేమ ఉండటం గమనించాడు కనుకనే వీటన్నింటికన్నా గొప్పది అసలు మనిషి క్యారెక్టర్ అనగలిగాడు. మనిషి అసలు గుణం ప్రేమ. సహజీవన సౌందర్యం. అంతే కానీ కులమూ మతమూ కాదు అని చెప్పదలచుకొన్నాడు చలం. ఆ రకంగా ఆయన జనజీవిత సంప్రదాయంలో సహజభాగంగా ఉన్న లౌకిక విలువల పట్ల గౌరవం కనబరిచాడు.

లోకంలో మనుషుల బాధల గురించి చింతిస్తూ చలం అంతా కర్మ అని సరిపెట్టుకోమనే బోధనల పట్ల అసహనం ప్రకటిస్తాడు. 'ఈశ్వరేచ్ఛ' అని బాధలకు బాధ్యత వహించకుండా తప్పించుకొనే పద్ధతిని నిరసిస్తాడు. కష్టాలు, దురదృష్టం నీకు ఒక్కడికేనా లోకంలో అందరికీ సామాన్యమే అనే ఓదార్పులు అతని దృష్టిలో అసంబద్ధమైనవి. బాధలు మనకే కాదు ఇతరులకు ఉన్నాయని తృప్తిపడమని చెప్పే వేదాంతంలోని అమానవీయతను ఏవగించుకొన్నాడు. అంతకన్నా మనకీ, వాళ్ళకీ ఎవరికీ బాధలు లేని మార్గం గురించి అన్వేషించటం మంచిది కాదా అని అంటాడు. ఈ సందర్భంలోనే **"మతగ్రంథాల్లో కనబడితే చాలు ఏదన్నా సంగతి దాన్ని గురించి మంచిచెడ్డలు విచారించే శక్తి ప్రజలకి పూర్తిగా నశిస్తుంది. అదంతా సత్యమేనని, ఎవరన్నా ప్రశ్నిస్తే వాళ్ళు దుర్మార్గులనీ"** అనుకొనే లోకపు తీరును గురించి చలం చెప్పిన మాట గమనించదగినది. మతగ్రంథాలలోని మంచిచెడ్డల విచార చర్చ నేరంగా ఆ నాటికే స్థిరపడ్డ వాస్తవం. డెబ్బై అయిదేళ్ల తరువాత అది ఎంతగా ఘనీభవించిందో మనం చూస్తూనే ఉన్నాం.

**"మతం పేరిట ఏ వికృతమైనా చలామణి అయినట్లే కవిత్వం పేరిట ఏ అసందర్భమైనా మెప్పు పొందుతుంది"** అంటాడు చలం. కవిత్వాన్నిగురించి వ్యాఖ్యానించటం సందర్భం. అందు కోసం మతాన్ని దాని స్వభావంతో కలిపి ఉపమానం చేసాడు. భార్యలతో సుఖంగా కాపురం చేయటం, పిల్లలను ప్రేమించటం పాపకార్యాలుగా చెప్పి నీతి పేరిట క్రూరత్వాన్ని, మతంపేరిట కలహాలను పుణ్యకార్యాలుగా చలామణిలోకి తెచ్చిన సనాతన ధర్మాన్ని నిరసించాడు చలం. ఈ దేశంలో మతం సగం సెంటిమెంట్లతో సగం మూఢ విశ్వాసాలతో కూడిన స్వార్థ ప్రధానమైన సరుకు అని అభిప్రాయపడ్డాడు.

'నాకు కోపం లేదు,' 'దెబ్బలాటలంటే భయం,' 'నేను కోర్కెలను అణుచుకోగలను' వంటి బడాయి మాటలు మాట్లాడే వాళ్ళను చచ్చు పీనుగలు అంటాడు చలం. ఇలాంటి చచ్చు పీనుగులు తయారు కావటానికి కారణం 'కులాలలో కులాల ఇంటర్ బ్రీడింగ్' అని పేర్కొన్నాడు. కులాంతర స్త్రీపురుష సంబంధాలు ఆరోగ్యకరమైనవి అని చలం భావిస్తున్నాడన్న మాట. అంబేద్కర్ చెప్పిన కులాంతర వివాహ భావనతో కలిపి దీనిని అధ్యయనం చేయవచ్చు.

శరీరం, యవ్వనం, సుఖ సంపదలు నశించిపోయేవి, ప్రేమ, కోపం మొదలైన సకల గుణాగుణాలు మనసు కల్పించుకొన్న వికారాలు, అసలు ప్రపంచమంతా మాయ అని చెప్తూ వైరాగ్యాన్ని బోధించే ఆలోచనా విధానాన్ని ప్రస్తావిస్తూ చలం **ప్రపంచమంతా మాయకావచ్చు కానీ అనుభవం మాయ కాదు** అని నొక్కి చెప్తాడు. అనుభవాన్ని కలిగించే సౌఖ్యాలు, అందాలు, విచారాలు మాయ కావు అంటాడు. తేలు కుడితే వేదాంతి అయినా 'ఇదంతా మాయ,' 'తేలు మాయ' అని నిర్వికారంగా చెప్పలేడన్నది ఆయన వాదన. "పాలికాపు నుదుటి చెమట/ కూలివాని గుండె చెరువు/బిచ్చగాడి కడుపు కరువు/ మాయంటావూ? అంతా/మిథ్యంటావూ ?/ నా ముద్దుల వేదాంతీ /ఏమంటావూ" అనే శ్రీశ్రీ కవితా పాదాలను ప్రస్తావిస్తూ **సుఖపడటం మాయ అయినా బాధపడటం అనేది మాయ కాదు** అని తీర్మానించాడు. ఆధ్యాత్మికానుభవంలోని ఆనంద కారక అనుకూల అంశాలను పూర్తిగా వెనక్కు నెట్టి, అన్ని సుఖాలు , కామాలు ఒదులుకోవలసినవి అని ఒత్తి బోధించటం మీదనే కేంద్రీకరించిన శంకరాచార్యుడి అద్వైతం మాయావాదంగా తప్పు మార్గం పట్టిందని చలం అభిప్రాయపడ్డాడు.

హిందువులకి వేదాంతం vaseline(వాసెలైన్), నల్ల మందు, బాధ నుంచి వేదాంతంలోకి వెళ్లి మనస్సుని సమాధాన పరచుకొని, తమ కరత్వంలో, స్వార్థంలో నిద్రపోతారు. అని ఆనాడు చలం అన్న మాట తీవ్రమైనదే కానీ అందులో వాస్తవం విస్మరించరానిది. వేదాంతం ఎక్కడికీ పోని గుడ్డి గల్లీ అని చలం అభిప్రాయం. లోకంలో బాధకి, మృత్యువుకి అర్థం తెలియ చెప్పలేని ఏ మతమూ విజ్ఞానం ఇయ్యలేదనీ ఊరికే చెప్పటం కాదు. మన రీసన్‌ని అవునని ఒప్పించాలనీ అంటాడు చలం. ఆ పని చెయ్యంది ఈ మతాలు మనుష్య జీవితానికి అనవస రంగా పట్టిన చీడలని, వృత్త మూర్ఖానికి, ద్వేషాలకి కారణాలని, ప్రతి ఉత్సాహానికి, ప్రయత్నానికి ఆటంకాలని చలం డెబ్బై ఐదేళ్లకు ముందే చెప్పిన మాటలోని సత్యాన్ని వర్తమాన అనుభవం నుండి బేరీజు వేసుకోవాలి. రీసన్‌ని ఒప్పించటం అన్నది కాలం చెల్లిన నాణెం కావటం వర్తమాన అనుభవం. రీసన్ అన్న మాటే ఈ రోజు దేశద్రోహకరమైన మాట.

సుఖ దుఃఖ అనుభవాలు గీటురాయిగా విలువలను నిర్ధారించే చలం ఆధ్యాత్మిక విద్య అన్నిటికన్నా గొప్ప సుఖమిస్తే వాంఛనీయమే అంటాడు. అయితే ఆ సుఖం ఇలాంటిదని రీసన్ ని ఒప్పిస్తూ రూఢిగా ఎవరూ చెప్పలేరు కనుక అదెంతవరకు సాధ్యమన్న సందేహాన్ని మనకోసం వదులుతాడు చలం. వ్యక్తులకు ఆధ్యాత్మిక అనుభవాలు ఉండవచ్చు, కానీ గొడవ ఎక్కడ వస్తుందంటే అవి నిజమని మన అందర్నీ నమ్మమని

ఒత్తిడి చేయటం లోనే అంటాడు చలం. ఆ రకంగా ఆయన వ్యక్తి అనుభవాలను, మనోభావాలను వ్యవస్థీకరించి మతంగా స్థిరీకరించటం పట్ల తద్వారా వ్యక్తి మీద అధికారం సంపాదించటం పట్ల పూర్తిగా వ్యతిరేకి.

ఆధ్యాత్మిక అనుభవం నైరూప్యం. ఆ అనుభవాన్ని పొందటానికి సాధనంగా సామాన్యులకు అందియ్యబడిన సాకార సగుణ ప్రతీక దేవుడు. దేవుడైనా మెదడులో పుట్టవలసిందేగా అని చెప్పి చలం దేవుడు 'స్వయంభువు' అనే వాదాన్ని తిరస్కరించాడు. **సమస్యలకు కారణం భగవత్ సంకల్పం, భగవంతుడు నిర్ణయించినట్లే అన్నీ జరుగుతాయి వంటి లోక వాక్యాలను ఆయన తిరస్కరించాడు.** ఈ కర్మకు ఈ శిక్ష అని నిర్ణయించేసి దేవుడు నిద్రపోయాడా లేక చచ్చిపోయాడా అన్నది చలం ప్రశ్న. **దేవుడే సృష్టికర్త అయితే తాను సృష్టించిన వారికి కష్టాలు కలిగించటం ఎందుకు? అంటాడు. కష్టాలను కల్పించి ఎంత ప్రార్థించినా, ఏడ్చినా కనికరించని దేవుడు రాయి కాక మరేమిటి అని ప్రశ్నిస్తాడు.** దేవుడు మూఢుల్ని, మోసగాళ్ళను ఎక్కువగా ప్రేమిస్తున్నట్లు తోస్తుంది అని అభిప్రాయపడ్డాడు. 'దేవుడి సహాయంతో మతగురువుల ప్రాపకంలో ఎటువంటి అన్యాయాల్నీ కర్మ కిందా, ఈశ్వరుడి దయ కిందా సమర్థించుకొంటున్నారు అదృష్టవంతులు' అని దేవుడి పేరు మీద అన్యాయం సామాజిక ఆధ్యాత్మిక సమ్మతిని సంపాదించుకొనటాన్ని చలం ఆనాడే గర్హించాడు. దేవుడు సెంటిమెంట్ , అసత్యం అని తెలుసుకొంటే జీవితం సౌఖ్యప్రదం అవుతుందని చలం భావించాడు.

దేవుడు ప్రత్యేక నామవాచకాలతో అనేక రూపాలు, జీవితాలు పొందుతాడు. వాటిని వర్ణిస్తూ పురాణేతిహాస కావ్య ప్రపంచం ఎంతో విస్తరించింది. అలా ప్రత్యేక జీవితాలు, గుణాలుగల శ్రీరామ కృష్ణులు ఇద్దరు మాత్రమే మ్యూజింగ్స్‌లో తరచు ప్రస్తావించబడ్డారు. కృషుడి వాస్తవత్వం, శ్రీరాముడి దైవత్వం గురించి చలం ఆలోచనలు, వ్యాఖ్యానాలు ఆసక్తికరం.

"రామ నామ్ కె దో అక్షర మే / సబ సుఖ శాంతి సమాయీ" అనే కె.సి. డె గ్రామఫోన్ పాట దగ్గర మొదలు పెట్టి రామ అనే శబ్దంలోంచే రామాయణం పుట్టిందా ? మంత్ర శాస్త్రంలో వున్న గొప్ప విలువను బట్టి సాధారణ ప్రజలలో దానిపట్ల ప్రేమ కలిగించటానికి రామాయణ కథ కల్పించబడిందా? ఆ పేరున్న రాజు కథ ఏదైనా దీనికి అంట కట్టబడిందా? అని చలం వేసిన ప్రశ్నలు ఆలోచనలను రేకెత్తించేవి. రామ శబ్దంలోని ధ్వని ప్రభావానికి శరీరం మీద, మనసు మీద, నరాల మీద అధికారం ఉందేమోనని దానికి ఉద్వేగపు విలువను ఇచ్చేందుకే రామాయణ కథ వ్రాయబడిందేమోనని చలం ఒక సంభావ్యతను ప్రతిపాదించాడు.

తాను ఒక స్నేహితుడిని కలవటానికి వెళ్ళినప్పుడు అక్కడ ఒక కన్నడ జ్యోతిష్యుడు తటస్థపడ్డాడని, మిత్రుడి పురమాయింపు మీద తన జాతక చక్రం వేసాడని చెప్పాడు చలం. లెక్కకు వచ్చే జాతక చక్రాలు రెండే అని ఒకటి శ్రీకృష్ణుడిది, మరొకటి శ్రీ రాముడిది అని చెప్తూ ఆయన చలంది శ్రీరాముడి చక్రం అని నిర్ధారించి అంటే జీవితమంతా కష్టాలు అని ముక్తాయించాడట. ఈ సందర్భంలో చలం శ్రీకృష్ణుడికి శ్రీరాముడికి ఉన్న భేదాల గురించి ప్రస్తావిస్తూ చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరమైనవి. కృష్ణుడు భోగాలు అనుభవిస్తూ, లీలలు ప్రదర్శిస్తుంటే రాముడు ఆదర్శాలూ, వాటికై యత్నం, ఆ మూలంగా తెచ్చి పెట్టుకున్న అశాంతి, బాధలూ, సంఘ ద్వేషం, అపవాదులూ మొదలైన వాటితో ఎన్నడూ సౌఖ్యమన్నది ఎరుగక జీవించాడని అంటాడు. రాముడు ప్రతి ఋషికి, కోతికీ, బైరాగికి లోకువైపోయాడనీ, ప్రతి వాళ్ళూ ఆయనకు యోగమూ, ధర్మమూ, వైరాగ్యమూ బోధించిన వాళ్లేనని ధర్మాలు వెలిగే యుగంలో స్వయంగా విష్ణువులో ముప్పాతిక అంశతో పుట్టిన శ్రీరాముడికి ఈ బోధల అవసరం ఏమిటి అని చలం వేసిన ప్రశ్నలో తిరస్కృత వాచ్యపు కొంటె తనం వినబడుతుంది. ధర్మరాజుతో కలిపి శ్రీరాముడికి ఎవరు బోధించినా చచ్చే దాకా జ్ఞానం వచ్చినట్లు లేదు అని విసుక్కొం టాడు కూడా. అదే అన్ని అల్లరి పనులు చేసిన శ్రీకృష్ణుడికి ఏమి చెప్పటానికి ఎవరికీ గుండెలు లేకపోయాయి అని కృష్ణుడి వ్యక్తిత్వం పట్ల అభిమానం ప్రకటిస్తాడు.

అసలు రాముడు తెలివి తక్కువ వాడని చలం ప్రతిపాదన. చిన్నప్పుడు చందమామ కోసం ఏడవటాన్ని బట్టి, అద్దంలో చూపించిన చందమామను అందుకొన్న సంతుష్టిని పొందటాన్ని బట్టి చలం అలా నిర్ధారించాడు. అందువల్లనే తండ్రి దగ్గర నుండి 'చాకలాడి' వరకూ ప్రతివాళ్లకూ చులకన అయినాడని భావించాడు. అలాంటి రాముడు ఆదర్శం ఏమిటన్నది చలం ప్రశ్న. **తన భార్యను తెచ్చుకోడానికి లక్షల కొలదీ కోతుల్ని వితంతువులను చేసిన రాముడి గురుత్వాన్ని అంగీకరించటం ఎంత వరకు సమంజసం అన్నది చలం విచికిత్స.** జీవించటం సుఖం కోసం అనే పథం నుంచి తప్పి జీవించటం అర్పణ కోసం అని భావించటం ఆత్మహత్య సదృశం అని భావిస్తాడు కనుకనే చలం అర్పణను విలువగా బోధించటాన్ని నిరాకరిస్తాడు. అర్పణ కు ఆచరణాత్మక ప్రమాణంగా శ్రీరాముడిని చూపించటాన్ని కూడా తిరస్కరిస్తాడు. జీవితంలోంచి సారాన్ని, సుఖాన్ని, సంతోషాన్ని పిండి పిప్పి చేయటమే కదా అర్పణ అంటే అన్నది ఆయన కోణం.

నివాసం ఉండే ఇంటి పక్క సినిమాహాల్ నుండి వినబడే పాటల గురించి చలం వ్యంగ్య వ్యాఖ్యలు మ్యూజింగ్స్ లో తరచు కనబడతాయి. కరుణాసింధో, కాంచనచేలా అంటూ రాముడిని సంబోధిస్తూ వచ్చే పాట అలాంటివాటిలో ఒకటి. ఆ

సంబోధనలలో కాంచనచేలా అన్నది చలం కి అభ్యంతరకరంగా అనిపించింది. కాంచనచేలా అంటే బంగారు ఉత్తరీయం వేసుకొన్నవాడా అని అర్థం. ఎక్కడైనా ఇలాంటి సంబోధనలు ఉంటాయా అని విస్తుపోతాడు చలం. ఆ సందేహాన్ని తన సహచర మిత్రురాలు లీల ముందు వ్యక్తం చేస్తే ఆమె అది పెద్దగా పట్టించుకోవలసిన విషయం కాదన్నట్లు అది సరేలే ఆ కరుణాసింధో ఏమిటి? అని మరొక సమస్య ముందు పెడుతుంది. అసలు శ్రీరాముడు ఎవరిపైన చూపాడు కరుణ? అని సవాల్ చేస్తుంది. ఆలోచించి చలం అహల్య అంటాడు. రాతిని నాతిగా చేసినవాడు అన్న కీర్తి రాముడికి ఉన్నమాట నిజమే కానీ, అందులో రాముడి దయ ఏమున్నది? శాపం ఇచ్చిన భర్తే విముక్తిమార్గంగా ఇచ్చిన వరం కదా అన్నది లీల అభిప్రాయం.

ఆంజనేయుడి మీద కరుణ చూపాడా అంటే అతను అంత సహాయం చేసాడు కదా! ఆ మాత్రం చూపకపోతే ఎలా? విభీషణుడి మీదా? అంటే అన్నను వ్యతిరేకించి వచ్చినవాణ్ణి తన కార్యసాధనకు బాగా ఉపయోగించుకున్నాడు ఇక ప్రత్యేకం చూపిన దయ ఏముంది? శబరి మీద చూపడా అంటే అది ఆమె ఘనత కానీ ఇతనిదేముంది? పూజిస్తానంటే బాగా పూజించమ న్నాడు అంతేగా!? అంటూ తర్కంతో నిరాకరించి చెప్పాడు. బాగా తెలివిగల వాళ్లకి, అన్నీ జాగ్రత్తగా విడదీసి ఆలోచించే వాళ్ళకి కూడా రామ భజనతో తలకెక్కిన భక్తి వల్లనో ఏమో ఇలాంటి సందేహాలు రాకపోవటాన్ని చలం పేర్కొన్నాడు. తనంతట తానుగా సాటి మనుషుల పట్ల కరుణ చూపే సందర్భం మనిషి జీవితంలో ఎప్పుడో ఒకప్పుడు వస్తుంది. కరుణ మనిషిలో ఉండే నైసర్గిక లక్షణం. కరుణాసింధో అని ప్రత్యేకంగా అనటానికి ఏదో గొప్ప కరుణ కనిపించాలి అంటాడు చలం. రాముడిలో అది కనిపించదు అన్నది చలం అభిప్రాయం.

శ్రీరాముడి సెన్స్ ఆఫ్ డ్యూటీ, (విధి నిర్వహణ నిబద్ధత) స్ట్రగుల్ (పోరాటం) గొప్పవని అంటారు. దానిని కూడా చర్చకు పెట్టి లీల ముఖంగా నిరాకరింపచేసాడు. విధి నిర్వహణ నిబద్ధత మెచ్చుకోదగినదేకానీ, ఆ విధి తనది అయినప్పుడు. తండ్రి సవతి తల్లికి ఇచ్చిన వరం తీర్చటానికి రాముడు అడవికి వెళ్ళటం చలం దృష్టిలో విధి నిర్వహణలో బాధ్యత కలిగి ఉండటం అని చెప్పటానికి వీలు లేనిది. నియమాలు, విధులు, ఆదర్శాలు ఏవైనా వ్యక్తులు తమ ఇష్టం ప్రకారం ఏర్పరచుకొనేవే కానీ ఎవరో పైనుండి రుద్దేవి కావు. **తండ్రులు, తాతలు, సంప్రదాయాలు, వంశ గౌరవాలు నిర్దేశించే విధినిషేధాల చట్రంలో మెలగటాన్ని సెన్స్ అఫ్ డ్యూటీ గా భావించరాదు అన్నది చలం అభిప్రాయం.** రామాయణం గొప్ప కావ్యం అయితే రాముడు ఆదర్శం కావాలా అన్నది చలం ప్రశ్న. రామాయణం వంటి రచనలను కావ్యాలుగా కాక మత గ్రంథాలుగా మార్చటం, పాత్రలను ఆదర్శంగా చూపటం అనర్ధ కారణం అంటాడు చలం. ఆదర్శాలు కాలాన్ని బట్టి, సామాజిక ధర్మాన్ని బట్టి కొత్తగా రూపొందుతుంటాయి అన్న వివేకం లేకుండా ఆ నాటి ఆదర్శాలనే ఈ నాడూ ఆదర్శాలనడం సరైంది కాదని అభిప్రాయపడ్డాడు.

ధర్మానికి మరో రూపంగా చెప్పబడే రాముడికి తన ధర్మమేదో తనకు తెలియదు అంటాడు చలం. చాకలి వాడో వశిష్టుడో చెప్తే గానీ రావణుడు చెరబట్టిన సీతను ఏలుకొనటం చేయగూడని పని అని తెలియనివాడు, తెలిసాక కూడా ఆ విషయాన్ని సీతకు ఎదుట పడి చెప్పటం ధర్మం అని కూడా తెలియనివాడు అంటూ చేయవలసినది చేయవలసి వచ్చినప్పుడు చెయ్యటం తెలియని వాడుగా రాముడి స్వభావాన్ని తేల్చేసాడు. సీతను వదిలెయ్యటం అనేది అతని లోపల్నించి వచ్చింది కాదని, ప్రజాభిప్రాయానికి కట్టుబడి, శాస్త్రానికి కట్టుబడి చేసిందని చెప్తూ ఆ రకంగా రాముడి ధర్మం బయటి విలువలకు కట్టుబడినదే అని నిర్ధారిస్తాడు చలం. పదహారు వేల మంది స్త్రీలతో ఏ సమస్యా కృష్ణుడికి రాలేదు. కానీ ఒక్క సీతతోనే శ్రీరాముడికి ఇన్ని సమస్యలు అని గుర్తించి చెప్పిన చలం అందుకు కారణం స్త్రీ పురుష ప్రేమ ధర్మం రాముడికి తెలియకపోవటం వల్లనే అని సూచిస్తాడు.

రామాయణం మహాకావ్యం అనటం వరకు చలం అంగీకరిస్తాడు. కానీ దివ్యచోదితం, ఆదర్శం అనటంతోనే అతనికి పేచీ. హిందూదేశంలో దాని ప్రేరణ ఈ నాడు అభివృద్ధికి గొప్ప ఆటంకం అని నిర్ద్వంద్వం గా ప్రకటించాడు. ఈ విధమైన చలం అవగాహనకు ఆయన ప్రజాస్వామిక చింతన సమకాలీన అంతర్జాతీయ ఫాసిస్టు వ్యతిరేక చైతన్య తలాన్ని ఎక్కడో స్పృశించి ఉండటమే కారణం అనిపిస్తుంది. ప్రభుత్వాలు ప్రజల బాహ్యక్షేమానికి చాలా ఉపకారాలు చేస్తున్నట్లు కనబడు తూనే లోపల లోపల వ్యక్తి స్వాతంత్రం హరించే ప్రక్రియ కొనసాగుతుండటాన్ని గ్రహించి చెప్పాడు. ఆ క్రమంలో ధిక్కరించే తిరుగుబాటూ, స్వతంత్రంగా యోచించే శక్తి చాలా నాజూగ్గా నొప్పిలేకుండా లాగేస్తూ ప్రభుత్వాలు అందుకు విద్యా, సంస్కృతి, లా, ఆర్డర్, దేశానికి ఉపద్రవ రక్షణ వంటి పెద్దపెద్ద పేర్లు పెడుతుంటారని అంటాడు చలం. 75 ఏళ్ల క్రితం రాముడి నుండి రాజ్యం వరకు చలం వేసిన ఈ ప్రశ్నలు, వెలిబుచ్చిన అభిప్రాయాలు, చేసిన వ్యాఖ్యలు ఈ నాటి మత రాజకీయ సందర్భాలను స్పృశించటం మనకు తెలుస్తూనే ఉంది. చలం వంటి వాళ్ళ ప్రశ్నలు వ్యాఖ్యలు సరిగా, సారంగా సాధారణ జనజీవితంలోకి ఇంకక పోవటం వల్లనే లౌకిక విలువల కోసం ఆరాటం, పోరాటం ఈ నాటి అవసరం అవుతున్నది. ❑

# ఫ్రాన్స్, బ్రిటన్ ఎన్నికల్లో ఫాసిస్టు, మితవాద శక్తులకు చావు దెబ్బ !



- ఎం.కోటేశ్వరరావు

**ఈ ఏడాది ప్రపంచంలో 50కి పైగా దేశాల్లో ఎన్నికలు జరుగుతుండగా ఇప్పటి వరకు 25 దేశాల్లో పాలకులు మారారు. ఆ పరంపరలో ఫ్రాన్స్, బ్రిటన్ చేరాయి. రెండు చోట్లా మధ్యంతర ఎన్నికలు జరిగాయి. అనూహ్య, ఉత్తేజం కలిగించే పరిణామాలు సంభవించాయి. అధ్యక్ష తరహా పాలన ఉన్న ఫ్రాన్సులో హంగ్ పార్లమెంటు ఏర్పడింది. నాలుగు కూటములు, అనేక స్వతంత్ర పార్టీలు పోటీపడినా ఏ కూటమి కూడా ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన సంఖ్యలో సీట్లు తెచ్చుకోలేదు. పార్లమెంటులోని 577 స్థానాలకు గాను వామపక్షాల కూటమి 188 సీట్లతో పెద్ద పక్షంగా అవతరించింది. ఫాసిస్టు శక్తుల ముప్పు తప్పింది.**



బ్రిటన్ ఎన్నికల్లో లేబర్ పార్టీ ఘన విజయం సాధించింది అనటం కంటే టోరీ(కన్సర్వేటివ్) పార్టీ చరిత్రలో తొలిసారిగా ఓటర్ల చేతిలో ఊచకోతకు గురైంది, అతి తక్కువ సీట్లు తెచ్చు కుంది. ఈ ఘనత భారతీయ మూలాలున్న రిషి సునాక్ ఏలుబడిలో జరిగింది. పార్లమెంటులోని 650 సీట్లకు గాను లేబర్ పార్టీ 411తో తిరుగులేని మెజారిటీ సాధించింది.

ఫ్రెంచి పార్లమెంటు ఎన్నికల తొలిదశలో ఫాసిస్టు శక్తులది పైచేయిగా ఉండటమే కాదు,ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన 289 సీట్ల కంటే ఎక్కువగా 297 స్థానాలలో ప్రథమ స్థానంలో ఉంది. పచ్చి మితవాద నేషనల్ రాలీ–ఆర్ఎన్ (గతంలో నేషనల్ ఫ్రంట్) ఐరోపా పార్లమెంటు ఎన్నికల్లో 31శాతం ఓట్లతో విసిరిన సవాలుతో అధ్యక్షుడు మక్రాన్ పార్లమెంటును రద్దు చేసి మధ్యంతర ఎన్నికలకు తెరతీశాడు. ఈ ఎన్నికల తొలిరౌండులో 33.21శాతం తెచ్చుకుంది.రెండవ రౌండ్‌లో 37.06శాతానికి పెంచుకుంది.వామపక్షాలతో కూడిన న్యూ పాపులర్ ఫ్రంట్ (ఎన్ఎఫ్ఇ) తొలి దఫా 28.21శాతం తెచ్చుకోగా మలి దశలో 25.81శాతం పొందింది. అధికారపక్షమైన టుగెదర్ కూటమి 21.28 నుంచి 24.53 శాతానికి పెంచుకుంది. పార్లమెంటు లోని 577 స్థానాలకు గాను జూన్ 30న జరిగిన ఎన్నికల్లో 76 నియోజకవర్గాలలో ఫలితాలు తేలాయి. ఆర్ఎన్ పార్టీ 37, వామపక్ష కూటమి 32, అధికార పక్షం రెండు స్థానాలు గెలుచు కున్నాయి. ఇతరులు ఐదుచోట్ల గెలిచారు. మిగిలిన స్థానాలకు ఏడవ తేదీన పోలింగ్ జరిగింది. త్రిముఖ పోటీ జరిగితే దేశ చరిత్రలో తొలిసారిగా పచ్చిమితవాదులు అధికారాన్ని కైవసం చేసుకుంటారని తేలింది. ఈ ముప్పును తప్పించేందుకు విధాన పరంగా ఎన్ని విబేధాలు ఉన్నప్పటికీ వామపక్ష కూటమి, అధికార పార్టీ ఒక అవగాహనకు వచ్చాయి. అదేమంటే ఆర్ఎన్ పార్టీ ఆధిక్యత ఉన్నచోట రెండవ స్థానంలో ఉన్న అభ్యర్థికి అనుకూలంగా మూడవ అభ్యర్థి ఉపసంహరించుకొని మద్దతివ్వ టంతో ఫాసిస్టు పార్టీ ఓట్ల రీత్యా పెద్దదిగా ఉన్నా సీట్లలో మూడవ స్థానానికి పడిపోయింది. రెండో దశలో సీట్ల సర్దుబాటు కారణంగా వామపక్ష కూటమి, అధికార కూటమి లబ్ది పొందాయి. వామపక్ష సంఘటనలో ఉన్న పార్టీలకు గతంలో 130 ఉండగా ఈసారి 188, అధికార ఐక్యత కూటమి కి 245 నుంచి 161కి పడిపోగా ఆర్ఎన్ పార్టీ కూటమికి 89 నుంచి 142కు పెరిగాయి. ప్రస్తుతానికి ఆ పార్టీ ప్రభుత్వ ఏర్పాటు ముప్పు తప్పినా ఓట్లపరంగా 37శాతానికి పెంచుకో వటం ప్రమాదకర పరిణామం. వామపక్ష కూటమి ఏర్పాటు చేసే ప్రభుత్వానికి అధికార ఐక్యత కూటమి మద్దతివ్వటం లేదా సంకీర్ణ ప్రభుత్వంలో భాగస్వామి కావటం తప్ప మరొక మార్గం లేదు. ఈ పరిణామంతో రానున్న రోజుల్లో అనేక అంశాలపై మక్రాన్ వైఖరిలో మార్పులు ఉంటాయని భావిస్తున్నారు. ఫలితాల్లో ఫాసిస్టు పార్టీ అధికారానికి రాదనే తీరు కనిపించగానే పారిస్‌తో సహా దేశమంతటా జనం వీధుల్లోకి వచ్చారు.

సంతోషం, ఆనందంతో కన్నీటి బాష్పాలు రాల్చారు. ఫలితాల మీద తొలి ప్రకటన వెలువడగానే ఎదురుగా ఉన్న వారు పరిచితులా, అపరిచితులా అన్నదానితో నిమిత్తం లేకుండా ఎవరుంటే వారిని వారిని హత్తుకున్న దృశ్యాలు కనిపించాయి. నిమిషాల తరబడి చప్పట్లు చరిచారు. ఫాసిస్టు శక్తులను ఓడించేందుకు పరస్పర విరుద్ధ వైఖరులతో పని చేస్తున్న పార్టీలు ఐక్యమైనపుడు విభేధాలను పక్కన పెట్టి అదే జనం మద్దతు ఇచ్చి గెలిపించినపుడు ఇలాంటి దృశ్యాలు ఆశ్చర్యం కలిగించవు.

ఐరోపా పార్లమెంటు, తొలిదశ ఎన్నికల్లో ఫాసిస్టు పార్టీ పెద్దదిగా అవతరించటంతో ఆందోళనకు గురైన అనేకమంది బరువు దించుకున్నారు. మరోవైపు ఫాసిస్టు పార్టీ అభిమానులు చిక్కినట్లే చిక్కి అధికారం దూరమైందన్నట్లుగా తీవ్ర ఆశాభంగం చెందారు. అయినా తమ కూటమి ప్రతిసారీ బలం పెంచుకుంటున్నదని సంతృప్తిని వెల్లడిస్తున్నారు. 2027లో అధ్యక్ష ఎన్నికలు జరగాల్సి ఉన్నందున ఏ కూటమి కూడా పార్లమెంటు ఎన్నికల సమయంలో ప్రకటించిన విధానాల నుంచి వైదొలిగే అవకాశాలు ఉండవు. ప్రజలిచ్చిన తీర్పుతో ఫ్రెంచి రాజకీయాలు కొత్త మలుపు తిరుగుతాయా, మక్రాన్ సర్కార్‌కు కొత్త ప్రభుత్వం గుదిబండగా మారుతుందా ? విదేశీ, అంతర్గత విధానాలపై మక్రాన్‌తో వామపక్షాలు విబేధిస్తున్న సంగతి తెలిసిందే. ఇలా అనేక సందేహాల మీద చర్చ ప్రారంభమైంది. ఫలితాలు వెలువడిన వెంటనే ప్రధాని గాబ్రియెల్ అతల్ రాజీనామా లేఖను పంపాడు. దాన్ని తాను ఆమోదించటం లేదని మక్రాన్ ప్రకటించాడు. ప్రభుత్వ ఏర్పాటుకు తొలి అవకాశాన్ని తమకే ఇవ్వాలని, ప్రభుత్వ ఏర్పాటుకు తాము సిద్ధంగా ఉన్నామని వామపక్ష కూటమి నేత జీన్ లక్ మెలెన్‌చోన్ ప్రకటించాడు. తాము గెలిస్తే హమాస్ అణచివేత పేరుతో మారణకాండ సాగిస్తున్న ఇజ్రాయిల్‌కు మద్దతిచ్చే వైఖరి ఉపసంహరించుకుంటామని, జనానికి ఉపశమనం కలిగించేం దుకు భారీ మొత్తంలో ప్రభుత్వ ఖర్చు పెంచుతామని వామ పక్షాలు ఎన్నికల ప్రణాళికల్లో వాగ్దానం చేశాయి. వామపక్షాల తీరు తీవ్రంగా ఉందని, ప్రభుత్వ ఖర్చు పెంచేందుకు అవసర మైన నిధులు కొన్ని సంపద పన్ను, అధికాదాయం వచ్చే వారి మీద పన్ను పెంపుదల వంటి అంశాలను అమలు జరిపితే దేశం నాశనం అవుతుందని, ఇప్పటికే దేశం అప్పుల ఊబిలో ఉందని మక్రాన్ వ్యాఖ్యానించాడు.

### బ్రిటన్ ఎన్నికలు

'లేబర్' సునామిలో కొట్టుకుపోయిన సునాక్ ముందే చెప్పు కున్నట్లు బ్రిటన్‌లో కూడా కొన్ని నెలల ముందే పార్లమెంటు ఎన్ని కలు జరిగాయి. 14 సంవత్సరాలుగా అధికారంలో ఉన్న టోరీ (కన్సర్వేటివ్ పార్టీ)ని ఓటర్లు ఊచకోత కోశారని కొందరు వ్యాఖ్యానించారు. రిషి సునాక్‌ను నేతగా ఎన్నుకొని తప్పు చేశామని అనేకమంది టోరీలు తలలు పట్టుకుంటున్నారు. గడచిన వందేండ్లలో ఇంత తక్కువ సీట్లు ఎప్పుడూ రాలేదని అంటున్నారు. పొదుపు చర్యల పేరుతో అమలు జరిపిన విధానా లతో జన జీవితం అతలాకుతలమైంది. అందుకనే ఈ సారి 650 స్థానాలకు గాను ఆ పార్టీకి 53 నుంచి 131 మధ్యలో సీట్లు వస్తాయని ఎగ్జిట్ పోల్స్‌లో పేర్కొనగా 121 వచ్చాయి. గతంలో ఉన్న వాటిలో 251 స్థానాలను కోల్పోయారు. మాజీ ప్రధాని లిజ్ ట్రస్, పన్నెండు మంది మంత్రులు మట్టికరిచారు. ఆశ్చర్యం ఏమిటంటే మూడవ పక్షమైన లిబరల్ పార్టీ ఈ ఎన్నికల్లో పదకొండు నుంచి 72 స్థానాలకు తన బలాన్ని పెంచుకుంది. టోరీ ప్రధానులుగా పనిచేసిన డేవిడ్ కామెరాన్, థెరెసామే ప్రాతినిధ్యం వహించిన స్థానాలను ఈ పార్టీ కైవసం చేసుకుంది. ఈ ఎన్నికలు మరొక రికార్డును కూడా సృష్టించాయి. 1918 తరువాత రెండు ప్రధాన పార్టీలకు వచ్చిన ఓట్లు 57.4 శాతమే. లేబర్ పార్టీ 33.7శాతం ఓట్లతో 411 సీట్లు (63.2 శాతం) తెచ్చుకోగా టోరీ 23.7 శాతం ఓట్లు, 121 సీట్లు (18.6 శాతం) తెచ్చుకున్నాయి. గ్రీన్స్ పార్టీకి 6.7శాతం ఓట్లు వచ్చినప్పటికీ కేవలం నాలుగు స్థానాలు(0.6శాతం) మాత్రమే వచ్చాయి. రిఫామ్(సంస్కరణ) యుకె పార్టీకి లిబరల్స్ కంటే ఎక్కువగా 14.3శాతం ఓట్లు వచ్చినా కేవలం 5(0.8శాతం) సీట్లు వచ్చాయి. డెమోక్రటిక్ యూనియనిస్టు పార్టీకి కూడా ఐదు సీట్లు వచ్చినా దానికి వచ్చిన ఓట్లు కేవలం 0.6శాతమే ఈ తీరును చూసిన కొందరు ఎన్నికల సంస్కరణలు అవసరమని సూచించారు. బ్రిటన్ పార్లమెంటు చరిత్రలో అధికారానికి వచ్చిన పార్టీ తక్కువ ఓట్లు తెచ్చుకోవటం ఒక రికార్డు, దాన్ని లేబర్ పార్టీ సొంతం చేసుకుంది. మూడు ప్రధాన పార్టీలకు 69.6 శాతం ఓట్లు 92.9 శాతం సీట్లు వచ్చాయి. చిన్న పార్టీలు ఓట్లు గణనీయంగా తెచ్చుకున్నట్లు ఈ గణాంకాలు వెల్లడించాయి. గత ఎన్నికలతో పోల్చితే ఈసారి 7.4శాతం తగ్గి 59.9శాతం ఓట్లు పోలయ్యాయి. దీన్ని బట్టి ఓటర్లు ఎన్నికల పట్ల పెద్దగా ఆసక్తి చూపలేదన్నది స్పష్టమైంది. లేబర్ పార్టీ గత ఎన్నికల కంటే కేవలం 1.7 శాతం, లిబరల్ పార్టీ 0.6శాతం మాత్రమే అదనంగా తెచ్చుకోగా టోరీలు 19.9శాతం కోల్పోయారు. అధికారంలోకి లేబర్ పార్టీ వస్తుందా లేదా అన్నదాని కంటే టోరీ పార్టీని వదిలించుకోవాలని ఓటర్లు భావించినట్లు ఈ అంకెలు స్పష్టం చేశాయి. లేబర్ పార్టీ పెద్ద విజయాన్ని సాధించగానే సమస్యలన్నీ పరిష్కారమైనట్లు భావించనవసరం లేదు. దాని ముందు ఎన్నో సవాళ్లున్నాయి. ప్రతిపక్షంలో ఉండగా పౌరుల కోసం కడవల కొద్దీ కన్నీరు కార్చే లేబర్ పార్టీ నేతలు అధికారానికి వచ్చిన తరువాత జనాన్ని

మరచిపోతారనే నానుడి ఉంది. గతంలో అది నిరూపితమైంది. దాని నేత కెయిర్ స్టామర్ కార్పొరేట్లకు అనుకూలమనే అభిప్రాయం ఉంది. దీనికి అనుగుణంగానే ఫలితాలు వెలువడిన తరువాత తొలిరోజు స్టాక్ మార్కెట్ సూచీ 0.86 పెరిగిందన్నది ఒక అభిప్రాయం.

ఈ ఏడాది తొలి మూడు మాసాల్లో జిడిపి వృద్ధి కేవలం 0.6శాతమే పెరగ్గా ధరలు రెండు పెరిగాయి. ఇతర అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే కరోనాకు ముందున్న ఉత్పాదకత, పెట్టుబడి రేట్లు తక్కువగా ఉన్నాయి. 1980 దశకంలో పెట్టుబడి రేటు 23 శాతం ఉండగా రెండు వేల సంవత్సరం నుంచి 17 శాతానికి అటూ ఇటూగా ఉంది. అదే ఇతర జి7 దేశాలలో 20-25 శాతంగా ఉంది. ఆదాయపన్నుతో సహా ఇతర పన్నులేవీ పెంచబోమని లేబర్ పార్టీ ఎన్నికల్లో చెప్పింది. పెంచకపోతే మరింత అప్పులపాలౌతామని, స్పష్టంగా వైఖరిని వివరించాలని టోరీల నేత రిషి సునాక్ పదే పదే లేబర్ పార్టీ నేతలను ప్రశ్నించాడు. ప్రస్తుతం జిడిపితో పోలిస్తే 100శాతం అప్పుల్లో, ద్రవ్యలోటుతో బ్రిటన్ ఉంది. దాన్ని అధిగమించాలంటే జనాన్ని పన్నులతో బాదాలని టోరీలు చెబుతున్నారు. జనంలో వ్యతిరేకత కనిపించటంతో మాజీ ప్రధాని లిజ్ ట్రస్ సర్కార్ పెద్ద ఎత్తున రుణాలు తీసుకున్నది. గత పద్నాలుగేండ్లుగా ఏదో ఒక పేరుతో ప్రభుత్వరంగ సిబ్బందికి వేతనాలను స్తంభింపచేశారు. కార్మిక సంఘాలన్నీ లేబర్ పార్టీ నిర్వహణలో ఉన్నందున వేతన సమస్య ప్రధానంగా ముందుకు రానుంది. దేశంలోని అతి పెద్ద థేమ్స్ నీటి కంపెనీ అప్పులపాలైంది. అయినా వాటాదార్లకు డివిడెండ్లు చెల్లిస్తున్నది. దివాలా తీసే స్థితిలో ఉన్నదాన్ని నిలబెట్టటం ఒక సమస్య. దీన్ని జాతీయం చేయవచ్చుని, అందుకు పెద్ద మొత్తంలో చెల్లిం చాల్సి ఉంటుందని చెబుతున్నారు. జైళ్లన్నీ 99 శాతం నిండి ఉన్నాయి. న్యాయవ్యవస్థ విఫలమైందనే విమర్శ కూడా ఉంది. నేరాలను ఎలా తగ్గించాలనే దానికంటే కొత్తగా జైళ్ల నిర్మాణం గురించి పాలకులు ఆలోచిస్తున్నారు. విశ్వ విద్యాలయాల నిర్వహణ ఖర్చు పెరిగింది. 2012 తరువాత ట్యూషన్ ఫీజులను పెంచలేదు. విదేశాల నుంచి వచ్చే విద్యార్థులు కూడా తగ్గుతున్నారు. దీంతో వాటి రాబడి పడిపోతున్నది. బ్రిటన్ పెద్ద సమస్యల్లో ఇదొకటి. ఆరోగ్యరంగ బడ్జెట్ లోటులో ఉంది. చికిత్సకు పట్టే వ్యవధి రోజు రోజుకూ పెరుగుతోంది. మౌలిక సదుపాయాలు దెబ్బ తింటున్నాయి. సేవలను మెరుగు పరచాల్సి ఉంది. టోరీల పొదుపు చర్యల కారణంగా స్థానిక సంస్థలు ఇబ్బందులు పడుతున్నాయి. 2018 నుంచి ఇప్పటి వరకు ఎనిమిది సంస్థలు దివాలా ప్రకటించాయి. ప్రస్తుతం ప్రతి ఐదింటిలో ఒకటి అదే బాటలో ఉన్నది. ఈ పూర్వ రంగంలో లేబర్ పార్టీ ముందు పెద్ద సవాలే ఉంది. ❑

## ఆగస్టు 9న 'కార్పొరేట్స్ క్విట్ ఇండియా డే'


(32వ పేజీ తరువాయి)

- ప్రభుత్వ రంగం కింద అన్ని పంటలకు, పశుపోషణకు సమగ్ర బీమా కవరేజీ ఇవ్వాలి. రైతు వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల పీఎంఎఫ్‌బీవై పథకాన్ని రద్దు చేయాలి.
- రైతులు, వ్యవసాయ కార్మికులందరికీ నెలకు రూ.10 వేలు పెన్షన్ ఇవ్వాలి.
- భూసేకరణ, పునరావాస చట్టం-2013ని అమలుచేయాలి. దేశమంతటా ప్రతి సంవత్సరం భూమి సర్కిల్ రేటును సవరించాలి. ప్రభుత్వ, ప్రైవేట్ రంగం ప్రాజెక్టుల కోసం అక్రమంగా సేకరించడం వల్ల భూమిని కోల్పోయిన వారంద రికీ తగిన పరిహారం అందించాలి. బుల్డోజర్ రాజ్‌కు ముగిం పు పలకాలి. ముందస్తు పునరావాస ఏర్పాట్లు చేయకుండా మురికివాడ, నివాసాల కూల్చివేతను ఆపాలి.
- వ్యవసాయంలో కార్పొరేటీకరణ ఆపాలి. వ్యవసాయ ఉత్పత్తి, వాణిజ్యంలో బహుళజాతి కంపెనీలు వద్దు. వ్యవసాయంపై డబ్ల్యూటీఓ ఒప్పందం నుంచి ఇండియా బయటకు రావాలి.
- ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు, విద్యుత్, నీటి పారుదల, పెట్రోలియం ఉత్పత్తులు, యంత్రాలు, ట్రాక్టర్లు వంటి వ్యవసాయ ఇన్‌పుట్‌లపై జీఎస్టీ ఆపాలి.
- రాజ్యాంగంలోని సమాఖ్య సూత్రాల ప్రకారం పన్ను విధించే రాష్ట్ర ప్రభుత్వాల హక్కును నిర్ధారించడానికి జీఎస్టీ చట్టాన్ని సవరించాలి.
- జీడీపీలో తగిన వాటాతో వ్యవసాయం కోసం ప్రత్యేక కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టాలి.
- కేంద్ర ప్రభుత్వంలో సహకార మంత్రిత్వ శాఖను రద్దు చేయాలి. రాజ్యాంగంలో పొందుపరిచిన విధంగా సహకా రాన్ని రాష్ట్ర అంశంగా ఉంచాలి. ఉత్పత్తి వర్గాలైన రైతులు, కార్మికుల ఖర్చుతో కార్పొరేట్ వర్గ ప్రయోజనాల కోసం అధికార కేంద్రీకరణను ప్రోత్సహించే బదులు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు మద్దతు ఇవ్వాలి.
- వన్యప్రాణుల ముప్పు కోసం శాశ్వత పరిష్కారాన్ని నిర్ధారిం చాలి. ప్రాణనష్టానికి పరిహారంగా రూ.కోటి, పంటలు, పశు వుల నష్టానికి తగిన పరిహారం అందించాలి.
- లఖింపూర్ ఖేరీ అమరవీరులతో సహా చారిత్రాత్మక రైతుల పోరాట అమరవీరుల కుటుంబాలకు పరిహారం అందించాలి.
- రైతుల పోరాటానికి సంబంధించిన అన్ని కేసులను ఉపసం హరించుకోవాలి. 736 మంది రైతు అమరవీరుల స్మారకా ర్థం సింగు, టిక్రీ సరిహద్దులో అమరవీరుల స్మారక స్థూపాన్ని నిర్మించాలి. ❑


గ్యారంటీ లీక్




తడిచిపోయింది




అప్పుడే కాదు..






కార్టూన్స్ : సతీష్ ఆచార్య


**RNI Title Code : APTEL 16175 - DAARI DEEPAM (Telugu Monthly)**


Vol : 2 - Issue No : 10 July 2024

## కొత్త పుస్తకాల స్వీకారం




if undeliverd please return to:
**B.Ramesh Chandra Babu**
34-15-1, Doddipatla Vaari Thota
Veedhi, Tanuku - 534 211
West Godavari, Ap
Phone No : 93971 14495

Printed Matter - Book Post

To :

Printer, Publisher and Owner Bhupatiraju Ramesh Chandrababu, Published from 34-15-1, Doddipatla Vaari Thota Veedhi, Tanuku - 534 211, AP. Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, 520 004. Editor : DVVS Varma.